www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 16 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి మాఘ శుద్ధ త్రయోదశి
10-16 ఫిబ్రవరి 2025
వెల : ₹20/-



# అత్యున్నత న్యాయపీఠానికి అమృతోత్సవం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

జై శ్రీరామ్..!

భారత్ మాతాకీ జై..!!

# గ్రాడ్యుయేట్ల చూపు
# అంజిరెడ్డి వైపు



## నమస్కారం..!

- నేను మీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించాను.

- మానవ సేవే మాధవ సేవ అనే భావనతో 2002లో ఎస్ఆర్ ట్రస్ట్ స్థాపించి గత రెండు దశాబ్దాలుగా ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య శిక్షణ, క్రీడలు. ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుతో ఉచితంగా త్రాగునీటిని అందిస్తూ మొదలగు రంగాల్లో సమాజ సేవ చేస్తున్నాను

- నా సమాజ సేవను, పార్టీ పట్ల అంకిత భావాన్ని గుర్తించి పట్టభద్ర ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించిన బిజెపి నాయకత్వానికి ధన్యవాదాలు.

**1** పట్టభద్రుల గొంతుకై వస్తున్న నాకు మీ మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను.

సంఘే శక్తి కలౌ యుగే



## మీ..డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ఉమ్మడి కరీంనగర్ -ఆదిలాబాద్- మెదక్ - నిజామాబాద్
బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రండి..
## జాతీయభావాల వేదిక
## జాగృతి చందాదారులుగా
## చేరుదాం.. చేర్పిద్దాం!




తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్
(మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి
పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**విడి ప్రతి**
**రూ.20/-**

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : **040-2756 1453, 99599 97013**

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

సభా మర్యాదలను ఉల్లంఘించడంలో ప్రతిపక్షాలుగా చెలామణి అవుతున్న కాంగ్రెస్, దాని తైనాతీలు వాటి రికార్డును అవే బద్దలు కొట్టుకుంటున్నాయి. ప్రధానిమంత్రినో, ఆయన మంత్రివర్గ సహచరులనో, బీజేపీనో, దాని నాయకులనో విమర్శిస్తే అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రపతిని కూడా అమర్యాదకరమైన భాషతో దూషిస్తున్నారు. ఎన్నికల సంఘాన్ని అధికార పార్టీ జేబు సంస్థగా తూలనాడడం సరే, న్యాయ వ్యవస్థలో నిమ్నకులాలకు స్థానం లేదని చెప్పడం మరొకటి. బడ్జెట్‌కు ముందు హల్వా తయారీలో బడుగులకు చోటు లేదనడం మరొక వికృత ఆరోపణ. ఆయన కాంగ్రెస్ పార్టీకి నామమాత్రపు అధ్యక్షుడే కావచ్చు. కానీ ప్రయాగ్‌రాజ్‌లో వేలాది మంది చనిపోయారని మాట్లాడడం, మృతదేహాలను నదిలోకి విసిరేశారని ఆరోపించడం, దీనికి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ వంత పాడడం అత్యంత జుగుప్సాకరంగా కనిపిస్తున్నది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగాన్ని అవమానకరమైన తీరులో వ్యాఖ్యానించడం దీనికి పరాకాష్ట.

బడ్జెట్ ప్రసంగాన్ని రాష్ట్రపతి ముర్ము సరిగా చదవలేకపోయారట. ఆమె అలసిపోయారట. 'పూర్ లేడీ' అట. ఇవి కాంగ్రెస్ నాయకురాలిగా, రాజ్యసభ సభ్యురాలిగా తిష్ట వేసిన సోనియా అన్న మాటలు. సోనియా బహిరంగ సభలలో చదివిన ఉపన్యాసాలు జనాన్ని ఎంత విసిగించేవో మనకి తెలియదా? రాసుకున్న ఉపన్యాసం తెచ్చి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించడంలో సోనియాకు సోనియాయే సాటి కాదా! అసలు ఆది నుంచి కూడా రాష్ట్రపతి ముర్ము పట్ల ఆ పార్టీ చులకన భావంతోనే ఉంది. 'రాష్ట్రపతి' అంటూ ఇంతక్రితం లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధీర్‌రంజన్ చౌధురి వ్యాఖ్యానించి దేశ ప్రజలందరి చేత ఛీ అనిపించుకున్నాడు. ఇప్పుడు సోనియా అన్న మాటలు కూడా అధీర్ మాటలకి, చేసిన అవమానానికి తక్కువేమీ కావు. దీని మీద సహజంగానే దేశంలోని గిరిజన వర్గం భగ్గున మండింది. సోనియా మీద, ఇలాంటి కూతలే కూసిన బిహార్ ఇండిపెండెంట్ ఎంపీ పప్పు యాదవ్ (లోక్‌సభ) మీద బీజేపీ ఎంపీలు హక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు. ముర్ము చదివినది బడ్జెట్ ప్రసంగం వలె కాకుండా ప్రేమలేఖ వలె ఉన్నదని ఈ ప్రబుద్ధుడు

**శాలివాహన 1946 శ్రీ క్రోధి మాఘ శుద్ధ త్రయోదశి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**అత్యున్నత న్యాయపీఠానికి అమృతోత్సవం**

6లో

ధారావాహిక నవల

**తూర్పు-పడమర**

– గన్నవరపు నరసింహమూర్తి

13

20లో



రెండంచుల కత్తి

**మంచీ చెడుల కూడలిలో ఏఐ!**

23లో



# జాగృతి

## సంపాదకీయం

వాగడం విడ్డూరమే. ఈ ఇద్దరి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసిందని అటు రాజ్యసభ చైర్మన్‌కు, ఇటు లోక్‌సభ స్పీకర్‌కు గిరిజన ఎంపీలు వినతిపత్రాలు సమర్పించారు. సోనియా వాగుడును ఆ ఎంపీలంతా తీవ్రంగా పరిగణిస్తున్నారనీ, అందుకే ఆమెపై చర్య తీసుకోవలసిందిగా రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్‌కు వినతిపత్రం ఇచ్చారనీ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు కూడా. రాష్ట్రపతి హోదాను దిగజార్చే విధంగా ఆ ఇద్దరు ఎంపీలు మాట్లాడారన్నదే ఆదివాసీ ఎంపీల ఫిర్యాదు.

## రాష్ట్రపతిని దూషించడం ఆపండి!

ఇక కుంభమేళా జరిగిన తొక్కిసలాట గురించి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిండు సభలో చేసిన వ్యాఖ్యలు మరీ నీచం. వాటిని వెనక్కి తీసుకోకుండా మేకపోతు గాంభీర్యం ప్రకటిస్తూ ఆయన తరువాత చెప్పిన మాటలు మరీ కేతిగాడి మాటలను తలపించాయి. ప్రయాగరాజ్ తొక్కిసలాటలో వేలాదిమంది చనిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నోటికి అడ్డూ ఆపూ లేకుండా అనేశారు. దీనితో అధికార పక్షం భగ్గుమంది. ఆ మాటను వెనక్కి తీసుకోవాలని, లేదంటే నిరూపించాలని రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ఖర్గేను ఆదేశించారు. తనది తప్పే అయితే సవరించుకుంటానని, కానీ ప్రభుత్వం మృతుల అసలు లెక్క వెల్లడించాలని అన్నారాయన. ఇక బాధ్యత రాహిత్యంతో మాట్లాడడంలో దిట్ట అయిన రాహుల్ గాంధీ అయితే, మోదీని అమెరికా పిలిచేటట్టు చేసుకునేందుకే మన విదేశాంగ మంత్రి మూడు నాలుగు సార్లు అగ్రరాజ్యానికి ప్రయాణం కట్టారని ఆరోపించారు. ఇదో చచ్చుపుచ్చు ఆరోపణ అని మంత్రి ఎస్. జైశంకర్ వెంటనే ఖండించారు. అంతకు ముందే రాహుల్ పీవీపై మరొకసారి నీచమైన విమర్శ చేశారు. 1990లలో తమ పార్టీ దళితులకు న్యాయం చేయలేకపోయిందట. మరి పీవీ ప్రధాని కదా! ఈ మాటను ఆంధ్రులు సహించగలరా?

తమ అధినేతలను మెప్పించేందుకు ఖర్గే, జయాబచ్చన్ వంటి నేతలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. కుంభమేళాలో మునిగితే నిరుద్యోగం పోతుందా అని ప్రశ్నించారు ఖర్గే. మరి జైపూర్ దర్గాకి చదర్ సమర్పిస్తే పోతుందా? వక్ఫ్‌బోర్డుకి ఎడాపెడా హక్కులు కల్పించి దేశాన్ని విధ్వంసం దిశగా నెట్టివేయడం పేదరికం పోవడానికే ఏమో ఆ నేతలే చెప్పాలి. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్‌ను మెప్పించే క్రమంలో జయా బచ్చన్ హోదా మరచిపోయారు. ప్రయాగరాజ్ కుంభమేళా నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం సెవెంటీ ఎంఎంలో విపక్షాలకు కనిపిస్తున్నదట. పుష్కరం కిందటి కుంభమేళాలో అదే ప్రయాగరాజ్‌లో 42 మంది చనిపోయిన సంగతి తెలిసి కూడా జయ వంటివారు ఇలాంటి వెన్నెముక లేని మాటలు మాట్లాడుతున్నారు. ఆనాటి కుంభమేళా నిర్వహణకు నాయకత్వం వహించినదే వివాదాస్పద ముస్లిం నాయకుడు ఆజామ్‌ఖాన్. అసలు ఒక హిందూ సమ్మేళన నిర్వాహకునిగా ముస్లింను ఎలా నియమించారు? దీని గురించి అడగగలదా ఆమె? అదే చేస్తే మరొకసారి రాజ్యసభ సీటు రాదుగా!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయంటే ఏదో ఒక రాద్ధాంతాన్ని తెచ్చి భగ్నం చేయడం విపక్షాలకు పరిపాటిగా మారింది. రఫేల్, ఆదానీ వంటి అస్త్రాలన్నీ తుప్పు పట్టాయి. టూల్‌కిట్ దాదాపు మూత పడింది. అది హిండెన్‌బర్గ్ దుకాణం కట్టేయడంతోనే రుజువైంది. కాబట్టి ప్రయాగరాజ్ తొక్కిసలాటను రంగం మీదకు తెచ్చారు. వక్ఫ్ బిల్లును సభలో ప్రవేశపెడతారన్న వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. తాజా బడ్జెట్ దేశ ప్రజలను విశేషంగా ఆకర్షించిన సంగతిని తట్టుకోలేకనే ఈ రగడ లేవదీశారనీ చెప్పవచ్చు. ★

10 ఫిబ్రవరి 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

జీవనది

– హైమా భార్గవ్





| | | | | | |
|---|---|---|---|---|---|
| కులగణన తప్పుల తడక..బీసీ నేతల మండిపాటు (తెలంగాణ) | - | 14 | విషం కక్కుతున్న విదేశీ పత్రికలు (చర్చ) | - | 30 |
| రాష్ట్ర ప్రగతికి ఊతం కేంద్ర బడ్జెట్ (ఆంధ్రప్రదేశ్) | - | 16 | విస్మయం - కొయిలాడ రామ్మోహన్‌రావు (కథ) | - | 32 |
| భారత్‌పైకి రొహింగ్యాలను దువ్వుతున్న.. (అంతర్జాతీయం) | - | 22 | ఐసీసీ అవార్డుల్లో ముగ్గురూ ముగ్గురే! (క్రీడ) | - | 43 |
| నేరగాళ్ల రక్షణే కాంగ్రెస్ పని (వేదిక) | - | 26 | వారఫలాలు | - | 48 |
| జానపద గాన'మాలిని' (మహిళ) | - | 28 | పద్మ పురస్కారాలు- కినుకలు.. కలతలు... (సినిమా) | - | 50 |

యతో ధర్మస్తతో జయ: (ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడే విజయం పరిఢవిల్లుతుంది). భారత అత్యున్నత న్యాయస్థానం నినాదం ఇదే. భారత అత్యున్నత న్యాయస్థానం ప్రస్థానంలో అలాంటి విజయాన్నే మనం దర్శించుకోవచ్చు. ఇది మహాభారతంలో పదే పదే ప్రస్తావనకు వచ్చే శ్లోకపాదం. నిజానికి చట్టం, న్యాయం అనే వ్యవస్థలు కూడా పురాతనమైనవే. సనాతనమైన వ్యవస్థలే. ఒక సమాజం అభివృద్ధి చెందింది అని చెప్పడానికి కొండ గుర్తు విజయవంతమైన న్యాయ వ్యవస్థ కొనసాగడమే కూడా. నీవు శాంతిని కోరుకుంటే ఒక న్యాయవాది న్యాయం కోసం పోరాడినట్టు పోరాడు అంటాడు సిసిరో. ఆ క్రమం ఇలా చెప్పారాయన. న్యాయం అనే దేవాలయానికి పూజారులు న్యాయవాదులు. న్యాయవాదులు అంటే శాంతి స్థాపకులనే ప్రజలు కూడా భావిస్తారు. రాజ్యాంగం ప్రకారం పౌరులకు హక్కులు ఇచ్చామంటేనే సరికాదు. అలాంటి హక్కులు కేవలం నీటి బుడగలు. హక్కులకు విలువ ఎప్పుడు వస్తుందంటే స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఒక న్యాయ వ్యవస్థ ఉన్నప్పుడు మాత్రమే. ఆ పని న్యాయవాదుల ద్వారా న్యాయమూర్తులు అమలు చేస్తారు. అలాంటి న్యాయవ్యవస్థకు శిఖరమే సుప్రీంకోర్టు. ఇవన్నీ భారత సుప్రీంకోర్టుకూ వర్తిస్తాయి.



# అత్యున్నత న్యాయపీఠానికి

వందల ఏళ్ల పోరాటంతోనే భారతదేశానికి స్వాతంత్ర్యం సాధ్యమైంది. రాజ్యాంగం కూడా అంతే. ఆ తరువాతే భారత స్వతంత్ర అత్యున్నత న్యాయ స్థానం ఆవిర్భవించింది. కానీ చట్టం, ధర్మం, శిక్ష, పాలన, చట్టాలకు వ్యాఖ్యానం ఇవన్నీ మన పురాతన భారతదేశానికి తెలియనివి మాత్రం కావు.

ప్రపంచంలోనే అత్యంత పురాతన న్యాయ వ్యవస్థ భారతీయులదేనని అంటారు జస్టిస్ ఎస్ఎస్ ధావన్ (అలహాబాద్ హైకోర్టు). ప్రస్తుతం మనం అమలు చేసుకుంటున్న న్యాయ వ్యవస్థ మూలాలు పాశ్చాత్యులవే కావచ్చు. కానీ వీటి కోణం నుంచి మన పురాతన న్యాయ వ్యవస్థను పరిశీలించడం సరికాదు. అలాగే బ్రిటిష్ జాతే ఈ దేశానికి న్యాయవ్యవస్థను అందించిందనడం కూడా చారిత్రక దృక్పథం కాలేదు. వాస్తవం ఏమిటి? మన పాలకులు కొందరు ధర్మ గంటను ఏర్పాటు చేశారు. మనుషులకే కాదు, నోరు లేని జీవులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పం ఉన్నవారు. అందుకు సాక్ష్యమే, ఆవు, లేగదూడ, రాజపుత్రుని మరణ దండన కథ. తన షరతులకు అంగీకరిస్తే తప్ప ఒక మత్స్యకారుడు తన కుమార్తెను రాజుకు ఇచ్చి వివాహం చేయడానికి నిరాకరించిన సన్నివేశం మహాభారతంలో కనిపి స్తుంది. ఇది ఈ దేశంలో ప్రజలకు ఉన్న స్వేచ్ఛ. ఒక పాలకుడు పదవీ బాధ్యతలను విస్మరిస్తే అతడిని కుక్కను కొట్టి చంపినట్టు చంపాలి అంటుంది మహా భారతం. తమను రక్షించలేని, తమ ఆస్తులకు రక్షణగా నిలవలేని రాజును రాజు అనలేం. వ్యవస్థకు అతడొక దురదృష్టం అని కూడా ఆ మహా కావ్యం వ్యాఖ్యానించింది. దేశ ప్రజల పట్ల తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వారిని సంతోషపెట్టడమే, రాజుకు కూడా సంతోషదాయకమవుతుందని కౌటిల్యుని అర్థశాస్త్రం సూత్రీకరించింది. వివిధ రకాల వివాదాలకు, వివిధ రకాల న్యాయస్థానాలు ఉన్నాయని బృహస్పతి స్మృతి ద్వారా తెలుస్తుంది. ప్రాడ్వివాక, లేదా అధ్యక్ష అన్నది అత్యున్నత న్యాయ మూర్తికి ఉన్న పేరు. ఇవి మన పురాతన న్యాయ వ్యవస్థ విరాట్రూపాన్ని గమనించడానికి కొన్ని రుజువులు మాత్రమే.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రెండు రోజుల తరువాత నుంచి భారత సుప్రీం కోర్టు ఉనికి లోనికి వచ్చింది. అత్యున్నత న్యాయస్థానం ప్రధాన విధి రాజ్యాంగ రక్షణ. ప్రాథమిక హక్కులకు రక్షణగా నిలవడం కూడా. అలాగే అప్పీళ్లను విచారించడం. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన అప్పీళ్లను ఇది పరిశీలిస్తుంది. భారత పార్లమెంట్ చేసిన చట్టాలను మార్చకున్నా, దాని గురించి అభిప్రాయం చెబుతుంది. చట్టాల సమీక్ష కూడా సుప్రీంకోర్టు బాధ్యతే. కొన్ని తీవ్ర వివాదాలను నేరుగా కూడా విచారణ జరుపుతుంది. ఏకసభ్య ధర్మాసనం మొదలు, 13 మంది న్యాయమూర్తుల ధర్మాసనం వరకు (కేశవానంద భారతి వర్సెస్ కేరళ ప్రభుత్వం,1973) న్యాయస్థానం వ్యాజ్యాన్ని బట్టి పరిస్థితులను చర్చించి తీర్పులు ఇచ్చిన చరిత్ర ఉంది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేశాయి. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, మైనారిటీలు ఎవరైనా చట్టం పరిధిలోనే వారి కేసులను పరిష్కరించింది. మత విశ్వాసాలకు, ప్రాంతీయ తత్వాలకు, ప్రలోభాలకు లోనుకాకుండా మన సుప్రీంకోర్టు తన తీర్పులు వెలువరించింది. తీర్పులను మార్చడానికి, న్యాయ మూర్తులను ప్రభావితంచేసే తీరులో సుప్రీం నిర్ణయం షరియాకు వ్యతిరేకమని ఆ వర్గం చెబుతున్నా, అత్యున్నత న్యాయస్థానం మహిళలకు జరగవలసిన న్యాయాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకుని షాబానో కేసులో సంచలన తీర్పు ఇచ్చింది. షాబానో తీర్పు అనంతర పరిణామాలు ఉన్నప్పటికీ ట్రిపుల్ తలాక్ పద్ధతి చెల్లదని సుప్రీంకోర్టు చెప్ప గలిగింది. మహిళ ఆత్మ గౌరవాన్ని కించపరిచినా, సమన్యాయానికి దూరం చేసినా వివక్ష చూపినా ఆ వ్యవస్థ న్యాయ వ్యవస్థ ఆగ్రహానికి గురికాక తప్పదు అని జస్టిస్ దీపక్ మిశ్రా ఒక కేసులో ప్రకటించిన సంగతిని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. కానీ ఆ షాబానో అనుకూల తీర్పును తుంగలో తొక్కి, బుజ్జగింపు ద్వారా మతోన్మాద శక్తులకు ఊతమివ్వడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న సమయంలో దానితో ఉన్న ప్రమాదం గురించి కూడా ఒక న్యాయమూర్తి చాలామంచి వ్యాఖ్య చేశారు. మనలని వేలిముద్ర వేసే స్థాయి నుంచి సంతకం చేసే వరకు తీసుకు వెళ్లినది విద్యే. కానీ సాంకేతిక పరిజ్ఞానం మనలని సంతకంచేసే స్థాయి నుంచి వేలిముద్ర (థంబ్ ఇంప్రషన్) స్థాయి మళ్లీ తీసుకు వచ్చింది అన్నారు జస్టిస్ ఏకే సిక్రి. వందమంది దోషులు తప్పించుకున్నా, ఒక నిర్దోషికి శిక్ష మాత్రం పడకూడదన్న సూత్రాన్ని కూడా న్యాయవ్యవస్థ గౌరవించింది. పేదరికమే అన్ని నేరాలకు మూలమని, ఆకలి ఏ మనిషినైనా దొంగలా మారుస్తుందని సుప్రీంకోర్టు కూడా భావించినట్టు కనిపిస్తుంది. అదే నిజం కూడా. కాబట్టి ఈ క్రమంలోనే వ్యవస్థ మార్పుమీద కొన్ని కఠిన వ్యాఖ్యలు కూడా చేయవలసి వచ్చింది.

సుప్రీంకోర్టు ప్రస్థానాన్ని పరిశీలిస్తే చాలా ఆశ్చర్యంగాఉంటుంది. వలసపాలన మిగిల్చిన సమస్యలను ఒక్కొక్కటిగా తెంచుకుంటూ వచ్చింది.



# అమృతోత్సవం

1947–1964 మధ్య ఆస్తి హక్కు గురించి ఒక స్పష్టత రావడానికి ఆస్కారం కల్పించే పరిణామాలు కనిపిస్తాయి. 1965 నుంచి 1993 వరకు రాజ్యాంగ సవరణల గురించి తన వైఖరి ఏమిటో వివరించిన సమయంగా కనిపిస్తుంది. 1993–2018 న్యాయ మూర్తుల నియామకానికి సంబంధించి విధి విధానాలపై సూత్రీకరణలు జరిగాయి. అయితే భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇంత బలోపేతమైన పృటికీ కేంద్రానికీ, అత్యున్నత న్యాయస్థానానికీ మధ్య కొన్ని విభేదాలు రాకపోలేదు. అందులో ముఖ్యమైనది కొలీజియం వ్యవస్థ. కేసుల జాప్యం విషయంలోను సుప్రీంకోర్టుకు కొన్ని సమస్యలు ఉన్నాయి. భారత అత్యున్నత న్యాయస్థానం ముందు 80,439 (2023 నాటికే) కేసులు పరిష్కారం కోసం వేచి ఉన్నాయి. న్యాయం చేయడంలో జాప్యం, న్యాయం అందిం చడంలో వైఫల్యమేనన్న సూత్రం ఇక్కడ అత్యున్నత న్యాయస్థానానికి కూడా వర్తిస్తుందని కొందరు అంటారు. వాటిని త్వరితంగా పరిష్కరించాలి. రాజ్యాంగాన్ని సవరించే హక్కు ఉన్నప్పటికీ మౌలిక స్వరూపాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చలేదనీ (కేశవా నందభారతి కేసు), రాష్ట్రాల మీద కేంద్ర పాలన విధింపునకు పరిమితులు ఉన్నాయని (ఎస్ఆర్ బొమ్మయ్ కేసు), పనిచేసే చోట మహిళల లైంగిక వేధింపుల నిరోధం (వైశాఖ వర్సెస్ రాజస్తాన్ కేసు), ప్రాథమిక హక్కుల రక్షణకు ఇంకా ఎన్నో తీర్పులు మన అత్యున్నత న్యాయస్థానం ఇచ్చింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచి లావాదేవీలను నిర్వహించాలని అమృతోత్సవాల సందర్భంగా నిర్ణయించడం ముదావహం.

గతం నుంచి, విదేశీ పాలన నుంచి సంక్ర మించిన విషాదాలు చాలా ఉన్నాయి. వైవిధ్యం ఒక భారతీయ వ్యవస్థకు వరమే అయినా, దానితో కొన్ని వివాదాలూ లేకపోలేదు. వీటిని ఒక కొలిక్కి తీసుకు రావడానికే కోర్టుకు చిరకాలం పట్టిందంటే అతిశ యోక్తి కాదు. అలాంటి క్లిష్ట వ్యాజ్యాలు చాలావాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు తనవంతుగా గొప్ప సేవ చేసింది. అందులో పేర్కొనదగినది అయోధ్య రామజన్మభూమి వివాదం. ఐదువందల ఏళ్ల నాటి ఆ వివాదాన్ని నవంబర్ 9, 2019న తన తీర్పు ద్వారా పరిష్కరించింది. ఈ దేశంలో హిందువులు అధిక సంఖ్యాకులు కాబట్టి తీర్పు రాముడికి అనుకూలంగా వచ్చిందని బాధ్యతనెరిగిన వారు ఎవరూ వ్యాఖ్యానించలేదు. ఆ వివాదాన్ని కూడా భూ వివాదంగానే విచారించి తీర్పును నిర్ధారించామని ధర్మాసనం పేర్కొన్నది. దరిమిలా అయోధ్యలో రాముడిని హిందువులు ప్రతిష్ఠించుకున్నారు. ఇప్పుడు భారతదేశంలో పరిణామాలంటే అయోధ్య వివాదానికి ముందు, అయోధ్య వివాదానికి తరువాత అన్న తీరులో అంచనా వేయవలసి ఉంది. అందుకే ఈ తీర్పు సుప్రీంకోర్టు చరిత్రలో లేదా భారత న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక మలుపు. సెక్యులరిజం పేరుతో జరిగినదిగా, మైనారిటీల బుజ్జగింపు ధోరణి, ఇంతకు ముందు న్యాయవ్యవస్థలలో జరిగిన అవాంఛనీయ జాప్యం వంటి అన్ని అంశాలను, దాని పర్యవసానా లను ఆ తీర్పు బట్టబయలు చేసింది. చరిత్రకారుల మోసాన్ని కూడా సుప్రీం తీర్పు ఎండ గట్టింది. అవి ఈ దేశానికీ, ఈ దేశ వైవిధ్యానికీ, మత సామరస్యా నికీ తెచ్చిన చేటును కూడా సాధారణ భారతీయుడు తెలుసుకునే సదవకాశం ఇచ్చింది. అయోధ్య వివాదం తరువాత వివాదాలు ఉండవని, ఈ దేశంలో అన్ని వర్గాలు కలసి ఉంటాయని చెప్పడం కాస్త కష్టమే. దేశభక్తిని ఎద్దేవా చేయడం, దేశం పట్ల అవిధేయత, న్యాయస్థానాల పట్ల విముఖత, హక్కుల వక్రభాష్యం, వక్ఫ్ వంటి సమస్యలు ఇప్పటికీ ఈ దేశం ముందు ప్రశ్నార్థకాలుగానే ఉన్నాయి. కాలం మారుతున్న కొద్దీ కొత్త కొత్త సమస్యలు సుప్రీంకోర్టు ముందుకు వస్తూనే ఉంటాయి. అందుకే అన్నారు, దేశాధ్యక్షుడు రావచ్చు, పోవచ్చు, కానీ అత్యున్నత న్యాయస్థానం ఎప్పటికీ స్థిరంగానే ఉంటుంది. ఉండడమే కాదు, అది పటిష్టంగా, పవిత్రంగా కూడా ఉండాలి. ★


## ఇంపే నుంచి ఖన్నా వరకు....

స్వతంత్ర భారత అత్యున్నత న్యాయస్థానం జనవరి 28, 2025తో 75 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భం స్మరణీయమైనది, చరిత్రాత్మక మైనది. భారత అత్యున్నత న్యాయస్థానం మూలాలు ఈస్టిండియా కంపెనీ కాలంలోనివేనని గమ నించాలి. రెగ్యులేటింగ్ యాక్ట్ 1773తో భారత్‌లో అత్యున్నత న్యాయస్థానం అన్న వ్యవస్థ అంకు రించింది. కోర్ట్ ఆఫ్ రికార్డ్ పేరుతో కలకత్తాలో ఆరంభమైంది. మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే. నిజానికి తొలి అత్యున్నత న్యాయ స్థానం పరిధి బెంగాల్, ఒరిస్సా, పట్నాలే. తరువాత 1800, 1834 సంవత్సరాలలో మూడో జార్జి చక్రవర్తి రెండు అత్యున్నత న్యాయ స్థానాలు (సుప్రీంకోర్టులు) ఏర్పాటు చేశాడు. అవే బొంబాయి, మద్రాస్ సుప్రీం కోర్టులు. చాలా చిత్రంగా ఇప్పుడు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా చెప్పే పత్రికా రంగానికీ, నాటి అత్యున్నత న్యాయస్థానానికి ఆదిలోనే రగడ ఆరంభమైంది. భారతదేశంలో తొలి పత్రిక హికీస్ జనరల్. లేదా కలకత్తా క్రానికల్. దీని సంపాదకుడు జేమ్స్ ఆగస్టస్ హికీ. ఇతడు సర్ ఎలిజా ఇంపే మీద ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచురిం చాడు. ప్రధాన న్యాయమూర్తి విమర్శలకు అతీతుడు, విమర్శించినవారు శిక్షార్హులు అంటూ నాటి గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ ప్రకటించాడు. హేస్టింగ్స్ ఆదేశం మేరకు హికీ న్యాయమూర్తి మీద ఆరోపణలు ఆపేశాడు. ఆయన భార్య మీద ఆరోపణలు ప్రారంభించాడు. దీనితో అతడిని బలవంతంగా ఇంగ్లండ్ ఓడ ఎక్కించారు. హైకోర్టులు కూడా కంపెనీ ఏలుబడిలోనే 1861లో మొదలయ్యాయి. మన రాజ్యాంగ వ్యవస్థలన్నింటికీ మూలమని చెప్పే భారత



జస్టిస్ ఖన్నా

ప్రభుత్వ చట్టం 1935 పుణ్యమా అని ఫెడరల్ కోర్టు ఏర్పడింది. నేటి సుప్రీంకోర్టుకు మాతృక ఇదే. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రెండు రోజుల తరువాత, జనవరి 28, 1950న సుప్రీం కోర్టు ఉనికి లోనికి వచ్చింది. ప్రధాన న్యాయ మూర్తితో కలిపి 8 మందితో ఆరంభమైన మన సుప్రీంకోర్టు ఇప్పుడు 34 మందితో పని చేస్తున్నది. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా 51వ ప్రధాన న్యాయమూర్తి. ★




రవి అస్తమించని రాజ్యపాలనకు చరమగీతం పాడుతూ ది.14/15 ఆగస్టు 1947న అర్ధరాత్రి మన భారతదేశం స్వాతంత్ర్య ప్రభాత శంఖాన్ని పూరించింది. స్వాతంత్రం వచ్చిన నూతనోత్సాహంతో దేశం నలుమూలలున్న మేధావులెందరో మేధోమథనం చేసి స్వతంత్ర భారతానికి రాజ్యాంగమనే అమృత కలశాన్ని అందించారు. జనవరి 26, 1950న భారత రాజ్యాంగం అమలులోకి రాగా, దేశ అత్యున్నత న్యాయ పీఠంగా జనవరి 28, 1950న "సుప్రీం కోర్ట్ అఫ్ ఇండియా" ఆవిర్భవించింది. రాజ్యాంగం, భావి భారతానికి మహాభారతంగా నిలిచి నవ సమాజ నిర్మాణానికి నాంది పలికింది. మన రాజ్యాంగంలో స్వతంత్ర భారత పరిపాలనా విధి, ఆర్థిక, సామాజిక వ్యవహార శైలి, సమాజ భద్రత, న్యాయ సంరక్షణ మొదలగు అంశాలెన్నో సవివరంగా పొందుపరిచారు. రాజ్యాంగం వేసిన బాటలో స్వతంత్ర భారత నిర్మాణం, పునరుద్ధరణ జరుగుతూ వస్తోంది. ప్రజాస్వామ్య భారతదేశ విధి నిర్వహణ, రాజ్యాంగ నిబద్ధతల పరిధిలో సాగుతోందా అనే సమీక్ష చేసే అధికారం, విశిష్ట బాధ్యత న్యాయస్థానాలదైంది.

# అత్యున్నత న్యాయ

జనోద్ధరణ పక్కకి పెట్టి స్వీయోద్ధరణకే ముందడుగు వేసే నియంతల అధికారానికి బలైన ఎందరో ప్రజలు తమ దేశాన్ని విడిచి నిర్వాసితులుగా, శరణార్థులుగా వలస పోతున్నారు. అటువంటి దీన స్థితి మన ప్రజానీకానికి రాకుండా భారతదేశానికి రక్షణా కవచంలా నిలిచింది మన రాజ్యాంగం. కాలమాన పరిస్థితులబట్టి చట్ట సవరణ, నూతన చట్టాల రూపకల్పన చేస్తూ వస్తున్నారు మన దేశ నాయకులు. సవరించిన చట్టాలు కానీ నూతనంగా పరిచితమైన చట్టాలు కానీ ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించినా లేక అడ్డుగోడలా నిలిచినా, ప్రజలకు రక్షణ కలిపిస్తూ వారి హక్కులను సంరక్షిస్తున్న ధర్మస్థానం, సుప్రీం కోర్ట్.

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ప్రభుత్వాలు సవరించలేవని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం, కేశవానంద భారతి తీర్పుతో శాసించడం ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులకు శాశ్వత రక్షణ లభించింది. గడిచిన 75 సంవత్సరాలలో, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తన నిష్పక్షపాత శైలిలో ఎన్నెన్నో తీర్పులిచ్చి భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు భారతీయుల మాన సమ్మాన సంరక్షణకు పెద్దపీట వేసింది. దేశంలోని న్యాయస్థానాలు, సందర్భాను సారంగా, చట్టాలను ప్రభుత్వ ఉత్తరువులను, ప్రభుత్వ శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించి మన రాజ్యాంగ పరిధిలో, రాజ్యాంగ ప్రమాణ-నిబంధనల అనుగుణంగా ఆ చట్టాలను శాసనాలను ఉత్తరువులను నియంత్రిస్తూ వస్తున్నాయి. ఎందరో ఆశలకు ఆయువు పోసి మరెందరో అశ్రువులని తుడిచి తల్లయింది మన దేశ న్యాయ వ్యవస్థ.



**వెంకట రఘువంశీ దశిక**
Advocate on Record
Supreme Court of India

భారతదేశంలో "రామ జన్మభూమి" చాలా సున్నితమైన అంశం. అలాంటి సున్నితమైనా అంశాన్ని నిష్పక్షపాతంగా విశిష్టమైన నేర్పు నైపుణ్యంతో వ్యవహరించి తీర్పునిచ్చింది సుప్రీంకోర్ట్. రామ జన్మభూమి తీర్పు మన భారతదేశ న్యాయచరిత్రలో మైలురాయి. ఇరు మతాల ప్రజల మనోభావాలను కించపరచకుండా, ఇరు పక్షాల వాదనలను సమతుల్యంగా పరిశీలించి ధర్మనిబద్ధతతో వెలువరించిన తీర్పు 'రామజన్మభూమి'.

రాజ్యాంగానికి లౌకికత్వం (Secularism) అనేది మూలస్తంభం. మతపరమైన భావాలకి అతీతంగా అందరికి సమన్యాయం అందించడమే రాజ్యాంగం ద్వారా మన న్యాయవ్యవస్థకు సంక్రమించిన అత్యున్నత బాధ్యత. ఇటువంటి మతపరమైన వివాదాలను పరిష్కరించడంలో లౌకికవాదం (Secularism), చట్టపరమైన పాలన (Rule of Law) ప్రాముఖ్యతను కూడా తీర్పు ప్రముఖంగా ప్రస్తావించింది. రామ జన్మభూమి వివాదంలో సుప్రీంకోర్ట్ తీర్పు, సంక్లిష్టమైన సున్నితమైన మతపరమైన విషయాలలో న్యాయపరమైన జోక్యానికి ఒక ఉదాహరణగా నిలిచింది. భారతదేశం వంటి వైవిధ్యమైన బహుళత్వ సమాజంలో సంభాషణ (Dialogue) సయోధ్య (Reconciliation) అవసరాన్ని సుప్రీం కోర్ట్ తన తీర్పులో ప్రస్ఫుటంగా తెలియజేసింది.


సుప్రీంకోర్ట్ తీర్పు వివాదానికి చట్టపరమైన పరిష్కారాన్ని తీసుకువచ్చినప్పటికీ, అది శాశ్వత సామాజిక సమరసత్వంగా మారేలా చూసుకోవడం ప్రభుత్వానికి ఒక సవాలుగా మిగిలిపోయింది. మతపరమైన వైరాన్ని, దూరాన్ని తగ్గిస్తూ, వివిధ వర్గాల మధ్య ఐక్యత అవగాహన స్ఫూర్తిని పెంపొందించడానికి నిరంతర ప్రయత్నాలు అవసరమని గుర్తించాలి.

ఈ వివాద పరిష్కారంలో చట్టపరమైన సూత్రాలను అనుసరించి, పాల్గొన్న అన్ని పార్టీలలోనూ న్యాయవ్యవస్థ పట్ల గౌరవమర్యాదలను వికసింపచేస్తూ, పరిష్కారం వైపు నడిపించి భారతజాతి రామ మందిర నిర్మాణ వాంఛను పునరుద్ధరించింది సుప్రీంకోర్ట్. "రామజన్మభూమి" వివాదం రేపటి తరాలకు ఒక మార్గదర్శకంగా వెలుగొందుతుంది.

అలహాబాద్ న్యాయస్థానం సెప్టెంబరు 30, 2010న వెలువరించిన తీర్పుని విచారించవల్సినదిగా సుప్రీంకోర్ట్‌ను ఆశ్రయించడంతో రామ జన్మభూమి వివాద పరిష్కార బాధ్యత సుప్రీం కోర్ట్‌ది అయింది. వాస్తవానికి రామజన్మభూమి వివాదం కీలకాంశం భూ వివాదమే అయినప్పటికీ ఎందరో ప్రజల మతపరమైన విశ్వాసాలు, నమ్మకాలు ఆ అంశాన్ని పద్మవ్యూహంలా అల్లుకున్నాయి. ఈ వ్యూహాన్ని ఛేదించడంలో సుప్రీం కోర్ట్ సఫలీకృతమైంది. ప్రజల భావావేశాల వలన దాదాపు దశాబ్దం పాటు పన్నుకుని సుప్రీం కోర్టుపైన తీవ్రమైన ఒత్తిడి కలుగచేసింది. ఎలాంటి భావావేశాల ఒత్తిడికి తొణకకుండా లౌకిక అస్థిత్వాన్ని అఖండంగా నిలిపి చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది సుప్రీం కోర్ట్.

**తీర్పు ప్రభావం**

ఎన్నడూ లేని విధంగా భగవంతుడు సైతం తన ఇల్లు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పలేదు.



దేశం ప్రగతిపథంలో పరుగులు తీస్తున్నప్పుడు ఇటువంటి సంక్లిష్టమైన సమస్యలు అడ్డంకులుగా ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. అటువంటి పరిస్థితులలో అన్ని వర్గాల ప్రజల విశ్వాసాలని, భావాలని పరిగణిస్తూనే నిష్పాక్షికమైన తీర్పులు వెలువరించడానికి ఈ రామజన్మభూమి తీర్పు దిక్సూచిగా ఉంటుంది.. భిన్నత్వంలో ఏకత్వం అనే మన దేశ నానుడిని అనుసరించి భిన్న అభిప్రాయాలు, వాదనలు కోకొల్లలుగా కమ్మేసినా, న్యాయాన్ని ధర్మాన్ని ఒకే తాటి పైన నిలుపుతూ నిర్వివాదానికి తావులేని తీర్పుగా, భూత భవిష్యత్ వర్తమాన కాలంలో న్యాయ చరిత్రకే ఘన కీర్తిని గడించిపెట్టింది.

# స్థానం.. 'అయోధ్య'

ధర్మ పరిరక్షణకు, న్యాయ స్థాపనకు, దుష్ట శిక్షణ – శిష్ట రక్షణకు న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ సంసిద్ధమై ఉంటుంది. దేశ శాంతిభద్రతల నిర్వహణలో సంరక్షణలో ప్రభుత్వం వాహనమైతే, మన న్యాయ వ్యవస్థ ఇంధనం వంటిది. చట్టం, న్యాయం, ధర్మం అనే మూల స్తంభాలపై నిర్మించిన మన న్యాయవ్యవస్థ నిష్పాక్షికత, న్యాయబద్ధత, మనస్సాక్షి అనే మూడు కళ్లతో దేశాన్ని నిరంతరం కనిపెట్టుకుని ఉంటూ మన మువ్వన్నెల ధ్వజం, ప్రపంచ దేశాల మధ్య దిగ్విజయంగా రెపరెపలాడేలా చేస్తోంది. తప్పటడుగులు సరిదిద్దే తండ్రిలా, అక్షరబద్ధం సరిచేసే గురువులా సుప్రీమ్‌కోర్ట్ దిద్దుబాటు చేస్తూ ఎందరి ఆశలకో జీవాన్నిచ్చింది.

**రామ జన్మభూమి వివాద చారిత్రక నేపథ్యం**

1529 సంవత్సరంలో బాబ్రీ మసీదును మొదటి మొగల్ పాలకుడు బాబర్ పాలనలో అతడి కమాండర్ మీర్ బాకి నిర్మించాడు. 1885వ సంవత్సరంలో మసీదును ఆనుకుని మందిరాన్ని నిర్మించడానికి అనుమతి కోసం మహంత్ రఘుబీర్ దాస్ ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో మొదటి వ్యాజ్యాన్ని వెయ్యగా కోర్ట్ తిరస్కరించింది. ఆ తరువాత ఫైజాబాద్ కోర్ట్‌లో బాబ్రీ మసీదు ప్రాంగణంలో రామ మందిరం కట్టడానికి మహంత్ రఘుబీర్ దాస్ అనుమతి కోరినా అదే కోర్ట్ తిరస్కరించింది. డిసెంబర్ 1949లో రాములవారి విగ్రహం బాబ్రీ మసీదులో ప్రత్యక్షమవడంతో, సర్కారువారు దాన్ని వివాదాస్పద ప్రదేశంగా పరిగణించి మూసివేశారు. 1950లో ఆలయ పూజాకాంక్షులు గోపాల్ సిమ్లా విహారద్, పరమహంస రామచంద్రదాస్‌లు రెండు వ్యాజ్యాలు వేసి ఆ నిర్దేశిత వివాదాస్పద ప్రాంతంలో పూజ చెయ్యడానికి అనుమతి కోరగా కోర్ట్ వారు మసీదు బయట ప్రాకారంలో పూజ చెయ్యడానికి అనుమతిస్తూ లోపల ప్రాకారానికి మాత్రం ప్రవేశాన్ని నిషేధించారు. మసీదు స్థలాన్ని స్వాధీనాన్ని కోరుతూ 1959లో నిర్మోహి అఖాడా మూడవ వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. 1961లో ఉత్తరప్రదేశ్ సున్ని వక్ఫ్ బోర్డు కూడా మసీదు స్థలాన్ని స్వాధీనం చేయాలనీ, రామ విగ్రహాన్ని తొలగించాలనీ కోరుతూ నాల్గవ వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. 1984లో విశ్వహిందూ పరిషత్, ఎల్‌కే అద్వాణీ నాయకత్వాన రామజన్మభూమి విముక్తికి యాత్ర ప్రారంభమైంది. ఫిబ్రవరి1,1986 మసీదు లోపలి ప్రాకారం బంధనాలను తొలగించమని యూసీ పాండే అనే వ్యక్తి వేసిన వ్యాజ్యంలోని అంశాలను పరిగణిస్తూ ఫైజాబాద్ సెషన్స్ కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను నిరసిస్తూ ముస్లింలు Babri Mosque Action Committee (BARC)ను స్థాపించారు. నవంబర్ 9,1989 రామ జన్మభూమి స్థలం (బాబ్రీ మసీదు) వద్ద విశ్వ హిందూ పరిషతు రామ మందిరానికై శంకుస్థాపన చేసింది. తరువాత అలహాబాద్ హైకోర్ట్‌లో రామ్‌లల్లా విరాజమాన్ పేరుతో ఇంకొక వ్యాజ్యాన్ని దాఖలు చేసింది.

సెప్టెంబర్ 25,1990న ఎల్‌కే అద్వాణీ సోమనాథ్ నుండి అయోధ్య వరకు రథయాత్ర చేపట్టారు. డిసెంబర్ 6,1992 బాబ్రీ మసీదును ప్రజలు తొలగించారు. డిసెంబర్ 16, 1992 బాబ్రీ మసీదు కూల్చివేతకు కారణాలు, పర్యవసానంగా జరిగిన అల్లర్లపై నిజ నిర్ధారణకు ప్రభుత్వం లిబ్రహాన్ కమిషన్‌ను నియమించింది. జనవరి 7,1993 కేంద్ర ప్రభుత్వం అయోధ్య లోని నిర్దిష్ట ప్రదేశాలను స్వాధీనపరచుకుంటూ ఉత్తర్వులు జారీచేసి అయోధ్య చట్టం (యాక్ట్) 1993 తీసుకువచ్చింది. 1994లో ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్ట్‌లో సవాలు చెయ్యగా, రాజ్యాంగబద్ధమని తీర్పునిచ్చింది (ఇస్మాయిల్ ఫారుఖి తీర్పు).

ఏప్రిల్ 2002 అలహాబాద్ హైకోర్ట్ (లక్నో విభాగం) "రామజన్మభూమి" భూ వివాదం విచారణ ప్రారంభించింది. మార్చి – ఆగష్టు 2003లో అలహాబాద్ హైకోర్ట్ ఆదేశానుసారం భారత పురావస్తు శాఖ నిర్దిష్ట 'రామ జన్మభూమి' స్థలంలో తవ్వకాలు జరపగా పదవ శతాబ్దం నాటి హిందూ దేవాలయం బయటపడింది. ఆ తరువాత ఆ నివేదికను మసీదు అనుకూలురు తప్పుపట్టారు. సెప్టెంబర్ 30, 2010 అలహాబాద్ హైకోర్ట్ ఉత్కంఠకు తెర దించుతూ "వివాదాస్పద స్థలాన్ని" 3 భాగాలుగా విభజించింది. 1/3వ భాగం (అంతర్ ప్రాకారం) రామ్‌లల్లా విరాజమాన్‌కు, 1/3వ భాగం (బయటి ప్రాకారం) సున్ని వక్ఫ్ బోర్డుకు, 1 /3వ భాగం (రామ్ చబుత్ర, సీతా రసోయి దగ్గర స్థలం) నిర్మోహి అఖాడాకు దఖలు చేస్తూ తీర్పునిచ్చింది.

మే 2011 సుప్రీమ్ కోర్ట్ కక్షిదారులు వ్యాజ్యంలో



1/3వ వాటాను అడగకుండా హైకోర్ట్ రామ జన్మభూమిని 3 భాగాలుగా విభజించడం తప్పని అలహాబాద్ కోర్ట్ తీర్పుని నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 8, 2018న రామ జన్మభూమి వివాదాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేస్తూ సుప్రీమ్ కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్9, 2019 న దేశం ఎదురు చూస్తున్న రామ జన్మభూమి తీర్పుని భారత సుప్రీమ్ కోర్ట్ వెలువ రించింది. మసీదు ప్రాంతం (2.77–ఎకరాలు) మొత్తం రామ్‌లల్లా విరాజమాన్‌కి చెందుతుందని చెప్పింది. అలాగే అయోధ్యలో సున్ని వక్ఫ్ బోర్డుకు 5 ఎకరాలు ఇవ్వవలసిందిగా తీర్పులో పేర్కొన్నది. జనవరి 22, 2024న బాలరాముడి ప్రతిష్ఠతో భారత దేశంలో రామరాజ్య పునర్వైభవానికి బీజం పడింది. ★



# భారతి నుంచి బాలరాముడి దాకా..

"మా ముందుకు వచ్చే కేసుల్లో అంత తేలిగ్గా పరిష్కరించలేనివి కూడా ఉంటాయి. అలాంటిదే అయోధ్య విషయంలో జరిగింది. ఆ కేసు మూడు నెలల పాటు నా ముందు ఉంది. దేవుడి ఎదుట కూర్చున్నాను. పరిష్కారం చూపించమని వేడుకున్నాను. అలా క్రమం తప్పకుండా పరమాత్మను ప్రార్థిస్తుండేవాడిని. నా మాట నమ్మండి.. మీకు దేవుడి పట్ల నమ్మకం ఉంటే ఆయన ఎప్పుడూ కూడా ఒక దారి చూపిస్తాడు.."

అయోధ్యపై చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం సభ్యుల్లో ఒకానొక న్యాయమూర్తి, ఆ తర్వాత అత్యున్నత న్యాయస్థానానికి 50వ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ అన్న మాటలివి. ఈ ఏడాది జనవరి 28నాటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత సర్వోన్నత న్యాయస్థానం ఇంతటి సుదీర్ఘ కాలపు ప్రస్థానంలో అయోధ్యతోపాటుగా మైలు రాళ్లని అనదగిన తీర్పులను వెలువరించింది. వాటిలో కొన్ని తీర్పులు ఇలా ఉన్నాయి.

## అయోధ్య తీర్పు

అయోధ్యలో 2.77 ఎకరాల స్థలం మీద యాజమాన్య హక్కు ఎవరిది? అన్న సమస్యపై సుప్రీంకోర్టు నవంబర్ 9, 2019న చరిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. 130 ఏళ్ల న్యాయపోరాటాన్ని సుఖాంతం చేసింది. 1045 పేజీల ఈ తీర్పును ధర్మాసనం ఏకగ్రీవంగా వెలువరించింది. సున్నీ వక్ఫ్ బోర్డు, హిందూ సంస్థలు నిర్మోహి అఖాడా, రామలల్లా విరాజమాన్ అనే మూడు పక్షాల మధ్య స్థల వివాదంగానే సుప్రీంకోర్టు తీసుకుని తీర్పు చెప్పింది. ఇది రామ్‌లల్లాకే చెందుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఏఎస్ బోబ్డె, జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ప్రకటించింది. ఆ భూఖండాన్ని మూడు ముక్కలు చేయాలంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు (2010) సమస్యను పరిష్కరించేది కాదని అభిప్రాయపడింది. ఆ తీర్పు మీదే 14 అప్పీళ్లు దాఖలైనాయి. అయోధ్య హిందువులదని చెప్పడానికే ఎక్కువ ఆధారాలు ఉన్నాయని కూడా ధర్మాసనం తేల్చింది. మసీదు నిర్మించుకోవడానికి ఐదెకరాల స్థలాన్ని అయోధ్యలోనే ఇవ్వాలని కూడా సూచించింది. 40 రోజుల పాటు ఏకబిగిన విచారించి సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. ఇందుకు పురావస్తు శాఖ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకుంది. శతాబ్దాలుగా హిందువులు ఆ స్థలంలో పూజాదికాలు చేసు కుంటున్న వాస్తవాన్ని మన్నించింది. ఇది స్థిరాస్థికి సంబంధించిన వివాదంగానే పరిగణిస్తూ విశ్వాసాలు, నమ్మకాల ఆధారంగా కాకుండా సాక్ష్యాల ప్రాతిపదికన కేసును పరిష్కరిస్తున్నట్టు పేర్కొన్నది.



కేశవానంద భారతి

ఈ కేసులో రామలల్లా తరఫున మనకాలంలో న్యాయశాస్త్ర పితామహులుగా చెప్పదగిన పరాశరన్ వాదించారు. 92 ఏళ్ల వయసులోను ఈ అసమాన న్యాయపోరాటానికి వారే నాయకత్వం వహించారు. 40 రోజులు వాదనలు సాగితే పరాశరన్ నిలబడే రాముడి వ్యాజ్యాన్ని వాదించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గొగొయ్ కూర్చుని వాదించమని కోరినా పరాశరన్ వృత్తి ధర్మాన్ని మనసా వాచా పాటించారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు తరఫున వాదిస్తున్న రాజీవ్ ధావన్ అసహనంతో కొన్నిసార్లు పుస్తకాలు విసిరేసినా పరాశరన్ ఏనాడూ సహనం కోల్పోలేదు. తీర్పు వెలువడిన తరువాత ధావన్‌ను ఆలింగనం చేసుకున్నారు కూడా. తరువాత పద్మ విభూషణ్ గ్రహీత పరాశరన్ ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ నుంచి అందుకున్న కానుక ఒక శ్రీరాముడి ప్రతిమ.

## కేశవానంద భారతి కేసు

ఆధ్యాత్మిక గురువు, కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో ఎడనీర్ మఠాధిపతి కేశవానంద భారతి కేరళ ప్రభుత్వం ఆశ్రమాల ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ క్రమంలో పార్లమెంట్ రాజ్యాంగానికి చేసిన 24, 25, 29వ సవరణల చెల్లుబాటును ఆయన సవాల్ చేశారు. పైన తెలిపిన సవరణలు పౌరుల ప్రాథమిక హక్కులతో పాటుగా న్యాయవ్యవస్థ అధికారాలకు భంగం కలిగిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. సర్వోన్నత న్యాయస్థానం చరిత్రలోనే తొలిసారి అన్నట్టుగా 1972, అక్టోబర్ 31న పిటిషన్‌పై 13 మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టింది. అలా

ప్రారంభమైన విచారణ 1973, మార్చి 24 వరకు సాగింది.

68 రోజుల సుదీర్ఘ విచారణలో రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలు, రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని హక్కు పార్లమెంట్‌కు ఉన్నదీ లేనిదీ అనే అంశంపై తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఎట్టకేలకు రాజ్యాంగ మౌలిక సిద్ధాంతానికి సుప్రీంకోర్టే సంరక్షణదారు అనే చరిత్రాత్మక తీర్పును విస్తృత ధర్మాసనం వెలువరించింది. పార్లమెంట్‌కు రాజ్యాంగా నికి సవరణలు చేసే అధికారం ఉంది కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, ప్రాథమిక హక్కులను మార్చే అధికారం దానికి లేదని తేల్చింది. వాటి సంరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని స్పష్టం చేసింది.

**షాబానో కేసు**

1978, ఏప్రిల్ మాసంలో 65 ఏళ్ల ముస్లిం మహిళ షాబానో బేగం తనకు విడాకులిచ్చిన మహమ్మద్ అహ్మద్ ఖాన్ నుంచి భరణం కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో 1973నాటి సెక్షన్ 123 ప్రకారం తనకు, తన ఐదుగురు పిల్లలకు భరణం ఇవ్వాలని కోరారు. అహ్మద్ ఖాన్ అప్పీల్‌పై జస్టిస్ వైవీ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. ముస్లిం మహిళలకు భరణం చెల్లించాల్సిందేనని బెంచ్ పేర్కొంది. ఇద్దత్ (విడాకుల తీసుకున్న తర్వాత 3 నెలల కాలం) ముగిసిన తర్వాత కూడా ముస్లిం భర్త భరణం చెల్లించాల్సిందేనని పేర్కొంది. భరణం అనేది దాతృత్వం కొద్దీ ఇచ్చేది కాదని, అది హక్కు అని బెంచ్ తీర్పు ఇచ్చింది.

**ఎస్ఆర్ బొమ్మై కేసు**

జనతాదళ్ హయాంలో ఆగస్టు 1988 నుంచి ఏప్రిల్ 1989 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎస్ఆర్ బొమ్మైకు 1989, ఏప్రిల్ 21న ఊహించని


షాబానో


బొమ్మై

పరిణామం ఎదురైంది. బొమ్మై సర్కారుకు తగిన మెజారిటీ లేదని పేర్కొంటూ అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356 ప్రయోగించింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసింది. కర్ణాటకలో రాష్ట్రపతి పాలన విధించింది. తన మద్దతుకు సంబంధించి జనతాదళ్ శాసనసభా పక్షం ఆమోదం తెలిపిన తీర్మానం కాపీని నాటి సీఎం బొమ్మై అప్పటి గవర్నర్ పి.వెంకటసుబ్బయ్యకు సమర్పించినా అసెంబ్లీలో బలనిరూపణకు అవకాశం ఇవ్వలేదు. తీర్మాన కాపీని తిరస్కరిస్తూ రాష్ట్రపతి పాలన విధించాలన్న గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బొమ్మై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కుల్ దీప్‌సింగ్ నేతృత్వంలోని బెంచ్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. మార్చి 11, 1994న సుప్రీంకోర్టు బెంచ్ చరిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. సమాఖ్య వ్యవస్థ అనేది భారత రాజ్యాంగ మౌలిక స్వరూపమని బెంచ్ తన తీర్పులో పేర్కొంది. గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే ముందు అసెంబ్లీలో బలనిరూపణకు అవకాశం కల్పించాలని తెలిపింది. గవర్నర్ రాజ్యాంగంలోని 356 అధికరణం కింద ప్రభుత్వాన్ని రద్దు చేయడం నిరంకుశత్వమని బెంచ్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తన మెజారిటీని నిరూపించు కోవడానికి అసలైన వేదిక కేవలం శాసనసభ మాత్రమేనని పేర్కొంది. ఇందులో గవర్నర్ స్వంత అభిప్రాయానికి ఏ మాత్రం తావు లేదని బెంచ్ తీర్పులో తేల్చి చెప్పింది.

ఇలాంటివి ఇంకా ఎన్నో!

– జాగృతి డెస్క్

ఓం శాంతిః




# కుంభమేళా విషాదం వెనుక కుట్ర

మహా కుంభమేళాలో విషాదం వెనుక కుట్రను పాలకపక్షం పసిగట్టిందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఫిబ్రవరి 3న లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషాదంపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత దుర్ఘటనకు బాధ్యులెవరో బైటపడుతుందని, అంతటి ఘాతుకానికి పాల్పడినవారు సిగ్గుతో తలదించు కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు 35 కోట్ల మంది భక్తులు మహా కుంభమేళా వద్ద పవిత్ర స్నానమాచరించారని చెప్పారు. కుంభమేళా లేదా సనాతన ధర్మం అన్న మాట విన్న ప్రతిసారీ విపక్షాలు డీలాపడిపోతుంటాయని ఆయన ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం పట్ల జరిగే ఎలాంటి అవమానాన్ని భారత్ సహించదని స్పష్టం చేశారు.

జనవరి 29న తెల్లవారుజామున ప్రయాగరాజ్ కుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా తొలి స్నానం అఖాడాలకు చెందిన సాధువులు చేస్తారు. ఆ క్రమంలో వారు వెళ్లేందుకు ప్రత్యేక మార్గం కేటాయించారు. అయితే పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్న భక్తజనంలో కొందరు బారికేడ్లపై నుంచి దూకి ఆ మార్గం ద్వారా వెళ్లి స్నానాలు ఆచరించేందుకు తొందరపడ్డారు. దీంతో బారికేడ్లు విరిగిపడటంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోయారు. కొందరు కిందపడిపోగా వారిపై నుంచి మరికొందరు భక్తులు తొక్కుకుంటూ వెళ్లారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టింది. ప్రధాని నరేంద్రమోదీ తక్షణం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు యూపీ సీఎం ప్రకటించారు. ఘటనపై జ్యుడీషియల్ విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జస్టిస్ హర్షకుమార్, మాజీ డీజీ వీకే గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీకే సింగ్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని సీఎం చెప్పారు.

– జాగృతి డెస్క్



# ప్రాథమిక హక్కు న్యాయవ్య

భారత రాజ్యాంగంలో పార్ట్-3 లోని 12 నుంచి 35 అధికరణాల వరకు పౌర హక్కులను పొందుపరచారు. భారత పౌరులు ప్రశాంతయుత జీవితాన్ని గడిపేందుకు ఇవి హామీ ఇస్తాయి. ఈ హక్కులనే 'ప్రాథమిక హక్కులు' అని వ్యవహరిస్తారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినప్పుడు హైకోర్టులు, సుప్రీంకోర్టు, కలుగజేసుకొని, ఈ హక్కులను అమలు పరచాలని రాజ్యాంగంలోని 32, 226 అధికరణల కింద రిట్లు జారీచేసి అధికార యంత్రాంగాన్ని ఆదేశించ వచ్చు. 32వ అధికరణ కింద సుప్రీంకోర్టు హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరై, కో వారంటో రిట్ల ద్వారా ప్రాథమిక హక్కులు అమలు జరిగేలా చూడవచ్చు. ఇక హైకోర్టులు 226వ అధికరణం కింద సంక్రమించిన విశేషాధికారాలతో ఈ ప్రాథమిక హక్కులు సక్రమంగా అమలయ్యేందుకు ఆదేశాలు జారీచేయవచ్చు. ఇక్కడ 32వ అధికరణం, రాజ్యాంగ సమస్య పరిష్కారానికి (ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినప్పుడు) ఒక ప్రాథమిక హక్కు కాగా, 226 అధికరణం మాత్రం హైకోర్టులకు విశేషాధికారాలు కల్పిస్తుంది తప్ప, ప్రాథమిక హక్కు కాదు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరగని సందర్భాల్లో కూడా హైకోర్టులు ఈ అధికరణం కింద ఆదేశాలు జారీ చేయవచ్చు.

సమానత్వపు హక్కు (14–18 అధికరణలు), స్వేచ్ఛ హక్కు (19–22 అధికరణలు), దోపిడీని నిరోధించే హక్కు (23–24 అధికరణలు), మతస్వేచ్ఛ హక్కు (25–28 అధికరణలు), సాంస్కృతిక, విద్యాపరమైన హక్కులు (29–30 అధికరణలు), రాజ్యాంగ పరిష్కారాల హక్కు (32–35 అధికరణలు) అనేవి ప్రాథమిక హక్కులు. పౌరులకు, సమాజహితానికి ఈ ఆరు ప్రాథమిక హక్కులు అవసరం. వీటిని కోర్టుల ద్వారా అమలుపరచే వీలును రాజ్యాంగం కల్పించింది. అయితే ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి జనతా ప్రభుత్వం తొలగించగా, 2009లో 6–14 సంవత్సరాల మధ్య వయస్సులైన పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చారు.


ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుందా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973)కేసులో, ప్రాథమిక హక్కులను పార్లమెంట్ సవరించవచ్చునని పేర్కొంటూ, అటువంటి సవరణ రాజ్యాంగ మూల నిర్మాణానికి భంగకరంగా ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇక రాజ్యాంగంలోని 33వ అధికరణం కొన్ని వర్గాల వారికి ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తూ శాసనం చేసే అధికారాన్ని పార్లమెంట్‌కు కల్పిస్తోంది.

**ప్రాథమిక హక్కులకు సవరణలు**

చాలా సందర్భాల్లో ప్రాథమిక హక్కులకు సవరణలు జరిగాయి. ముఖ్యంగా పేదరికం, ఆర్థిక అభద్రతను తొలగించేందుకు పనిహక్కు, నిరుద్యోగులకు, వృద్ధులకు భృతి చెల్లింపు హక్కు వంటివి అవసరమని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేయడం వీటి సవరణకు ప్రధాన కారణం. అయితే వీటిని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. ఇక స్వేచ్ఛ హక్కుకు పరిమితులను విధించే కొన్ని క్లాజ్‌లను పొందుపరచారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు నిర్బంధం, ప్రాథమిక హక్కుల రద్దు వంటి నిబంధనలను కూడా రాజ్యాంగానికి చేర్చారు. ఆంతరంగిక భద్రతా చట్టం(మీసా), భద్రతా దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్పీఏ), జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) వంటివి ప్రాథమిక హక్కులకు పరిమితులు విధిస్తున్నాయన్న విమర్శలు ఉన్నప్పటికీ, మారుతున్న పరిస్థితులు, పెచ్చరిల్లుతున్న ఉగ్రవాదం నేపథ్యంలో ప్రభుత్వాలు ఈ చట్టాలను రూపొందించక తప్పలేదన్న సత్యాన్ని గుర్తించాలి. ముఖ్యంగా అంతర్గత, సీమాంతర ఉగ్రవాదాన్ని, రాజకీయ హింసను సమర్థంగా అరికట్టడానికి ప్రభుత్వానికి ఈ చట్టాలు ఎంతో ఉపయోగపడ్డాయి. కాగా వీటిల్లో ఉపయోగించిన 'రాజ్యభద్రత', 'ప్రజల భద్రత', 'నైతికత్వం' వంటి పదాలు విస్తృత ప్రభావశీలతను కలిగి ఉండటం గమనార్హం. 'సహేతుక పరిమితులు', 'ప్రజల భద్రతా ప్రయోజనం' వంటి పదబంధాలకు రాజ్యాంగంలో స్పష్టమైన నిర్వచనం లేదు. ఈ అస్పష్టత కారణంగా అనవసర సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. శాంతియుతంగా సమావేశాలు జరుపుకుంటున్నప్పటికీ పోలీసులు వాటిని భగ్నం చేసిన సందర్భాలున్నాయి. ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే కదా! అని వాదించవచ్చు.

**స్వేచ్ఛ హక్కులో లేని పత్రికా స్వాతంత్ర్యం**

స్వేచ్ఛ హక్కులో పత్రికా స్వాతంత్ర్యాన్ని చేర్చలేదు. కానీ జరుగుతున్న పరిణామాలపై ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చేందుకు పత్రికాస్వేచ్ఛ చాలా అవసరం. ఇక ప్రమాదకర పనులు/ప్రదేశాల్లో బాలలను కార్మికులుగా నియామకాన్ని నిరోధించినప్పటికీ, ఇంటి సహాయ పనుల్లో వారిని నియోగించడం రాజ్యాంగ మౌలిక సిద్ధాంతాలకు పూర్తి విరుద్ధం మాత్రమే కాదు ఉల్లంఘన కూడా. దేశంలో 16.5 మిలియన్ పిల్లలు వివిధ పనుల్లో పాలు పంచుకుంటు న్నారని ఒక అధ్యయనం తెలుపుతోంది. పౌరసత్వం సవరణ చట్టం–2003 ప్రకారం విదేశాల్లో నివసించే భారత పౌరులకు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాల కల్పనలో, స్థానిక పౌరులతో సమాన హక్కును కల్పించలేదు. వాక్ స్వాతంత్ర్యం, ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశం కావడం సంఘాలు, యూనియన్ల ఏర్పాటు భారత 'సార్వ భౌమాధికారానికి','సమగ్రతకు' భంగం కలిగించేవిగా ఉండకూడదని రాజ్యాంగం పార్ట్–3 లోని 19వ అధికరణం స్పష్టం చేస్తున్నది. ఇక్కడ సార్వ భౌమాధికారం, సమగ్రత అనే పదాలను దేశ ప్రజలకు వర్తించే విధంగా ప్రయోగించారు తప్ప భారత ప్రాదేశికతకు సంబంధించింది కాదు. పార్ట్–1లోని 1వ అధికరణం భారత్‌ను సమైక్య రాష్ట్రాలుగా పేర్కొంది. అంటే ఇక్కడ భూమి కాదు 'ప్రజలు' అని అర్థం చేసుకోవాలి. ఇంకా ప్రాథమిక




హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కేసులను చాలా వేగంగా విచారించి పరిష్కరించాలి. వాస్తవానికి ఈ కేసుల విచారణ ఏళ్లకు ఏళ్లు సాగడం విచారకరం. ఇక ప్రాథమిక హక్కులకు సవరణ అమల్లోకి రావాలంటే లోక్‌సభ, రాజ్యసభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల సభ్యుల మద్దతు అవసరం. అయితే హాజరైన సభ్యుల సంఖ్య మెజారిటీ సభ్యుల సంఖ్యకు తక్కువ ఉండకూడదు.

ప్రాథమిక హక్కుల ఉల్లంఘన సాధారణంగా మైనారిటీలు, అణగారిన వర్గాల విషయంలో జరుగుతుంటుంది. ప్రభుత్వాలు మతం, తెగల ప్రాతిపదికన వివక్షతో కూడిన చట్టాలను అమల్లోకి తెస్తే వాటిని కొట్టివేసే అధికారం సాధారణంగా కోర్టులకు ఉంది. అంతర్జాతీయంగా మానవహక్కులు, ఒప్పందాలకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని దేశీయ చట్టాల్లోకి ఎంతవరకు చేర్చవచ్చు అన్న అంశాన్ని న్యాయవ్యవస్థ పరిశీలిస్తుంది. ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న వ్యక్తులకు ప్రయోజనకరం కాగలదు. కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలు ప్రాథమిక హక్కుల పరిధిలోకి ప్రవేశించి చట్టాలు చేయకుండా న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా పరిశీలన చేసి ఎప్పటికప్పుడు నియంత్రించవచ్చు.

**కొన్ని కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు**

కేశవానంద భారతి (1973) (రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణం గురించి స్పష్టమైన రీతిలో సైద్ధాంతీకరించిన కేసు), పుట్టుస్వామి (గోప్యత హక్కు) కేసుల తీర్పులు ప్రాథమిక హక్కులకు సంబంధించి కోర్టులు ఇచ్చిన తీర్పుల్లో ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. మేనకాగాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1978)లో సుప్రీంకోర్టు, రాజ్యాంగంలోని 21వ అధికరణ (ప్రాణ,వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ) పరిధిని విస్తరించింది. ముఖ్యంగా విదేశాలకు వెళ్లాలను కోవడం వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు పరిధిలోకే వస్తుందని స్పష్టం చేసింది. ఎడిఎం జబల్‌పూర్ కేసులో అత్యవసర పరిస్థితిలో ఎలాంటి విచారణ లేకుండా పౌరులను నిర్బంధించడం ప్రభుత్వ హక్కుగా సుప్రీంకోర్టు పేర్కొంది. నిజానికి ఈ విధమైన నిర్బంధం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే తీవ్రమైన చర్య. నల్సా (నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ) వర్సెస్ భారత ప్రభుత్వం (2014) కేసులో ట్రాన్స్ జండర్‌ను మూడో జండర్‌గా సుప్రీంకోర్టు పరిగణించడమే కాదు వారికి చట్టపరంగా సమానహక్కులు, రక్షణ కల్పించింది. 2015లో శ్రేయ సింఘల్ కేసులో వాక్ స్వాతంత్ర్యపు హక్కును పరిరక్షించింది. ఈ సందర్భంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్–2000లోని 66ఎ సెక్షన్ చెల్లబోదని స్పష్టం చేసింది. 2017లో సైరాబాను వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో త్రిపుల్ తలాఖ్ చెప్పడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. విడాకుల విషయంలో ముస్లిం మహిళలకు సమాన హక్కులు ఉండాలని, వారి హక్కుల పరిరక్షణ ముఖ్యమని పేర్కొంది. నవ్‌తేజ్ సింగ్ జోహార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో (2018) స్వలింగ సంపర్కం నేరం కాదని పేర్కొంటూ, ఇండియన్ పీనల్‌కోడ్‌లోని 377వ సెక్షన్‌ను కొట్టివేసింది. ముఖ్యంగా ఇది గోప్యత, సమానత్వం, గౌరవం అనే అంశాల ప్రాతిపదికన లైంగిక ధోరణులను పరిగణించాలని పేర్కొంది.

**న్యాయవ్యవస్థ సంయమనం**

చట్టాలపై వ్యాఖ్యానించడం, అమలు పరచడంలో న్యాయవ్యవస్థ చురుగ్గా వ్యవహరించాలని కొందరు వాదిస్తే, సంయమనం అవసరమని మరి కొందరి అభిప్రాయం. ముఖ్యంగా పౌరుల హక్కుల పరిరక్షణ విషయంలో న్యాయవ్యవస్థ చురుగ్గా వ్యవహరించకపోతే బాధితులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని చురుకుదన సమర్థకుల వాదన. ఈ విధంగా చేయడం ద్వారా కార్యనిర్వాహక, శాసనవ్యవస్థల పరిధిలోకి చొరబడినట్లవుతుందని సంయమన సమర్థకుల విశ్లేషణ. అయితే సుప్రీంకోర్టు కేసు సందర్భాన్ని బట్టి చురుకుగా వ్యవహరించడమో, సంయమనం పాటించడమో చేస్తూ వస్తోంది. నిజానికి ఈ ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత పాటించడం న్యాయమూర్తులకు కత్తిమీద సాము వంటిదే. ఎందుకంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్య సూత్రాలు, కేసు పరిస్థితులు అనే మూడు అంశాలను వారు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇదే సమయంలో పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరిం చాల్సిన అవసరం కూడా తప్పనిసరి. ముఖ్యంగా ప్రాథమిక హక్కుల విషయానికి వస్తే పరస్పర విరుద్ధ హక్కులు లేదా పరిస్థితులను ఎదుర్కొనాల్సి రావచ్చు. ముఖ్యంగా ఒక వ్యక్తి హక్కు మరో వ్యక్తి హక్కుకు ఇబ్బంది కలిగించే పరిస్థితులు విరోధాభాసకు కారణం కావచ్చు.

ఉదాహరణకు వాక్‌స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కులు, శాంతిభద్రతల పరిరక్షణ, విద్వేషపూరిత ప్రసంగాల నియంత్రణ విషయంలో సంఘర్షణాత్మక పరిస్థితికి దారితీస్తాయి. మరి ఇదే సమయంలో గోప్యత హక్కును పాటించే సమయంలో, జాతీయ భద్రత లేదా చట్టం అమలు అంశాలను పరిగణనలోకి తీసుకోకతప్పదు. ఇటువంటి సమయాల్లోనే సుప్రీంకోర్టు చాలా జాగ్రత్తగా పరిస్థితిని విశ్లేషించి, నైష్పత్తిక, సహేతుకత సూత్రాలను పరిగణనలోకి తీసుకుంటూ కీలకంగా వ్యవహరిస్తుంది. ఇక్కడ సంఘర్షిస్తున్న హక్కులు, ప్రయోజనాలు అనే రెండు అంశాలను పరిశీలించి సమాజ విశాల హితాన్ని దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టు తన పాత్రను పోషిస్తుంది. అయితే ప్రాథమిక హక్కుల సమతుల్యత విషయంలో కోర్టు ఎప్పుడూ నిశ్చలంగా ఉండదు, పరిస్థితులను బట్టి సమాజహితాన్ని బట్టి ఎప్పటికప్పుడు వ్యవహరిస్తుం టుంది. కాగా ప్రాథమిక హక్కుల సమతుల్యత విషయంలో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయాలు, దేశంలోని రాజ్యాంగ న్యాయశాస్త్ర మీమాంస అభివృద్ధిపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. కొన్ని కేసుల్లో ప్రాథమిక హక్కుల విస్తృతిని సుప్రీంకోర్టు మరింతగా పెంచడం ఇందుకు ఉదాహరణ.

మొత్తం మీద చెప్పాలంటే భారత పౌరుల హక్కులు, విధులు,స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టే తిరుగులేని పరిరక్షకురాలన్నది సుస్పష్టం. అంతేకాదు చట్టాన్ని, దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతకు కూడా సుప్రీంకోర్టు రక్షకురాలిగా ఉంటుంది. ముఖ్యంగా కార్యనిర్వాహకశాఖ తన పరిమితులను అతిక్రమించకుండా చూసేందుకు, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణకు, సామాజిక న్యాయాన్ని కాపాడటంలో సుప్రీంకోర్టు పాత్ర కీలకమైంది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

కాంగ్రెస్ పార్టీ అంచనాలు బూమరాంగ్ అయ్యాయి. తెలంగాణ కులగణన సర్వేను దేశానికే రోల్‌మోడల్‌గా చూపించుకుందామని ఉవ్విళ్లూరిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఒకరకంగా ఎదురుదెబ్బ తగిలింది. దేశంలో ఆదర్శవంతం కాదు గానీ, ఈ సర్వే జరిగిన తెలంగాణలోనే దుమారం రేగుతోంది. ఇప్పుడీ సర్వే జరిగిన తీరును, సర్వే నివేదికను ప్రతిపక్షాలు మాత్రమే విమర్శిస్తున్నాయంటే రాజకీయ కారణాలనుకోవచ్చు. కానీ, తమ కోసమే ఈ సర్వే చేశారని మొదటినుంచీ చెప్పుకుంటోన్న బీసీ సంఘాలు కూడా అగ్గిమీద గుగ్గిలమవుతున్నాయి. అసలు సర్వే మొత్తం తప్పుల తడక అని కొట్టిపారేస్తున్నాయి. అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.




# కులగణన తప్పుల తడక..బీసీ

వాస్తవానికి కులగణన సర్వేను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అందుకే ప్రభుత్వ సమీక్షలకు ఆ నేతలు కూడా హాజరయ్యారు. ఏకంగా పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా హాజరయ్యారు. అంతేకాదు..తెలంగాణలో జరుగుతున్న కులగణన సర్వేను చూపించి జాతీయస్థాయిలో ప్రస్తావించారు. ఓ దశలో కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. పేరుకు సామాజిక, కులగణన అయినా, ప్రధానంగా బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన లెక్కలు తేలుస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. కానీ, ఇప్పుడు వీళ్ల లెక్కలు తారుమారయ్యాయి. ఇన్నాళ్లు దేశంలోనే తాము గొప్ప అంటూ ప్రచారం చేసుకున్న కులగణనపై ముప్పేట దాడి మొదలయ్యింది. దీంతో, జాతీయ స్థాయిలో దీనిని ఉదాహరణగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోవచ్చన్న కాంగ్రెస్‌పార్టీ అంచనాలు బెడిసికొట్టాయి.

ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య సంబంధిత సమగ్ర సర్వే అని ప్రచారం చేసినా.. దీనికి బీసీ కులగణనగానే ప్రచారం వచ్చింది. అందరూ బీసీ కులగణన అనే ప్రస్తావించుకున్నారు. దీంతో, అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన సర్వే అయినప్పటికీ.. బీసీ కులగణన అంటూ సర్వత్రా చర్చ జరిగింది. అందరూ అదే అంశంతో ముందుకెళ్లారు. కానీ, అదే అంశం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిక్కులు తెచ్చిపెట్టింది. గడిచిన పదేళ్లలో బీసీ జనాభా తగ్గిందన్న అంశం నివేదికలో పొందుపర్చడం రాజకీయ, సామాజిక వివాదానికి కేంద్రబిందువుగా మార్చింది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర కులగణన వివరాలు, అందులోని బీసీ లెక్కలపై దుమారం నెలకొంది. సర్వే జరిగిన తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2014లో 1.85 కోట్లుగా ఉన్న బీసీ జనాభా గడిచిన పదేళ్లలో పెరగాల్సింది పోయి 21 లక్షలకుపైగా ఎలా తగ్గుతుందని బీసీ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. 52 శాతంగా ఉన్న బీసీ జనాభాను 46 శాతానికి కావాలనే తగ్గించారని పలువురు బీసీ మేధావులు, ప్రొఫెసర్లు, ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. వెంటనే అఖిలపక్ష సమావేశం పెట్టి, నివేదికపై చర్చించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సమగ్ర కులగణన సర్వే తీరుపైనా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3 కోట్ల 50 లక్షలు కాగా, గడిచిన 14 ఏళ్లలో జనాభా కేవలం 20 లక్షలే ఎలా పెరుగుతుందని నిలదీస్తున్నారు. గత నెలలో ప్రకటించిన ఓటర్ల తుది జాబితాకు, తాజాగా ప్రకటించిన జనాభా వివరాలకు పొంతన కుదరడం లేదని అంటున్నారు.

మంత్రివర్గ ఉప సంఘానికి అందిన సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో 3 కోట్ల 70 లక్షల జనాభా ఉంది. ఇదే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ లెక్కలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 3 కోట్ల 50 లక్షల జనాభా ఉంది. ఈ 14 సంవత్సరాలలో కనీసం 50 లక్షల నుంచి 70 లక్షల దాకా జనాభా పెరిగి ఉంటుందని, ఆ ప్రకారం చూస్తే రాష్ట్ర జనాభా 4 కోట్ల నుంచి 4 .20 కోట్లకు చేరుతుందని అందరూ భావించారు. కానీ, ఈ 14 సంవత్సరాల్లో కేవలం 20 లక్షల జనాభా మాత్రమే పెరగడం అందరిలోనూ చర్చకు దారితీసింది. అంతేకాదు, జనవరి 6వ తేదీన ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో 3 కోట్ల 35 లక్షల 27 వేల 925 మంది ఓటర్లు ఉన్నారు. ఈ లెక్కన ఓటు హక్కు లేని 18 ఏళ్ల లోపు వారు కేవలం 35 లక్షల మందే ఉండాలి. కానీ, అంగన్‌వాడీలు, స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఎన్‌రోల్ అయిన విద్యార్థుల సంఖ్యే ఏకంగా 80 లక్షల దాకా ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతు న్నాయి. ఇంకా స్కూలుకు వెళ్లని చిన్నారులు, ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోని వాళ్లను కలిపితే కోటి దాకా ఉండొచ్చు. అంటే ఏరకంగా చూసినా రాష్ట్ర జనాభా 4 కోట్ల20 లక్షలకు పైమాటే అని చెప్పొచ్చు. కానీ, సమగ్ర సర్వేలో ఏకంగా 50 లక్షల దాకా జనాభా తగ్గడంపై విమర్శలు వ్యక్తమవు తున్నాయి.

వాస్తవానికి 2021లో జనాభా లెక్కలు నిర్వహించాల్సి ఉండగా, కరోనా కారణంగా ఆ ప్రక్రియ మొదలు కాలేదు. దీంతో ప్రభుత్వం దగ్గర పూర్తిస్థాయి జనాభా లెక్కలుగానీ, కులాలవారీ వివరాలుగానీ అందుబాటులో లేవు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినప్పటికీ ఆ వివరాలు బయటపెట్టలేదు. దీంతో తాము అధికారంలోకి వస్తే సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని 2023



# నేతల మండిపాటు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే గత ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన నలుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ నియమించింది. తర్వాత హైకోర్టు జోక్యంతో నవంబర్ బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. నవంబర్ 6 నుంచి డిసెంబర్10వ తేదీ వరకు ప్లానింగ్ కమిషన్ ఆధ్వర్యంలో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024' పేరుతో సమగ్ర కులగణన సర్వే నిర్వహించారు. గ్రామీణ ప్రజలు ఈ సర్వేలో ఉత్సాహంగా పాల్గొన్నప్పటికీ పట్టణాల్లో, ముఖ్యంగా జీహెచ్ఎంసీలో జనం సహకరించలేదని, చాలా మంది వివరాలు ఇవ్వలేదని, ఎన్యూమరేటర్లపైకి కుక్కలను ఉసిగొల్పారని పలువురు ఉన్నతాధికారులు, మంత్రులు చెప్పారు.

సర్వేలో పాల్గొనని పలువురు ప్రముఖులపై సీఎం రేవంత్ రెడ్డి సైతం అసహనం వ్యక్తం చేశారు. అదీగాక జీవనోపాధి కోసం పల్లెల నుంచి నగరాలకు వచ్చి, అద్దె ఇళ్లలో ఉంటున్న వారిని సర్వే టీమ్‌లు కనీసం పలకరించలేదనే విమర్శలు వచ్చాయి. ఇందుకు తగ్గట్లే అసలు కులగణన సిబ్బంది తమ ఇళ్ల వైపు కన్నెత్తిచూడలేదని పలుచోట్ల ప్రజలు ఆరోపించారు. పోనీ ఇలాంటి వారు తమ గ్రామాలకైనా వెళ్లి కుటుంబ వివరాలు ఇచ్చారా? అంటే అదీ లేదు. ఇలా ఏరకంగా చూసినా సర్వే అసమగ్రంగా జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2014లో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 52 శాతంగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే 46 శాతానికి తగ్గించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఏకంగా 6 శాతానికి పైగా జనాభాను తగ్గించి చూపారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఇంటింటి సర్వే నిర్వహించలేదని, ప్రభుత్వం మరోసారి కులగణన నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల జనాభాను పథకం ప్రకారం 21 లక్షలకు తగ్గించారని, సర్కారుకు దమ్ముంటే జనాభా లెక్కలను కులాలవారీగా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలని జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు.

ఇటు ప్రతిపక్ష నేతలు కూడా బీసీ లెక్కలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. కేవలం ఓసీ జనాభాను మాత్రమే పెంచి చూపి మిగతావన్నీ తగ్గించారని, సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం చూసినా, 2011 జనాభా లెక్కల ప్రకారం చూసినా ప్రస్తుత జనాభా లెక్కలు సరిపోలడం లేదని బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కులగణనలో బీసీల సంఖ్యను తగ్గించి చూపడంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. కాగా, కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, హరీశ్‌రావుకు, జస్టిస్ ఈశ్వరయ్య, వకుళాభరణం కృష్ణమోహన్ లాంటి బీసీ నాయకులకు తమను విమర్శించే హక్కులేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కావాలనే కొంత మంది సర్వేలో పాల్గొనలేదని, అలాంటి వారు ఇప్పటికైనా తమ వివరాలు అధికారులను సమర్పించాలని ఆయన సూచించారు. ఈ క్రమంలోనే బీసీ లెక్కలపై వాడీవేడి చర్చ జరుగుతోంది. తాజా సర్వే ప్రకారం ముస్లిమేతర బీసీల జనాభా కోటి 64 లక్షలు అంటే 46.25 శాతం ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దీంతో కొందరు బీసీ సంఘాల నాయకులు 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల పేరుతో ఓ నివేదికను బయటపెట్టారు.

పాత, కొత్త నివేదికలను పక్కపక్కన పెట్టి సోషల్ మీడియాలో తిప్పుతున్నారు. వీటి ప్రకారం అప్పట్లో బీసీల జనాభా కోటి 85 లక్షల 61 వేల 856గా ఉంది. ఈ లెక్కన గడిచిన పదేళ్లలో బీసీ జనాభా పెరగాల్సింది పోయి 21 లక్షలకుపైగా ఎలా తగ్గుతుందని బీసీ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

**సుజాత గోపగోని,**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వేగం పెంచేలా ఉంది. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకూ ఉపయోగపడేలా ఉంది. కిసాన్ క్రెడిట్‌కార్డులపై ఇప్పటి వరకు రూ.3 లక్షల వరకు రుణాలపై ఇస్తున్న వడ్డీ రాయితీని రూ. 5 లక్షల రుణాల వరకు పెంచడం వ్యవసాయాధారిత ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేస్తుంది. ధన, ధాన్య కృషి యోజనతో రాయలసీమ జిల్లాలకు ప్రయోజనం కలగనుంది. ఎంఎస్ఎంఈకి ఊతమిస్తూ ఎస్సీ, ఎస్టీలకు రూ.2 కోట్ల దాకా రుణం ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడంతో తోలు పరిశ్రమకు, బొమ్మల తయారీదారులకు మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం కింద రాష్ట్రాలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల కేటాయింపులను రూ. లక్ష కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు పెంచారు. ఇందులో సింహభాగం ఆంధ్రప్రదేశ్‌కు వస్తుంది.**




గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి సౌకర్యం కల్పించే జల్‌జీవన్ మిషన్ కాలపరిమితిని 2028 వరకు పొడిగించడం రాష్ట్రానికి మేలు చేస్తుంది. అమరావతికి రూ.15 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టడంతో పాటు, హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు ఇప్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత వస్తుంది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ను రాష్ట్రం పెద్దఎత్తున ఉపయోగించుకోవడానికి వీలుంది. రాష్ట్రానికి మారిటైం ఫండ్, షిప్ బిల్డింగ్ ఫండ్ కేటాయించారు. దుగరాజపట్నం దగ్గర ఏర్పాటు చేయనున్న షిప్పింగ్ బిల్డింగ్ యూనిట్‌కు ఈ నిధి దక్కనుంది. పోలవరానికి రూ.5,936 కోట్లు కేటాయించారు. ఇది రూ.12 వేల కోట్లతోనే అయిపోదు. ప్రతి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుకుంటూ నాలుగేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తాం' అని అన్నారు.

**విభజన హామీల అమలుకు నిధులు**

రాష్ట్ర విభజన హామీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్‌లో కేంద్రం మాట నిలబెట్టుకుంది. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు కేటాయింపులు చేసింది. విశాఖ ఉక్కుకి కూడా నిధులు సమకూర్చింది. రాష్ట్ర విభజన చట్టంలో ఉన్న అన్ని హామీలను నెరవేర్చేందుకు, పోలవరాన్ని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు కేటాయించింది. అమరావతికి వివిధ ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తామని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.15 వేల కోట్లు, రానున్న సంవత్సరాల్లో మరిన్ని నిధులు సమకూరుస్తామని వెల్లడించింది. విదేశీ సాయం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులను సంప్రదించామని, ఈ రెండు సంస్థలతో లీగల్ ఒప్పందాలపై డిసెంబరు 20, 26 తేదీల్లో సంతకాలు కూడా జరిగాయని వివరించింది. సవరించిన అంచనాల ప్రకారం.. పోలవరం తొలి దశ పూర్తవడానికి రూ.30,436. 95 కోట్ల వ్యయమవుతుందని, ఇందులో ఇప్పటికే రీయింబర్స్ చేసిన మొత్తం పోగా-రూ.12,157.36 కోట్లు ఇవ్వాల్సి ఉందని తెలిపింది. దీనిలో ఈ ఏడాది రూ.5,936 కోట్లు కేటాయించింది. పోలవరం తొలి దశలో 41.15 మీటర్ల కాంటూరులో ప్రధాన డ్యాం పనులు, కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించి కొత్త ఆయకట్టు అభివృద్ధికి, ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణకు వీలు కల్పించాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**పోలవరానికి అదనపు నిధులు**

పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,936 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్ కేటాయింపులకన్నా రూ.424 కోట్లు అదనం. ఈ నిధుల్ని అడ్వాన్స్‌గానే తెచ్చుకోవచ్చు. నిధులకు ఇబ్బంది తొలగడంతో ఇక పోలవరం ప్రాజెక్టు పనుల్ని షెడ్యూల్ ప్రకారం పరుగులు పెట్టించొచ్చు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు గాడిన పడింది.కేంద్రం తాజా డీపీఆర్‌ను ఆమోదించి మరో రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించి, అడ్వాన్సుగా నిధులు ఇవ్వడంతో పనులు ఇప్పటికే వేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వరుసగా బడ్జెట్లో కేటాయింపులు చూపుతోంది. అడ్వాన్సు నిధులూ ఇస్తోంది. ఇక 2024-25 బడ్జెట్‌లో రూ.5,512 కోట్లు కేటాయించగా,అందులో ఇంత వరకు ఇచ్చిన నిధులు సుమారు రూ.2,807 (అడ్వాన్సు నిధులు కలిపి). ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న నిధులు రూ.2,700 కోట్లు. అవీ ఇస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇచ్చినన్ని నిధులు ఎప్పుడూ ఇవ్వనట్లే.







# రాష్ట్ర ప్రగతికి ఊతం కేంద్ర బడ్జెట్

**విశాఖ స్టీల్‌కు అమల్లోకి ప్యాకేజీ**

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయింపులను కేంద్ర ప్రభుత్వం అనూహ్యంగా పెంచింది. 2024-25 బడ్జెట్‌లో తొలుత కేవలం రూ.620 కోట్లు కేటాయించిన ఉక్కుశాఖ తాజాగా సవరించిన అంచనాల ప్రకారం ఆ మొత్తాన్ని రూ. 8,622 కోట్లకు పెంచింది. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,205 కోట్లు కేటాయించింది. దీని ప్రకారం ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో స్టీల్ ప్లాంటుకు రూ.11,917 కోట్లు ఇచ్చినట్లయింది. ఇందులో రూ.11,418 కోట్లు బడ్జెట్ సపోర్ట్ రూపంలో, రూ.499 కోట్లు అంతర్గత బడ్జెటరీ వనరుల ద్వారా సమకూరుస్తారు. ఇది ఇటీవల ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ కంటే ఎక్కువ. ఈ ప్లాంటుకు 2023-24లో కేటాయించిన రూ.636,46 కోట్లను పూర్తిగా ఖర్చు చేసింది. ప్లాంటుకు ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాలను



కేంద్ర ఆర్థికశాఖ ఈక్విటీ షేర్లుగా పెట్టుబడి పెట్టనుంది. దీంతో ఇటీవల కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ అమల్లోకి వచ్చినట్లయింది.

**జల్ జీవన్ మిషన్ కొనసాగింపు**

గ్రామాల్లో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగించడం రాష్ట్రానికి కలిసొచ్చే అంశం. బోర్ల నుంచి కాకుండా సమీప జలాశయాల నుంచి నీరందించేలా రూ.70 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన పనులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రం ఆమోదానికి పంపింది. పథకం గడువు పొడిగింపుతో వీటిని సాధించుకునే అవకాశం వచ్చింది. జలజీవన్ మిషన్ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టించింది. కేంద్రం రూ.10,978 కోట్లకు పైగా నిధులు కేటాయిస్తే ఐదేళ్లలో రూ.4,235 కోట్లే వినియోగించుకుంది. రాష్ట్ర వాటా నిధులు సరిగా కేటాయించకపోగా, కేంద్ర నిధులనూ ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో రాష్ట్రంలో 4.78 లక్షలకు పైగా ఇళ్లకు కుళాయిల ద్వారా 2024 నాటికి తాగునీటి సౌకర్యం కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఇచ్చిన కొద్దిపాటి కుళాయిల ద్వారా నీరు సరిగా సరఫరా చేయలేకపోయింది.


**35,491 కోట్ల ప్రత్యేక గ్రాంటు**

2024 డిసెంబరు 24 నాటికి రాష్ట్రానికి రూ.3,950.31 కోట్ల మేరకు మూలధన వ్యయాన్ని ఆమోదించినట్లు కేంద్రం తెలిపింది. ప్రత్యేక సాయం కింద రూ.3,685.31 కోట్లు విడుదల చేసింది. 2015 జూన్ నుంచి గత డిసెంబరు వరకూ విభజన చట్టం కింద రాష్ట్రానికి రూ.35,491.57 కోట్ల ప్రత్యేక గ్రాంటు మంజూరు చేశారు.


* పూర్వోదయ ప్రాజెక్టు క్రింద విజన్ పత్రాలను రూపొందించాలని ఏపీ, ఒడిశా, బిహార్ రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం తెలిపింది. స్థూల ప్రణాళికలకు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.
* విభజన చట్టంలో భాగంగా రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇప్పటికే రూ.1,750 కోట్లు విడుదల చేయగా మరో రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉందని, యూసీల కోసం ఎదురు చూస్తున్నట్లు కేంద్రం పేర్కొంది.
* విశాఖపట్నం పోర్టు ట్రస్టుకు కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. 2024-25లో రూ.150 కోట్లు కేటాయించి అంచనా సవరణ నాటికి దానిని రూ.285 కోట్లకు పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.730 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ కంటే 386 శాతం సవరించిన అంచనాల కంటే ఇది 156 శాతం ఎక్కువ.
* రాష్ట్రంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ), సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన వర్సిటీకి నిధులు కేటాయించారు. ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షా యోజన కింద మంగళగిరి ఎయిమ్స్‌కు కూడా నిధులు మంజూరు చేశారు.

పన్నుల్లో వాటా రూ.57,566 కోట్లు

2025%-26లో ఏపీకి మొత్తం పన్నుల్లో 4.067 శాతం.. అంటే రూ.57,566.31 కోట్లు లభిస్తుందని కేంద్ర బడ్జెట్ పత్రాల్లో పేర్కొన్నారు. ఇందులో కార్పొరేషన టాక్స్ రూపంలో రూ.16,074.48 కోట్లు, ఆదాయ పన్ను రూపంలో రూ.21,448.05 కోట్లు, కేంద్ర జీఎస్టీ 16,759.03 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.2,649.66 కోట్లు, ఎక్సైజ్ సుంకం రూపంలో రూ. 550.47 కోట్లు, సర్వీస్ ట్యాక్స్ రూ.1.66 కోట్లు లభిస్తాయని తెలిపారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్




54

# ఆరోగ్యవంతునికి కల్పవృక్షాలు-రోగికి విషవృక్షాలు

రామ కథా రచనకు వాల్మీకికి ప్రేరణ క్రౌంచ మిథున వియోగం. దాంపత్య జీవితం సాగించే ఆ పక్షి జంటలో ఒక పిట్టను నిషాదుడు కొట్టగా రెండవది విలవిల విలపించినది. తమసానది స్నానానికి వెడుతున్న వాల్మీకి మునిచంద్రుని చెవిన బడినది, ఆ విలాపం. దానితో ఆయన గుండె ద్రవించి శోకించింది. ఆ శోకమే శ్లోకమయినది. ప్రపంచ సాహిత్యంలోనే అది మొదటి కావ్యానికి – మహాకావ్యానికి అంకురార్పణ అయింది. ఇది రామాయణ రచనకు ప్రేరణ; అదీ భారతీయ కవి ఆత్మ.

భారత రామాయణాలు ఆరోగ్యవంతునికి కల్పవృక్షాలు–రోగికి విషవృక్షాలు.

చెట్టుకొమ్మ మీది పిట్ట ఆర్తనాదాన్ని సహించలేని అతనిలో దయా హృదయం రామాయణ రచనకు ఉపక్రమించింది. అంటే రాజుల విలాస భోగాల కోసం, రాణుల అంగాంగ వర్ణన కోసం ఈ దేశంలో కావ్యం పుట్టలేదని తెలుతుంది.

అందువల్లనే దేశదేశాల మేధావులను ఆకర్షించింది, అలరించింది, నేటికి ఆ అలరింపూ, ఆకర్షణా ఉన్నాయి. అయితే దేవుడు పుట్టిన కృతయుగం నాటి నుండి దేవుడి మీద పగబూనిన హిరణ్యాక్ష, హిరణ్యకశిప, రావణ, కుంభకర్ణ, శిశుపాల, దంతవక్త్రాదుల వలెనే రామాయణం మీద కూడా విద్వేషం ప్రజ్వలింపజేసుకునేవారు పుడుతూనే ఉన్నారు. భారత, రామాయణాలు రెండూ తగుల బెట్టాలనే వారు ఉన్నా, భారతం కంటే రామాయణం అంటేనే వీరికి భయం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. భారతంలో ఉన్నంతగా మానవునిలోని పిశాచవృత్తి, దారుణకామ పాశం, అత్యంత ధనకాంక్ష రామాయణంలో లేకపోవడమే వీరి భయానికి హేతువుగా భావించవచ్చు. మనిషిని పశువుగా కాక పశుపతిగా (పరమ శివునిగా) పరివర్తింపజేయడానికే రామాయణం సాగడం వీరి గుండెకు దెబ్బతీసి ఉంటుంది. దశరథుడనే రాజు కొడుకు రాముడు. తండ్రిమాట విని సర్వసుఖభోగాలూ విడవడం, తనమీద భారం ఉంచి తనతో పంపిన జనక మహారాజు కూతురు కోసం భర్తగా–నానాయాతనలూ పడడం వీరికి నచ్చలేదు. సత్యధర్మపరాయణులయిన మునులను హింసించే క్రూరకర్ములయిన రాక్షసగణాలను రూపుమాపడమూ వీరికి గిట్టలేదు.


అన్ని గిట్టకపోగా,వీరి వాదంలో ఒక చమత్కారం ఉంది. దశరథుడున్నాడు, ఆయనకు భార్యలూ, బిడ్డలూ ఉన్నారు. మంధర ఉంది. శూర్పణఖ అనే అమ్మాయికి రాముని తమ్ముడు ముక్కు చెవులు కోశాడు. ఇలా ఇవన్నీ ఉన్నాయి కాని కొన్ని కొన్ని ఘట్టాలు మాత్రం కల్పనలు. అవి తమకు కిట్టనివి; గిట్టనివి! తమ వాదానికి గిట్టుబాటు కానివో!

రాముడనే వాడొకడున్నాడని చెప్పిన వాల్మీకి కంటే ఆ రాముని గూర్చి వీరికే బాగుగా తెలుసు. అదీ వీరి యోచనా స్రవంతి సాగించిన ప్రదక్షిణ. దేవుడు లేడు అంటే భారత,రామాయణాలు కూడా లేవు అని తమ వ్యాపారం తాము చేసుకొనవచ్చు. కాని అందుకు రాముని తిట్టాలి. వాల్మీకిని దుమ్ములో ముంచాలి. రామాయణం చదివే వారిని నేలబెట్టాలి. వీరి కోపమంతా రామాయణం చదివేవారిపైనా, భారతం వినేవారిపైన.

భారత, రామాయణ శ్రవణ మనన పరాయణులైన నిందించే ఈ వివేకులు ప్రజాభిప్రాయాన్ని మన్నించడానికి దీక్షాకంకణం ధరించిన మహనీయులు. వీరి మానసవీధిని పుట్టినదే ప్రజాభిప్రాయం. దానికి వారు గుత్తాధిపతులు. ఈ ఆధిపత్య ప్రతిష్ఠాపనకు వారు వాల్మీకి నుండి వర్తమాన రామకథా శ్రవణాసక్తుని కూడా దుర్భాషలాడగలరు. అది వారి దృష్టిలో హేతువాదం. అదే మానవతావాదము. నీడనిస్తూ, చక్కని వాతావరణం అనుగ్రహించే మహా వృక్షాలను సమూలముగా పెకలించి, పువ్వూ–పండూ లేని క్రోటను మొక్కలంటే ప్రీతిగల వారిని మనం ఏమనగలం. ఏమన్నా వారు మీద పడతారు. వీరి సంఖ్య సమాజంలో ఒకటి, రెండే కానీ వీరు ఆడేది పదుగురాడు మాట. వీరు పాడినది పదిమంది పాడవలసిన పాట. మనం ఆడము, పాడము.

– పురాణపండ, జాగృతి,
30.12.1974

ఆధ్యాత్మికం




# ధర్మస్వరూప సోదరద్వయం శంఖలిఖితులు

శంఖలిఖితులు అపూర్వ, అన్యోన్య రుషి సోదరులు ధర్మవిదులై మెలగే వారు. గొప్ప స్మృతి కర్తలు. సదాచారసంపన్నులు. జ్ఞానయోగాన్ని సూచించేలా చేతిలో శంఖు గుర్తు కలిగి ఉండడంతో శంఖుడు,లలాట లిఖితాన్ని బట్టి తపోదీక్షాపరుడు కాగలడని భావనతో లిఖితుడు అని వారి తండ్రి నామకరణంచేశారు. ఆ సోదర ద్వయం జ్ఞాన సముపార్జన ఆసక్తితో ఉపనయనం తరువాత, కన్నవారి అనుమతితో తపస్సుకు వెళ్లారు. చెరొక ఆశ్రమం నిర్మించు కొన్నారు. అవి నరనారాయణుల ఆశ్రమాల తరహాలో మనోరంజకంగా, శోభాయ మానంగా ఉండేవట. అన్నదమ్ము లిద్దరూ విశ్రాంతి సమయాలలో సద్గోష్ఠితో కాలం గడిపేవారు. బ్రహ్మచర్యం పాటిస్తూనే, మోక్షలక్ష్మిని ధర్మపత్నిగా, ఆశ్రమాలలోని జంతుసంతతి తమ ఆత్మసంతతిగా భావిస్తూండేవారు. ప్రాణం కంటే సత్యధర్మపాలనే మిన్నగా భావిం చేవారు. చోరత్వం లాంటి నేరాలు తెలియక చేసినా తప్పేనన్నది వారి ప్రగాఢ అభిప్రాయం. అందుకు ఓ ఉదాహరణ. ఒకనాడు శంఖుని ఆశ్రమానికి వచ్చిన లిఖితుడు, సోదరుని పరోక్షంలో అక్కడి మామిడిచెట్టు

# అభేదకులే హరిహరులకు పరమ ఆప్తులు

54



త్రిమూర్తులలో ఎవరూ ఎక్కడా కూడా పరస్పర నిందలు చేసుకోలేదు. నిందాదులను నిషేధిస్తూ, ఆ ముగ్గురూ ఒక్కటేనన్న విషయాన్ని శాస్త్రాలన్నీ ప్రశంసించాయి. బ్రహ్మ, విష్ణు,మహేశ్వరులు ఆయా సందర్భాలను బట్టి ప్రశంసలు అందుకుంటుంటారు. ఫలానా దేవుడు గొప్ప, ఫలానా దేవుడు తక్కువ అని భావించే వారు మరుజన్మలో రాక్షస,పిశాదులుగా పుట్టడం తథ్యమని విష్ణుపురాణం పేర్కొంటే, శివ పురాణం హరిహర అభేదాన్ని చాటిచెప్పింది. ‘శ్రీహరీ! నా దర్శనంవల్ల కలిగే ఫలమే నీ దర్శనంవల్ల కూడా కలుగుతుంది. నీవు నా హృదయంలో ఉన్నావు. నేను నీ హృదయంలో ఉన్నాను. మనలో భేదాన్ని చూడని వారే నాకు మాన్యులు’ అని శంకరభగవానుడు. శ్రీహరితో అన్నట్లు శివపురాణం పేర్కొంటోంది.

‘శంకరా నీవు నా హృదయంలో ఉంటున్నావు. నేను నీ హృదయంలో ఉంటున్నాను. మన ఇద్దరిలో భేదం లేదు. మూర్ఖులే మన పట్ల భేదబుద్ధి కలిగి ఉంటున్నారు. ఏకస్వరూపులమైన మన పట్ల దోషదృష్టి కలవాడు అనేక కల్పాల వరకూ కుంభీపాక నరకంలో పడి యాతనలను అనుభవిస్తాడు. నీకు భక్తుడైన ధార్మికుడు నాకునూ భక్తుడే. నా భక్తులు ప్రగాఢభక్తితో నీకునూ నమస్కరిస్తారు’ అని శ్రీరామచంద్రుడు శంకరునితో అన్నట్లు పద్మపురాణం చెబుతోంది.

“శంకరా! నాకు నీకన్న ప్రియమైన వాడెవడూ లేడు. నీవు నాకు ఆత్మాధిక ప్రియుడవు. నిన్ను నిందించే మూఢాత్ములు సూర్యచంద్రులు ఉన్నంత కాలం నరకయాతనలు అనుభవిస్తూంటారు. శివలింగాన్ని తయారుచేసుకుని ఒక్కసారైనా పూజ చేసేవాడు అనేక కల్పాలవరకూ స్వర్గసుఖాలననుభవిస్తాడు. శివలింగార్చన వల్ల మానవులు పుత్ర, మిత్ర, కళత్ర,శ్రేష్ఠత్వ,జ్ఞానముక్తులను పొందగలుగుతారు. శివ నామోచ్చారణతో దేహాన్ని త్యజించేవారు అనేక జన్మల పాపాన్ని నాశనం చేసుకుని మోక్షం పొందుతాడు’ అని శ్రీకృష్ణ భగవానుడు శంకరునితో అన్నట్లు బ్రహ్మవైవర్త పురాణం చెబుతోంది.

“దక్షా! మేము ముగ్గురమూ ఏకస్వరూపులం. సర్వ భూతాంతరాత్మలం. మా పట్ల అభేదత్వాన్ని చూడగలుగువాడే పరమశాంతిని పొందగలుగుతాడు. ఇది నిస్సందేహం’ అని శ్రీహరి దక్ష ప్రజాపతితో అన్నాడని శ్రీ మద్భాగవతం తెలుపుతోంది. దీనిని బట్టి వేరొకరి ఇష్టదైవాన్ని నిందించి, అవమానించువాడే నిజానికి తన ఆరాధ్య దేవతనే నిందిస్తున్నాడు. పరమాత్మ ప్రాప్తికి పూర్వం ఆయన యథార్థతత్త్వాన్ని గుర్తించకపోవడంవల్ల భక్తుడు తన తెలివితేటలను అనుసరించి ఉపాస్య దేవతను స్వరూపకల్పితం చేసుకుంటున్నాడు. కాని ఉపాశ్య దేవత స్వరూపం దాని కంటే అత్యంత విలక్షణమైంది. కాని వాని భావాభిరుచులను అనుసరించి చేసిన సత్య శ్రద్ధాభక్తి యుక్తమైన ఉపాసనను పరమాత్మ సర్వదా స్వీకరిస్తున్నాడు. ఈశ్వరుని ఏ నామ రూపంతో ఉపాసించినా శీఘ్రమే నిత్య విజ్ఞానానందఘనుడైన పరమాత్మను పొందుతున్నాడు. సకామభావోపాసకునికి భగవత్ప్రాప్తిలో విలంబం కలగవచ్చు. అయినా సకామభావోపాసకుడు కూడా శ్రేష్ఠోదారుడుగానే పరిగణనపొందుతున్నాడు. ఆఖరిలో అతడు కూడా ఈశ్వరునే పొందుతున్నాడు.

నిత్య విజ్ఞానానందఘనమై పరమాత్మ వాచకమైన “శివ” శబ్దం ఉచ్చారణలో సరళమై శ్రవణ మధురమై, స్వాభావికమై శాంతి ప్రదమైనది. ‘వశ కాంతే’ ధాతువు నుంచి “శివ” శబ్దం ఉత్పన్న మైనది. ఎవనినైతే అందరూ కోరతారో అతని పేరే ‘శివుడు’– అని దాని తాత్పర్యము. అందరూ అఖండానందాన్ని వాంఛిస్తారు. కనుక “శివ” శబ్దార్థం ఆనందద్యోతకమవుతున్నది. పరమానందమే పరమ మంగళం, పరమ కల్యాణదాయకం. కనుక శివ శబ్దార్థంగా పరమ కల్యాణ మంగళాలను స్వీకరించాలి. పరమానంద ప్రదాత, పరమ కల్యాణ స్వరూపుడూ అయిన శివునే శంకరుడంటారు. ‘శం’ ఆనంద వాద్యం. ‘కర’ అనగా చేసేవాడని అర్థం. కనుక శంకరుడంటే ఆనందింప జేయువాడని భావించాలి. ఇవన్నీ నిత్యవిజ్ఞానా నందఘనుడైన పరమాత్మ లక్షణాలే కదా!

ఈ విధమైన రహస్యాన్ని అర్థం చేసుకుని శ్రద్ధా భక్తులతో శివదేవుని ఉపాసించడం ద్వారా ఆ మహాత్ముని ఆయన తత్త్వం గ్రహించడానికి అవకాశం కలుగుతుంది. శివతత్త్వాన్ని గుర్తించినాడు గ్రహించవలసిన విషయమేమీ ఉండదు. వస్తుతః శివతత్త్వాన్ని గుర్తించినది పార్వతీమాత. కనుక కపటవేషధారియై పార్వతిని పరీక్షించవచ్చిన శంకరుడు విఫలుడైనాడు.

శివతాత్త్వైక నిష్ఠతో గిరిరాజకుమారి ఘోర తపస్సు ఆరంభించింది. ఆమెను తపస్సు నుండి మరల్చాలని తల్లిదండ్రులూ, రుషులూ, మునులూ కూడా ప్రయత్నించి విఫలురై తుది అవస్థలో – “ఆహా! ఈమె తపస్సు అమోఘమైనది” అని ప్రశంసించారు.

**–రాధాకృష్ణమూర్తి,జాగృతి, 30.6.1961**

నుంచి రెండు ఫలాలు కోసుకొని తిన్నాడు. అనుమతి లేకుండా అలా చేసినందుకు సోదరుడిని మన్నింపును కోరడంతో పాటు తన తప్పునకు దండన విధించాలని వేడుకొన్నాడు. అది తప్పుకాదని, అన్న లిఖితుడు నచ్చజెప్ప చూచినా, సమాధానపడలేదు. ‘పరిగ్రహం’ అనే ఆలోచన రావడమే తప్పని, ఆ దోషానికి తాను దండనార్హుడనని అన్నాడు లిఖితుడు. అన్నగారితో కలిసి రాజు సుద్యుమ్నుని దర్శించి, ‘శ్రేష్ఠు(ల) లని అనుసరించే లోకులు నడుస్తారు. నా చర్యతో నా శ్రేష్ఠత్వం మసక బారిపోయింది. రాజధర్మంలో ఎవరికైనా శిక్ష ఒకేలా ఉంటుంది. ధర్మం విషయంలో శత్రుమిత్రులు, ధనిక బీద, ఆప్తానాప్తులు అనే సంశయం కూడదు. పైగా పామరుడు అజ్ఞానం వల్ల తప్పు చేయవచ్చుకానీ, సర్వశాస్త్రాలు తెలిసిన వారు ఏ చిన్న పొరపాటుకు పాల్పడినా సమాజంపై దాని ప్రభావం ప్రతిఫలిస్తుంది. కనుక నాకు శిక్షవిధించాలి’ అని సూచించాడు. దాంతో శంఖుని చేతులను ఖండించవలసిందిగా ఆదేశించాడు. శిక్షను అనుభవించిన శంఖుడు, సమీపంలోని బహుదానదిలో మునికి లేచిన వెంటనే చేతులు పునరుజ్జీవనంపొందడమే కాక, మునుపటి కంటే అద్భుత రూపంలో ప్రకాశించసాగాడు. లఘుశంఖ స్మృతి శంఖ స్మృతి, లిఖిత స్మృతి, శంఖ లిఖిత స్మృతి.. అని వారి పేరున స్మృతులు ఉన్నాయి. బ్రహ్మచర్యాది ఆచార్య వర్ణనం, అతిథి వర్ణనం, వివిధ వ్రతవిధానాలు,జననమరణ శౌచవర్ణనం, ఉదక కుంభదానం, అగ్నిస్థానం, పరాన్న భోజన దోషనిరూపణం తదితర ధర్మ సూక్ష్మాలు వాటిలోఉన్నాయి.యాజ్ఞవల్క్యుడు శంఖలిఖిత స్మృతిని అనేకమార్లు ఉదహరించారని, మను గౌతమ పరాశరులతో పాటు శంఖలిఖితుల స్మృతులు ధర్మాలకు పరమ ప్రమాణాలని పరాశర ధర్మశాస్త్రం పేర్కొంటోందని చెబుతారు.

**– రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**'Children of immortal bliss"- What a sweet, what a hopeful name!**
**You are the children of God.**
**You are divinities on earth**

అమృత పుత్రులార ఆత్మ జ్యోతుల్లార
పాప రహితులైన సా&వములార
ధరణిపైన దిరుగు దైవ పుత్రులు గదా
వినుడి స్వామి సద్వివేక వాణి!!






బండిరాజుల శంకర్

'పెళ్లి విషయంలో నేను బాగా మోసపోయా నురా... అయినా ఈ సాఫ్ట్వేర్ చదువు, అమెరికా ఉద్యోగాలు దూరపు కొండల నునుపు.. ఇక్కడికంతా డబ్బు కోసమే వస్తారు. అన్ని బంధాలను డబ్బుతోనే కొలుస్తారు. ఇదొక ఊబి. ఇందులో దిగితే బయటకు రావడం కష్టం. ఈ ఊబిలో నేను పీకలోతు దాకా కూరుకుపోయాను. బయటపడే మార్గం కనిపించటం లేదు. నాకిక్కడ క్షణం కూడా ఉండ బుద్ధి కావటం లేదు. త్వరగా ఇండియా వెళ్లిపోవాలనిపిస్తోంది' అన్నాడు శ్రీరామ్.

'శ్రీరామ్.. అందరూ అలా ఉంటారనీ చెప్పలేము. కాకపోతే ఎక్కువ మంది నీ భార్యలాగే ప్రవర్తిస్తున్నారు. వాళ్లకి భావి జీవితం, నైతిక విలువల మీద నమ్మకం లేదు. కేవలం జీవితాన్ని అనుభవించడానికి డబ్బులు కావాలి... దానికోసం ఏదైనా చేస్తారు. విడాకులంటే పూర్వం భయపడేవారు. రెండో పెళ్లికి ఇష్టపడేవారు కాదు. ఇప్పుడవేమి లేవు. చిన్న చిన్న కారణాలకు విడాకులు తీసుకుంటున్నారు. పైగా ఆడపిల్లల తల్లితండ్రులు కూడా విడాకులను ప్రోత్సహిస్తున్నారు. దానివల్ల తమ కూతురు జీవితం ఏమవుతుందోననే ఆలోచన లేదు. సమాజంలో గ్లోబలైజేషన్ తెచ్చిన మార్పులివి. ప్రపంచీకరణ వల్ల డబ్బుకి విలువ పెరిగి నైతికతకు విలువ తగ్గింది. ఇటువంటి వారు మన రాష్ట్రంలోనూ ఉన్నారు. కేవలం అమెరికాలో ఉన్న వాళ్లనే అనక్కర్లేదు. నీ భార్య లాంటి వారు అమెరికా వచ్చి మహా అయితే ఐదారేళ్లయి ఉంటుంది. ఇది మన వాళ్ల తప్పు కానీ అమెరికాది కాదు. ప్రపంచీకరణ వల్ల ఇప్పుడన్నీ ఒకలాగే ఉన్నాయి. ప్రపంచంలోని అవలక్షణాలన్నీ మనకి వచ్చేసాయి. మంచి అబ్బదు కానీ చెడెంత సేపు చెప్పు? అమెరికా వచ్చిన వారు ఇక్కడి మంచిని నేర్చుకోవాలి.కానీ చెడునే అలవాటు చేసుకుంటున్నారు.




నేను మన దేశం వెళ్లిన తరువాత మీ అమ్మనాన్నల్ని కలుస్తాను. నువ్వు వివరాలిస్తే మీ లాయర్ని కలసి ఎలా ముందుకెళ్లాలో అతనితో మాట్లాడతాను. ఇదేం పెద్ద కేసేం కాదు. 90 శాతం గృహహింస కేసులన్నీ ఆవేశంతోనో, అనాలోచితంగానో పెడుతున్నవే. సరియైన విచారణ చేయకుండా అరెస్టులు చెయ్యొద్దనీ సుప్రీమ్ కోర్టు పోలీసులకు విస్పష్టంగా ఆదేశాలు జారీ చేస్తూ తీర్పు ఇచ్చింది. కాబట్టి పూర్వంలా గృహ హింస కేసులంటే భయపడక్కర్లేదు. ఒకసారి పోలీసు స్టేషన్కు వెళ్లామంటే విడాకులే శరణ్యం. ఆ అమ్మాయి ఇవన్నీ ఆలోచించినట్లు లేదు. ఒకసారి విడాకులు తీసుకుంటే పెళ్లిళ్లు కావడం కష్టం. మరీ ముఖ్యంగా స్త్రీవాదులందరూ మగవాళ్లదే తప్పనీ, స్త్రీకి స్వేచ్ఛ ముఖ్యం అంటారు గానీ విడాకుల తదనంతర పరిణామాలు గురించి ఆలోచించరు. కొందరు మొగవాళ్లు వారు అలాంటి వారు కావచ్చు.. కాదనలేము. అలా అనీ అందరినీ ఆ గాటన కట్టేయలేం. విడాకులు తీసుకున్న తరువాత చాలా మంది జీవితాలు ఎలా చితికి పోయాయో నాకు తెలుసు. ముఖ్యంగా పిల్లలు బాధపడుతున్నారు. విడాకులు తీసుకున్న తల్లితండ్రుల పిల్లల జీవితాలు చాలా ఒడుదొడుకులకు లోనవుతాయి. 45 ఏళ్ల దాకా బాగానే ఉంటుంది. తరువాత తోడు లేకపోతే జీవితం నరకం అవుతుంది" అనీ వాడికి చెప్పాను...

శ్రీరాంతో ఎంతో సరదాగా ఆనందంగా గడపాలనీ అనుకున్నాను గానీ వాడి కథ విన్న తరువాత నా మనసు వికలమైంది. ఆ బాధతో అన్నం తినబుద్ధి కాలేదు. శ్రీరామ్ ఆ మర్నాడంతా నాతో ఉండి కేంబ్రిడ్జి నగరం అంతా చూపించాడు... ఆ రాత్రి సియాటెల్ వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు నేను కాలేజీలో ఉన్నప్పుడు సమీర నుంచి నాకు ఒక మెసేజ్ వచ్చింది. తాను కాల్ఫోర్నియాలో ఉన్నాననీ, వెంటనే వచ్చి తనను కలవమనీ అందులో ఉంది. ఆ మెసేజ్ చూసి ఆశ్చర్యపోయాను. నేను అమెరికా వచ్చినట్లు సమీర కెలా తెలిసింది? శ్రీరామ్గానీ, మధుగానీ చెప్పారా? అయినా అంత అర్జెంటుగా ఎందుకు రమ్మంది? ఏదైనా సమస్య ఎదురైందా? నా మస్తిష్కంలో ఎన్నో ప్రశ్నలు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు.. ఇక్కడ కొచ్చినా

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన




సమీరను కలవకూడదనుకున్నాను కానీ సమీర మెసేజీ చూసిన తరువాత ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు.

అప్పటికే సెమినార్ ప్రారంభమైపోయింది. ఈ రోజు నేను పేపర్ ప్రెజెంట్ చెయ్యబోతున్నాను. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే దాన్ని సరిగ్గా ప్రెజెంట్ చెయ్యలేకపోవచ్చు. ప్రొఫెసర్ గారు నా మీద ఎన్నో ఆశలు పెట్టుకొని తన బదులు నన్ను ఇక్కడికి పంపించారు. అటువంటి దాన్ని నేను సరిగ్గా ప్రెజెంట్ చెయ్యకపోతే ఆయనకు చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఎక్కువగా ఆలోచించకూడదు అనుకొని సెమినార్ హాలుకు వెళ్లాను. ఈ రోజుతో ఈ సెషన్ పూర్తవుతుంది. నా పేపరు తరువాత వెలిడక్టరీ ఫంక్షన్ ఉంటుంది. అందరికీ వైస్ ఛాన్సలర్ సర్టిఫికేట్స్ ఇస్తారు. ఈ సెమినార్ ముగింపు ఉత్సవంలో పాల్గొనేందుకు సత్య నాదెళ్ల వస్తారనీ నిర్వాహకులు చెప్పారు. ఆ వార్త నాకు చాలా ఆనందం కలిగింది. ఒక భారతీయుడు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సాఫ్ట్వేర్ కంపెనీకి సీఈఓగా ఎదిగిన ప్రస్థానం సత్యనాదెళ్లది. ఆయన చూడాలన్న చాలా రోజుల కోరిక ఈ రోజు నెవవేరబోతున్నందుకు చాలా ఆనందం కలిగింది. పేపర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒక్కొక్క స్లైడ్ వేస్తూ ప్రారంభించాను. నల్లరేగడి నేలల్లో వంతెనలు, భవనాల పునాదులను ఏ విధంగా నిర్మిస్తే మంచిదో తెలిపే పేపరు అది. మనదేశంలో చాలా ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నల్లరేగడి నేలలు అధికం. అక్కడ భవనాలుగాని, బ్రిడ్జిలుగాని నిర్మిస్తే ఆ నేలల కుండే ఒక ప్రత్యేక సాగే గుణంవల్ల పునాదులకు బీటలు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. వాటికి విరుగుడుగా కొన్ని పద్ధతులు పాటిస్తే వాటి పునాదులను పటిష్ఠంగా నిర్మించవచ్చనీ ఉదాహరణలు, ఫొటోలతో సహా ఆ పేపరులో పొందుపరిచాను. ఇది నేను ఎంటెక్‌లో చేసిన ప్రాజెక్టే కాబట్టి ఈ నేలల మీద నేను చాలా పరిశోధన చేసాను. ప్రెజెంటేషన్ పూర్తైన తరువాత మిస్సెచూసెట్స్ ప్రొఫెసర్ దాన్ని బాగా మెచ్చుకున్నారు. ఆ మెప్పుకోలుతో నాలో టెన్షన్ తగ్గింది. మా ప్రొఫెసర్ గారు కూడా ఫోన్ చేసి పేపరు బాగా ప్రెజెంట్ చేసినందుకు నన్ను అభినందించారు. మర్నాడు కాలిఫోర్నియా వస్తున్నట్లు సమీరకు మెసేజ్ పెట్టేను. ఆమె కూడా నా కోసం ఎదురు చూస్తున్నట్లు రిప్లై పెట్టింది.

ఆ మర్నాడుదయాన్న లోకల్ ఫ్లైట్‌లో కాలిఫోర్నియా చేరాను. ఆమె అక్కడికి దగ్గర్లోనే ఉన్న సిలికాన్ వేలీలో పనిచేస్తోంది. అక్కడికి బయలు దేరాను. సిలికాన్ వేలీ. ఉత్తర కాలిఫోర్నియా రాష్ట్రంలోని సాన్ ఫ్రానిస్కో హై టెక్నాలజీ గ్లోబల్ సెంటర్. ఇది సాఫ్టవేర్ టెక్నాలజీకి ఇన్నోవేషన్ వేలీ అని చెప్పవచ్చు. ఈ వాలీలో అతి పెద్ద సిటీ సేన్ జోస్... ఈ నగరమే కాకుండా సన్నీ వేల్, శాంతా క్లారా, రెడ్ ఉడ్ సిటీ, మౌంటెన్ వ్యూ, పాలో ఆల్టో, మేన్లో పార్క్ లాంటి నగరాలున్నాయి. వీటన్నింటినీ కలిపే సిలికాన్ వేలీ అంటారు. సేన్ జోస్ మెట్రోపాలిటన్ నగరపు జీడీపీ ప్రపంచంలో మూడవ పెద్దది. మొదటి రెండూ జూరిచ్ స్విట్జర్లాండ్, ఓస్లో నార్వేలు.

ఈ వేలిలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ముప్ఫై కంపెనీల ముఖ్య కార్యాలయాలున్నాయి. ఈ వేలి అభివృద్ధికి కారణం అక్కడి దగ్గర్లోని స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం అని చెప్పవచ్చును. ఆ వేలీని చూడగానే నాకు చాలా ఆనందంగా ఉంది. చుట్టూ పచ్చని చెట్ల మధ్య విశాలమైన రోడ్లు, భవనాలు... ప్రపంచాన్ని శాసిస్తున్న సాఫ్ట్వేర్ కంపెనీలన్నీ ఇక్కడే ఉన్నాయన్న సంగతి గుర్తు కొచ్చి నాకు ఒళ్లు గగుర్పాటు కలిగింది.

ఫ్రెడరిక్ టెర్మాన్ అనే స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయ డీన్ తమ విద్యార్థులను స్వంత కంపెనీలను పెట్టమనీ ప్రోత్సహించడం వల్ల 1946 నుంచి ఈ వేలీ అభివృద్ధి చెందింది అనీ చెబుతారు.

సమీర ఇచ్చిన చిరునామా ప్రకారం పదకొండు గంటలకు ఆమె ఆఫీసుకి చేరాను. అతి పెద్ద భవనంలోని రెండవ అంతస్తులో ఉంది ఆ ఆఫీసు. నన్ను చూసి తాను చాలా ఆనందించింది. పది నిమిషాల తరువాత ఇద్దరం కిందకు దిగి చెట్ల మధ్య ఉన్న రెస్టారెంటుకు వెళ్లాం. అది ఆఫీసు సమయం కాబట్టి పెద్దగా జనాలు లేరు. మేమిద్దరం దూరంగా ఉన్న చెట్టుకింద ఉన్న టేబిల్ దగ్గర కూర్చున్నాం. వెయిటర్ రాగానే కాఫీలు తెమ్మని చెప్పింది సమీర. ఆ తరువాత మా మధ్య మౌనం. ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. సమీర అమెరికా చదువుకునేందుకు వచ్చినప్పట్నుంచీ నేను ఆమెతో మాట్లాడటం తగ్గించేశాను. కానీ ఈ రోజు అనుకోకుండా రావలసి వచ్చింది. కాఫీలు రాగానే సమీరం పాట్‌లోని కాఫీని కప్పులో పోసి ఇచ్చి తను కూడా ఓ కప్పులో పోసుకుంది...


కాఫీ తాగుతూ తన గురించి చెప్పటం మొదలు పెట్టింది.. అలా నేను అమెరికాలో సమీరని కలియడం నా జీవితంలో పెద్ద మార్పుకి కారణమౌతుందనీ నేనూహించలేదు...

*　*　*

"మనం కాలేజీ వదిలిన తరువాత నువ్వు నన్ను కలియడం తగ్గించేసావు. నిన్ను కలిసి మాట్లాడాలనీ చాలాసార్లు ఎంతో ప్రయత్నించాను కానీ కుదరలేదు. నేను అమెరికా వెళుతున్నందుకు కోపంతో నువ్వు మాట్లాడటం లేదనీ చాలా బాధపడ్డాను. పరీక్ష దగ్గర్నుంచి అమెరికా వెళ్లేదాక మా అన్నయ్యే అన్ని ఏర్పాట్లను చేశాడు. నేను అమెరికా బయలుదేరే రోజు దగ్గర పడింది. నిన్ను కలవాలనీ మా రైతు శివుడు చేత కబురు పంపిస్తే నువ్వు చదువుకునేందుకు విశాఖపట్నం వెళ్లిపోయావని తెలిసింది. అప్పుడు నేను ఫోన్ చేస్తే అవుటాఫ్ కవరేజి అనీ వచ్చింది. విమానాశ్రయంలో కలవమనీ కోరుతూ మెసేజ్ పెట్టాను. కానీ మా అమ్మానాన్నలు అక్కడికి వస్తారు కాబట్టి నువ్వు రావనీ అనుకున్నాను. నేను అనుకున్నట్లే నువ్వు రాలేదు.

ఆ తరువాత అమెరికా వచ్చిన తరువాత రెండు, మూడు సార్లు నీతో మాట్లాడేను కానీ నీ మాటల్లో పూర్వపు ఉత్సాహం కనిపించలేదు సరికదా నిర్లిప్తతని గమనించాను... ఏదో మాట్లాడాలి కాబట్టి మాట్లాడినట్లు ఉన్నాయి... అందుకే నేను ఆ తరువాత మాట్లాడటం తగ్గించేసేను..

**(సశేషం)**



గన్నవరపు నరసింహమూర్తి

# భారత్‌పైకి రోహింగ్యాలను దువ్వుతు



**బాంగ్లాదేశ్ భుజాల మీద తుపాకీ పెట్టి రోహింగ్యాలను తూటాలుగా చేసుకొని భారత్‌పై కుయుక్తితో దాడి చేయాలని చూస్తోంది పాకిస్తాన్‌కు చెందిన గూఢచారి సంస్థ– ఐఎస్ఐ. ఆ క్రమంలో బాంగ్లాదేశ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఇందుకు తప్పుపట్టాల్సింది బాంగ్లాదేశ్‌లో ముహమ్మద్ యూనుస్ సర్కారును తప్ప మరెవర్నో కాదు. ఇప్పటికే అల్లకల్లోలంగా ఉంది అక్కడి పరిస్థితి. దీనికి తోడు దేశ అంతర్గత వ్యవహారాల్లో ఐఎస్ఐ జోక్యం ఇలాగే కొనసాగె పక్షంలో భవిష్యత్తులో బాంగ్లాదేశ్‌ను ఆదుకోవడానికి ఏ ఒక్కరూ ముందుకు వచ్చే పరిస్థితి ఉండదు. ఇదే సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా రోహింగ్యాలను దువ్వుతోంది పాకిస్తాన్.**

రోహింగ్యాలకు సంబంధించి అరకన్ రోహింగ్యా విమోచన సైన్యం – ఏఆర్ఎస్ఏ, రోహింగ్యా సంఘీభావ సంస్థ – ఆర్ఎస్ఓ, ఇస్లామీ మహజ్, అరకన్ జాతీయ రక్షణ బలగం – ఏఎన్‌డీఎఫ్ అనే మూకలతో బాంగ్లాదేశ్‌లో నలుగురు సోదరుల కూటమిని ఐఎస్ఐ ఏర్పాటు చేసింది. ఈ కూటమి భద్రతా ఏజెన్సీలకు మరీ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో భద్రతా ఏజెన్సీలకు ఓ పీడకలగా మారే ప్రమాదం ఉంది. అలాంటి కూటమికి రోహింగ్యా సైన్యం అనే పేరు కూడా ఉంది. నాలుగు రోహింగ్యా మూకలు ఒక కూటమిగా ఏర్పడ్డాయనే విషయాన్ని ప్రకటించడం కోసమని బాంగ్లాదేశ్‌లోని కోక్స్ బజార్ నగరంలో 2024 డిసెంబర్ 25న ఓ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రోహింగ్యా శరణార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎస్ఐ వెన్నుదన్నుతో వరుస భేటీలు జరిగాయి.

**ఐఎస్ఐ కొత్త పన్నాగం**


బాంగ్లాదేశ్ నుంచి షేక్ హసీనా నిష్క్రమించిన తర్వాత ఐఎస్ఐ చేస్తున్న ఈ దుష్ట పన్నాగాన్ని చాలా దగ్గరుండి గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆమె నిష్క్రమణకు తోడు తనకు బాగా కావాల్సిన వారు పాలనా పగ్గాలు చేపట్టడంతో బంగ్లాదేశ్ నుంచి తన కార్యకలాపాలు సాగించడానికి ఇదో అద్భుతమైన అవకాశమని ఐఎస్ఐ భావిస్తోంది. ఇప్పటికే అక్కడ జిహాదీ దుష్టశక్తులు తిష్ట వేసుకొని కూర్చున్నాయి. ఇదే అదనుగా నాలుగు రోహింగ్యా మూకలను ఏకం చేయడం ద్వారా ఆ ప్రాంతంలో మరీ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతిని సృష్టించడమే లక్ష్యంగా అది పావులు కదుపుతోంది.

ఇప్పటికే ఈశాన్య ప్రాంతంలోకి రోహింగ్యా ముస్లింలు వెల్లువలా వచ్చిపడుతున్న కారణంగా కొత్తగా జట్టు కట్టిన కూటమికి ఆ ప్రాంతంలో అరాచకాలకు ఒడిగట్టడానికి ఎలాంటి అడ్డూ అదుపూ ఉండదనే ధీమాతో ఐఎస్ఐ ఉంది. ఇక అక్కడ ఏదైనా ఉగ్రదాడి చేయడమే తరువాయి అన్నట్టుగా అది పన్నాగం పన్నుతోంది. నిన్న మొన్నటి దాకా ఈ నాలుగు రోహింగ్యా మూకలు వేటికవే అన్నట్టుగా అరాచకాలు సాగిస్తుండేవి. అదే ఆ నాలుగింటిని ఏకం చేస్తే అవతల ఏర్పడిన కూటమి మరింత ప్రాణాంతకంగా తయారవుతుందని ఐఎస్ఐ భావిస్తోంది. ఏదైతేనేమీ మొత్తానికి రోహింగ్యా మూకలతో నలుగురు సోదరుల కూటమిని ఏర్పాటు చేయడంలో పాకిస్తాన్ గూఢచారి ఏజెన్సీ విజయం సాధించినట్టు కనపడుతోంది. అయితే ఇదంతా కూడా ఐఎస్ఐ ఒంటి చేత్తో చేసిందనుకుంటే పొరపాటే. బాంగ్లాదేశ్ ప్రభుత్వంలోని కొందరు ఈ కూటమిని కట్టడంలో ఐఎస్ఐకు చేదోడువాదోడుగా సాయ పడ్డారు. నిజానికి బంగ్లాదేశీయులు సైతం ఈ కూటమికి అండగా నిలబడటంతో వారి లక్ష్యం భారత్ తప్ప మరే ఇతర ప్రాంతం కాదని తేటతెల్ల మౌతోంది.

కోక్స్ బజార్ సమావేశంలో మయన్మార్‌లో కోల్పోయిన భూభాగాన్ని ఎలాగోలా హస్తగతం చేసుకోవాలని నిర్ణయించడం జరిగింది. వేలాదిగా రోహింగ్యాలను వెళ్లగొట్టిన అరకన్ సైన్యంతో పోరాటం చేసే అంశంపై కూడా సమావేశం దృష్టి పెట్టింది.

బాంగ్లాదేశ్‌కు చెందిన నిఘా బలగాల డైరెక్టరేట్ జనరల్ – డీజీఎఫ్ఐ సైతం ఈ రోహింగ్యా మూకలకు మరీ ముఖ్యంగా ఆర్ఎస్ఓకు కావలసినంత మద్దతు ఇస్తోంది. కేవలం ఏఆర్ఎస్ఏను దెబ్బ తీయాలనే లక్ష్యంతోనే డీజీఎఫ్ఐ అలా చేస్తోంది. అయితే ఐఎస్ఐ రంగంలోకి దిగడంతో ఈ రోహింగ్యా మూకలన్నీ కూడా తమ మధ్య ఉన్న గొడవలను పక్కన పెట్టి ఏకం కావాలని నిర్ణయించుకున్నాయి.

ఈ రోహింగ్యా మూకలకు ఉగ్రవాద కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వడం కోసమని ఐఎస్ఐ లష్కరే తోయిబా, జమాతుల్ ముజాహిదీన్ బాంగ్లాదేశ్ ఉగ్రమూకల నుంచి కొందరు ట్రైనర్లను బరిలోకి దించింది. కొన్నేళ్ల క్రితం రోహింగ్యాల్లో పెద్ద ఎత్తున సంక్షోభం చోటు చేసుకున్నప్పుడు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ వారికి బాహటంగా మద్దతు తెలిపాడు. తమలో కలిసిపోయి పోరాటం చేయాలని వారికి పిలుపునిచ్చాడు.



ఇప్పటికే ఈశాన్య ప్రాంతంలోకి రోహింగ్యా ముస్లింలు వెల్లువలా వచ్చిపడుతున్న కారణంగా కొత్తగా జట్టు కట్టిన కూటమికి ఆ ప్రాంతంలో అరాచకాలకు ఒడిగట్టడానికి ఎలాంటి అడ్డూ అదుపూ ఉండదనే ధీమాతో ఐఎస్ఐ ఉంది. ఇక అక్కడ ఏదైనా ఉగ్రదాడి చేయడమే తరువాయి అన్నట్టుగా అది పన్నాగం పన్నుతోంది.

# న్న పాక్, బాంగ్లా



**ముందుంది అరాచకత్వమే**

ముహమ్మద్ యూనుస్ ప్రభుత్వం పాకిస్తానీయులను బాంగ్లాదేశ్‌లోకి ఆహ్వానించడానికి తహతహలాడి పోతోంది. ఐఎస్ఐ అధికారులతో అగ్ర నేతలు ఇటీవల జరిపిన సమావేశం దీనికి నిదర్శనం.

ఈ పరిణామాలన్నీ చూస్తుంటే బాంగ్లాదేశ్ తాలిబన్ల బాట పడుతుందనే నమ్మకం బలపడుతోంది. దీంతో అది మరింత అణగారిన దేశంగా మారిపోతుంది. బాంగ్లాదేశ్ మహిళలకు ఆఫ్ఘనిస్తాన్ మహిళలకు పట్టిన గతే పడుతుంది. ఉదాహరణకు 2024 సంవత్సరంలో అచ్చయిన అమర్ బంగ్లా బోయి పుస్తకంలోని ఓ అధ్యాయంలో అబ్బాయిలు, అమ్మాయిలు ఇంటి పనులను సమంగా పంచుకోవాలని ఉంది. అదే 2025లో అచ్చయిన అదే పుస్తకంలో అదే అధ్యాయం ఇంటి పనులన్నింటినీ అమ్మాయిలే చేయాలని పేర్కొంది.

ఇప్పటికే పెచ్చరిల్లిన చాదస్తపు ఇస్లాంతో పోరాడటానికి అష్టకష్టాలు పడుతున్న బాంగ్లాదేశ్ రొహింగ్యాల రూపంలో మరో తలనొప్పిని తెచ్చిపెట్టుకుంటోంది. కేవలం భారత్‌ను సర్వనాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న యూనుస్, ఆయన అనుచర గణం అందుకోసమని ఐఎస్ఐకు ఎర్ర తివాచీ వేసి మరీ స్వాగతం పలుకుతున్నారు.

బాంగ్లాదేశ్‌కు రానున్న రోజుల్లో ఇస్లాం టెర్రరిస్టులకు తోడు రొహింగ్యాలతో చికాకులు తథ్యమని అనిపిస్తోంది. డిసెంబర్ 25న ఐఎస్ఐ ఆశీస్సులతో జరిగిన నలుగురు సోదరుల కూటమి సమావేశం రొహింగ్యాలకు ఎలాంటి జంకూ గొంకూలేకుండా బాంగ్లాదేశ్ గడ్డ మీద నుంచి ఇష్టానుసారంగా అరాచకాలు చేయడానికి మార్గం సుగమమైందనే ఓ స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది. బాంగ్లాదేశ్ ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడు తోంది. అక్కడ శాంతి తిరిగి నెలకొనే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఐఎస్ఐ ఆడుతున్న ఆటలు బాంగ్లాదేశ్‌ను నామరూపాల్లేకుండా చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

– ఆర్గనైజర్ నుంచి


**రెండంచుల కత్తి**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ అనే నాణేనికి మంచీ చెడూ రెండూ కూడా బొమ్మాబొరుసుల్లా ఉన్నాయి. ఏఐని వినియోగించడంలో భద్రతా ఏజెన్సీలు ఎంతో చురుకుదనాన్ని ప్రదర్శిస్తుండగా, మానవాళికి ముచ్చెమటలు పోసేలా తామేమీ తక్కువ తినలేదన్నట్టుగా టెర్రరిస్టులు సైతం వారి కార్యకలాపాల్లో ఏఐ ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఏఐ ఆగమనంతో యావత్ ప్రపంచం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పటిదాకా మనం వాడుతూ వస్తున్న అన్ని టెక్నాలజీల్లాగానే ఏఐతో ప్రయోజనాలూ ఉన్నాయి, ఇబ్బందులూ ఉన్నాయి. అయితే అది మనం దాన్ని ఎలా వాడుకుంటామనే దానిపైన ఆధారపడి ఉంటుంది. ఏఐ ప్రాముఖ్యతను గుర్తెరిగిన అగ్ర రాజ్యాలు ఏఐ అనుబంధిత అభివృద్ధి కార్యక్రమాల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నాయి.

# మంచీ చెడుల కూడలిలో ఏఐ!

మన వరకు చూస్తే.. ఏఐని వాడుకోవడంలో భారత సైన్యం ముందంజలో ఉంది. జాతీయ భద్రత, రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడం కోసమని ఈ టెక్నాలజీని వినియోగించుకుంటోంది. అయితే అదే సమయంలో ఇస్లామిక్ స్టేట్ లాంటి టెర్రరిస్టు మూకలు సైతం ఈ టెక్నాలజీని అందిపుచ్చుకున్నాయి. గత కొద్ది మాసాలుగా చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు ఈ ముష్కర మూకలు తమ స్వార్థం కోసం ఏఐని ఎలా వాడుకున్నదీ తేటతెల్లం చేశాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే.. రానున్న రోజుల్లో మంచికి చెడుకు మధ్య జరిగే పోరాటానికి ఏఐ ఓ సాక్షిగా మారనుంది. ఇంకా చెప్పాలంటే టెక్నాలజీని వాడుకోవడంలో ఆధిపత్య పోరు ఆకాశాన్నంటుతుంది. ప్రపంచానికి ముప్పు చేయడానికి ఉగ్రమూకలు ఏఐని వాడుతుంటే, ఆ ముప్పును మొగ్గలోనే






సైన్యంలో మానవ వనరులను తగ్గించాలనే మాట వినపడుతున్న సమయంలో అడుగు పెట్టిన ఏఐ అన్ని విషయాల్లోనూ ప్రాభవాన్ని చాటిచెపుతోంది. వామనుడిలా పాదం మోపిన ఈ టెక్నాలజీ అత్యంత బలశాలి ఐన త్రివిక్రముడిలా నేడు అవతరించింది. సైన్యం ఏఐ తోడుగా కొద్దిపాటి మానవవనరులతోటే మరింతగా సాధించగలదు. ఈ టెక్నాలజీ కొండంత భారాన్ని అవలీలగా మోసి అవతల పడేస్తుంది. సైన్యంలో రోజువారీ లక్ష్యాలను చిటికెలో పూర్తి చేస్తోంది. సైన్యం అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో సాయపడుతోంది.

తుంచేయడానికి భారత సైన్యం అత్యంత సమరోత్సాహంతో కొత్త టెక్నాలజీని వినియోగిస్తోంది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించివేయడానికి తన శక్తి సామర్థ్యాలను ఏఐ తోడుగా పెంచుకుంటోంది. టెక్నాలజీ విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతోంది.

సంక్లిష్టమైన ముప్పులను ఎదుర్కోవడంలో టూల్స్ వినియోగిస్తోంది. మన సైన్యం ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ – ఓఎస్ఐఎన్‌టి, బిగ్ డేటా, జనరేటివ్ ఏఐ లాంటి టెక్నాలజీలను వాడుతోంది. ఈ టెక్నాలజీలు సైన్యానికి రియల్ టైమ్ పరిజ్ఞానాన్ని, భవిష్యత్ దర్శనం చేయిస్తాయి. ఇది సరైన నిర్ణయం తీసుకోవడంలో, సకాలంలో స్పందించడంలో, ముప్పును గుర్తించడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. జాతీయ భద్రతను మరింత పటిష్టపరచడంలో ఏఐ ప్రాధాన్యతను భారత సైన్యం గుర్తించింది. భారతీయ బలగాలు ఓ పక్క వాటి సైబర్ భద్రతను మెరుగుపరుచుకుంటూనే మరో పక్క నిఘాను యాంత్రీకరణ చేసుకున్నాయి.

సైన్యంలోకి ఏఐ రాకతో మూడు సమ్మిళిత కమాండ్‌లు కాస్త అత్యంత శక్తిమంతమైన డేటా డ్రైవ్ హబ్‌లుగా అవతరించాయి. ఇది నింగి నేలా నీటిపైన అనుసంధాన కార్యకలాపాలకు సాయపడింది. ఈ ఏకీకరణ మిలటరీ కమాండర్‌లకు రియల్ టైమ్ ప్రతిస్పందనను సమకూర్చడానికి తోడు మంచి సమన్వయం, సత్వరం నిర్ణయాలు తీసుకోవడానికి దారి చూపింది.

సైన్యంలో మానవ వనరులను తగ్గించాలనే మాట వినపడుతున్న సమయంలో అడుగుపెట్టిన ఏఐ అన్ని విషయాల్లోనూ ప్రాభవాన్ని చాటిచెపుతోంది. వామనుడిలా పాదం మోపిన ఈ టెక్నాలజీ అత్యంత బలశాలి అయిన త్రివిక్రముడిలా నేడు అవతరించింది. సైన్యం ఏఐ తోడుగా కొద్దిపాటి మానవ వనరులతోటే మరింతగా సాధించగలదు. ఈ టెక్నాలజీ కొండంత భారాన్ని అవలీలగా మోసి అవతల పడేస్తుంది. సైన్యంలో రోజువారీ లక్ష్యాలను చిటికెలో పూర్తి చేస్తోంది. సైన్యం అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో సాయపడుతోంది. పోరాట సంసిద్ధతను సైతం ఏఐ మెరుగుపరుస్తోంది.

**ఏఐ నాణేనికి మరోవైపు..!**

ఏఐని భద్రతా ఏజెన్సీలు వినియోగించుకోవడం ఓ స్వాగతించాల్సిన పరిణామం. అదే సమయంలో ఏఐ నాణేనికి మరోవైపు ఓ చీకటి కోణం ఉంది. ఈ మధ్యకాలంలో ఉగ్రమూకలు మరీ ముఖ్యంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇస్లామిక్ స్టేట్ కొత్త ఊపిరి పోసుకోవడానికి ఏఐని విపరీతంగా వాడుకుంటోంది. ఈ ఉగ్రమూక ప్రస్తుతానికి ఈ టెక్నాలజీని ప్రచారానికి వినియోగిస్తోంది. తొలి ప్రయోగం అన్నట్టుగా ఇటీవల ఏఐ ఆధారిత వార్తా బులెటిన్‌ను ఇస్లామిక్ స్టేట్ క్రియేట్ చేసింది. ఆ బులెటిన్‌లో ఏఐ ద్వారా క్రియేట్ అయిన న్యూస్ ప్రజెంటర్ ఇస్లామిక్ స్టేట్ మతోన్మాదాన్ని ప్రచారం చేసే వార్తలను చదువుతుంటుంది.

అయితే ఇలాంటి మతోన్మాద ఉగ్రమూకలు ఏఐ వాడటాన్ని కేవలం వాటి ప్రచారంతోనే సరిపెట్టుకోవనేది నిపుణులు అంటున్న మాట. ఇస్లామిక్ స్టేట్ ఇప్పటికే ఈ టెక్నాలజీతో తన ఉగ్ర కార్యకాలాపాలను సాగించడానికి మార్గాలను అన్వేషిస్తోంది. దాని అన్వేషణ ఫలించిన పక్షంలో ఇస్లామిక్ స్టేట్ ఏ భద్రతా ఏజెన్సీలూ, ఏ రకమైన నిఘా ఏజెన్సీలు కనిపెట్టడానికి వీల్లేదని విధంగా దాడులకు పాల్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ట్రాఫిక్ వ్యవస్థ హ్యాకింగ్‌తో ఉగ్రదాడులు**

ఉగ్రమూకలు రిమోట్ కంట్రోల్డ్ వాహనాలతో దాడులు జరపడానికి ఏఐని వాడటానికి ప్రయత్నిస్తున్నాయనే ఇంటెలిజెన్స్ ఏజెన్సీల హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ విషయంలో ఇస్లామిక్ స్టేట్ అత్యంత దారుణంగా ఆలోచిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు ఉద్దేశించిన వ్యవస్థలను హ్యాక్ చేయడానికి దారులు వెతుక్కుంటోంది. దానికే కనుక ఓ దారి దొరికిన పక్షంలో అది జరిపే దాడుల్లో ప్రాణ నష్టం అపారంగా ఉంటుందనే విషయం ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు ఇటీవల తెలిసివచ్చింది.


**ఏఐ చాట్‌బోట్‌లతో మతోన్మాద ప్రచారం**

ఇస్లామిక్ స్టేట్ చేతిలో ఉన్న అత్యంత ప్రమాదకరమైన ఆయుధం మతోన్మాద ప్రచారం. ఈ ఉగ్రమూకకు కీలకమైన ఇరాక్, సిరియాలో నిలువనీడ లేకుండా పోయినప్పుడు అది తన కోసం పనిచేస్తున్న విదేశీ ఉగ్రవాదులను వారి స్వదేశానికి వెళ్లి ఒంటరి తోడేలు తరహాలో దాడులకు పాల్పడాలని ఆదేశించింది. ఇలాంటి దాడులకు పెద్దగా ఖర్చుండదనేది ఉగ్రమూకల భావన. అయితే మతోన్మాద ప్రచారం ఎంత ప్రభావితంగా చేసారనేదానిపై ఈ తోడేలు తరహా దాడులు ఆధారపడి ఉంటాయి. సరిగ్గా ఇక్కడే ఉగ్రమూకలకు ఏఐ ఉపకరిస్తోంది. మతోన్మాద ప్రచార సామాగ్రి ప్రధానంగా అరబిక్ భాషలో ఉంటుంది.

ఏఐ ఆగమనంతో అరబిక్ ప్రచార సామాగ్రిని ప్రపంచంలో వాడుకలో ఉన్న అన్ని భాషల్లోకి అనువదించి కావలసినంత మందికి బ్రాడ్‌కాస్ట్ చేసే అవకాశం ఉంది. ఉగ్రమూకలు కొత్త టెక్నాలజీతో ఆన్‌లైన్ ద్వారా కొత్తవారిని నియమించుకుంటున్నాయి. పథక రచన చేస్తున్నాయి. ఏఐ ఆధారిత చాట్‌బోట్‌ల ద్వారా వ్యక్తులను మతోన్మాదం వైపు ప్రేరేపిస్తున్న వైనం ఇటీవల వెలుగులోకి వచ్చింది.

అయితే మాయలమరాఠీ తరహాలో పూటకో రూపం మార్చుకుంటున్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ సహా ప్రపంచదేశాలు అంతే ధీటుగా క్షణక్షణం వ్యూహాలు మార్చుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం ఏఐ ఊతంగా అంతే సమర్థమంతంగా ముంచుకొస్తున్న ముప్పును తిప్పికొడుతుందని ఆశిద్దాం.

– జాగృతి డెస్క్


SURYA
A journey of brilliance completes
50+
Years
SINCE 1973
Surya Roshni has been a beacon of excellence,
illuminating lives with innovation and quality.
Here's to 50+ years of brilliance, and to many more years of lighting up the future together!
LIGHTING | FANS | APPLIANCES | WATER PUMPS | STEEL PIPES | PVC PIPES
I am SURYA
50+ YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya surya_roshni surya.roshni surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000


# నేరగాళ్ల ర

**భారతదేశంలో ఉగ్రవాదం, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి విదేశాల్లో ఆశ్రయం లభిస్తోంది. ఆ నేరగాళ్లను భారత్‌కు రప్పించేందుకు విదేశాల్లో భారత్ న్యాయ పోరాటం చేస్తోంది. ముంబై ఉగ్రవాది దాడి కేసులో ప్రధాన నిందితుడు తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా సుప్రీం కోర్టు అంగీకరించింది. మన దేశంలో సుమారు రూ.9 వేల కోట్ల వరకు బ్యాంకు రుణాలను ఎగవేసిన విజయ్ మాల్యా, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.14 వేల కోట్ల రుణం ఎగ్గొట్టిన నీరవ్ మోదీ ప్రస్తుతం యూకేలో ఉన్నారు. వారిని భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం సుముఖంగా ఉన్నా, న్యాయస్థానాల్లో సాగుతున్న విచారణ ప్రతిబంధకంగా మారుతోంది. ఈ నిందితులను తీసుకువచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. జీ 20 దేశాల శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో జరిగిన సమావేశంలో ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను భారత్‌కు అప్పగించాలని కోరారు. ఇదే సమయంలో వేలమంది ప్రాణాలు తీసుకుని, భావితరాలను వ్యాధులకు గురి చేసిన ఘటనలో ప్రధాన కారకుడిని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాచమర్యాదలతో అమెరికా పంపింది.**


**26**/11 .. ముంబైలో ఉగ్రవాదుల దాడిలో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది మృతి చెందారు. ఈ ఘటన జరిపింది హిందువులని చెప్పే కుట్ర కూడా జరిగింది. 2008లో జరిగిన ఈ దాడుల్లో లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, ముంబ్కై చాబాద్ హౌస్, నారిమన్ హౌస్, కామా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విచక్షణా రహితంగా దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో కీలక సూత్రధారిగా పాకిస్తాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు తహవూర్ రాణాను గుర్తించారు. దాడి జరిగిన ఏడాది తర్వాత షికాగోలో ఎఫ్‌బీఐ అధికారులు రాణాను అరెస్టు చేశారు. ముంబై దాడులకు పాల్పడిన రాణాను భారత్‌కు తీసుకు వచ్చేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్ని స్తోంది. రాణాను అప్పగించాలన్న భారత ప్రభుత్వ విజ్ఞప్తికి అమెరికా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అమెరికా కోర్టులను అడ్డుపెట్టుకుని రాణా భారత్‌కు రాకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. గత ఏడాది అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. రాణా లాస్‌ఏంజిలస్ జైల్లో ఉన్న తహవూర్ రాణా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను జనవరి 21న అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడంతో, భారత్‌కు తీసుకువచ్చేందుకు మోదీ సర్కార్ చేసిన ప్రయత్నం సఫలం కానుంది.

**రూ.9 వేల కొట్లు ఎగ్గొట్టిన మాల్యా**

విజయ్‌మాల్యా.. ఓ వ్యాపారవేత్త. రాజకీయ నాయకుడు. 2003లో సుబ్రమణ్యస్వామి నేతృత్వంలోని జనతా పార్టీలో చేరారు. 2010 వరకు దాని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. జనతాదళ్ (సెక్యులర్) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మద్దతుతో 2002లో, 2010లో జనతాదళ్ (సెక్యులర్), బీజేపీ మద్దతుతో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రూ.9,000 కోట్ల మేరకు బ్యాంకు రుణం ఎగవేసి విదేశాలకు పారిపోయారు. సీబీఐ ముంబైలోని కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్ ప్రకారం లిక్కర్ కింగ్ విదేశాల్లో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. 2016లో దేశం విడిచి బ్రిటన్‌కు పారిపోయిన మాల్యాను తిరిగి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మాల్యా పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా కోర్టు ప్రకటించింది. బ్యాంకులు, ఇతర రుణదాతలను లిక్విడేట్ చేయడానికి, చెల్లించడానికి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎమ్ఎల్ఎ) కింద అతని ఆస్తులను ఈడీ జప్తు చేసింది. యూకేలో ఉంటున్న మాల్యాను భారత్‌కు రప్పించేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.



తహవూర్ రాణా



భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ

**వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ**

గుజరాత్‌కు చెందిన ప్రసిద్ధ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ. భారతదేశంలో అతి చిన్న వయసులోనే ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.280 కోట్లు మోసం చేశాడని తొలుత కేసు నమోదైంది. తర్వాత 2018లో పంజాబ్ నేషనల్ బ్యాంకుకు నీరవ్ మోదీ సుమారు రూ.14 వేల కోట్ల రుణం ఎగవేసిన వ్యవహారం బయట పడడంతో లండన్‌కు పారిపోయాడు. ఈ వ్యవహారంలో పలువురు అధికారులను బ్యాంక్ యాజమాన్యం సస్పెండ్ చేసింది. నీరవ్ మోదీ తమ దేశంలోనే ఉన్నట్లు 2018లో బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. నీరవ్ మోదీని అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేసింది. 2019లో అక్కడి పోలీసులే అరెస్టు చేశారు. అతడిని భారత్‌కు అప్పజెప్పేందుకు బ్రిటన్ ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపినా న్యాయ స్థానాలను అడ్డుపెట్టుకుని నీరవ్‌మోదీ రాకుండా ఉండేందుకు ఎత్తుగడలు పన్నుతున్నాడు.


# ...క్షణే కాంగ్రెస్ పని

**యూకేలోనే ఆయుధ వ్యాపారి**

ఆయుధాల ఒప్పందంలో ముడుపులు అందుకున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ఇండియా నుంచి పారిపోయి యూకేలో తలదాచుకున్నాడు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కోసం రూ. 2,895 కోట్ల విలువ చేసే 75 పిలాటస్ బేసిక్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలు ఒప్పందంలో అవినీతికి సంబంధించి సంజయ్ భండారీపై 2019లో సీబీఐ కేసు నమోదు



నీరవ్ మోదీ



విజయ్ మాల్యా

చేసింది. ఆఫ్‌సెట్ ఇండియా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్‌లు సంజయ్ భండారీ, బిమల్ సరీన్‌లతో స్విట్జర్లాండ్‌కు చెందిన పిలాటస్ ఎయిర్‌క్రాఫ్ట్ లిమిటెడ్ సంస్థ నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని, 2010 జూన్‌లో భండారీతో మోసపూరితంగా సర్వీస్ ప్రొవైడర్ ఒప్పందం కుదుర్చుకున్నారని సీబీఐ ఆరోపించింది. ఇది డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ ప్రొసీజర్, 2008 కింద ఉల్లంఘన జరిగినట్లు సీబీఐ ఆరోపించింది. సంజయ్ భండారీపై నల్లధనం సహా పలు సెక్షన్ల కింద ఆదాయం పన్ను అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు 2020 జూన్ 1న ఈడీ ఛార్జిషీట్ నమోదు చేసింది. ఆయనను యూకే నుంచి రప్పించేందుకు భారత్ ప్రభుత్వం అక్కడి న్యాయస్థానాల ద్వారా కృషి చేస్తోంది. భండారి ఓ విపక్ష కీలక నాయకుడి బంధువుకు బినామీ అనే ఆరోపణలు ఉన్నాయి.

**డబ్బు వసూలుకు చర్యలు**

ఆర్థిక కుంభకోణాలకు పాల్పడి దేశం వీడి వెళ్లిపోయినా, వారి నుంచి డబ్బు వసూలు చేసేందుకు మోదీ ప్రభుత్వం ఈడీని ప్రయోగించింది. పరారీలో ఉన్న విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీల ఆస్తులను జప్తు చేసింది. దేశం విడిచి పారిపోయిన నీరవ్ మోదీ బ్యాంకులను రూ. 6,498.20 కోట్ల మేర మోసగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు, భారతదేశంలోని నీరవ్ మోదీ, అతని కంపెనీలకు చెందిన రూ. 29.75 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ గుర్తించింది. వీటిలో భూమి, భవనాలు, బ్యాంకు ఖాతా డిపాజిట్లు కూడా ఉన్నట్లు తేలింది. ఈ కేసులో నీరవ్ మోదీపై మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 కింద కూడా కేసు నమోదైంది. గతంలో విచారణ సందర్భంలో నిందితుడితో పాటు అతని సహచరులకు చెందిన రూ. 2,596 కోట్ల విలువైన స్థిరచరాస్తులు జప్తు చేశారు. రూ. 1,052.42 కోట్ల విలువైన ఆస్తులు పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇతర బ్యాంకులకు తిరిగి వచ్చాయి. పరారీలో ఉన్న విజయ్ మాల్యా నుంచి ఇప్పటివరకు రూ. 14,131 కోట్లు రికవరీ అయ్యాయని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రకటించారు. యూకేలో వివిధ న్యాయస్థానాల్లోకూడా నీరవ్‌మోదీని భారత్‌కు అప్పగించాలని తీర్పు వచ్చింది.

**అండర్స్‌కు రాజమర్యాదలతో..**

ప్రపంచంలోనే అత్యంత దారుణ విషాదం భోపాల్ గ్యాస్ దుర్ఘటన. 1984 డిసెంబర్ 2వ తేదీ రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ లీకవడంతో వేలాది మంది మృత్యువాతపడ్డారు. ఆ ఘటన తాలూకు ప్రభావం ఇంకా ఆ ప్రాంత ప్రజలపై ఉంది. కొన్ని తరాల పాటు దానికి స్థానికులు మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

ఇంతటి దారుణానికి కారణమైన విదేశీ కంపెనీ చైర్మన్‌ను నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా పంపించాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నాటి పత్రికల కథనాల ప్రకారం.. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ వచ్చిన కంపెనీ చైర్మన్ వారెన్ ఆండర్సన్‌ను కొన్ని గంటలు గృహనిర్బంధంలో ఉంచారు. తర్వాత దేశం విడిచి వెళ్లాడు. నాటి భోపాల్ కలెక్టర్ మోతీసింగ్, ఎస్పీ స్వరాజ్ పూరీ స్వయంగా అండర్సన్‌ను ప్రత్యేక విమానం ఎక్కించారన్న ఆరోపణలు ఉన్నాయి.

దుర్ఘటన సమయంలో భోపాల్ కలెక్టర్‌గా ఉన్న మోతీ సింగ్ రచించిన 'భోపాల్ గ్యాస్ ట్రాజెడీ కా సచ్'లో 'అర్జున్ సింగ్ ఆదేశాల మేరకు అండర్సన్ విడుదలయ్యాడ'ని పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అర్జున్ సింగ్ తన ఆత్మకథ 'ఏ గ్రెయిన్ ఆఫ్ సాండ్ ఇన్ ది హవర్‌గ్లాస్ ఆఫ్ టైమ్'లో దీనికి సంబంధించి ప్రస్తావించారు. నాటి కేంద్ర హోంమంత్రి పీవీ నరసింహారావు సూచనల మేరకు, నాటి హోం కార్యదర్శి ఒత్తిడి మేరకు ఆ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. అండర్సన్ 2013లో అమెరికాలో మృతి చెందాడు. సుమారు 15 వేల మందిని బలిగొన్న ఘటనలో ఒక విదేశీ కంపెనీకి చెందిన అధినేతను కోర్టు గుమ్మం కూడా ఎక్కించలేకపోవడానికి నాటి పాలకులే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అర్జున్ సింగ్.. ఇద్దరూ కాంగ్రెస్ నాయకులేనన్నది వాస్తవం!

చరిత్ర చెబుతున్న ఈ వాస్తవాల మధ్య.. గోబెల్స్ ప్రచారం సాగిస్తూ, విజయ్‌మాల్యా, నీరవ్ మోదీ పారిపోవడానికి ప్రధాని మోదీ కారణమని నేటికీ కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఆరోపిస్తారు. అండర్సన్‌ను రాచమర్యాదలతో పంపిన వైనం గురించి మాత్రం పెదవి విప్పరు. కానీ, ఈ ఘటనలను ఓసారి పరిశీలిస్తే.. దేశద్రోహులకు అండగా ఉన్నది ఎవరో అర్థమవుతుంది.



**హేమచందర్ కొలిపాక**
సీనియర్ జర్నలిస్ట్, 9440021108



సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం. బెనారస్‌లోని హిందూ యూనివర్సిటీ. 'వసంతపంచమి' శుభసందర్భంలో తొలిగా పుస్తక ఆవిష్కరణ. భారత పర్వ మహోత్సవం, జానపద సంగీతరంగ విస్తృతికి నియమితమైన నిపుణుల సంఘంలో కీలక స్థానం. వీటన్నింటినీ మించి–అయోధ్యలో రామజన్మభూమి మందిర ఆరంభ వేడుకల సందర్భాన, విగ్రహ ఆవిష్కరణ తరుణాన రామనామ సంకీర్తన భాగ్యం. ఈ అన్నింటా మారుమోగిన పేరు 'మాలిని.' భారతీయ సంస్కృతీ సమ్మాన్ విజేత, 'నారీ గౌరవ' బిరుదు స్వీకర్త, రమారమి దశాబ్దం క్రితమే 'పద్మశ్రీ' గ్రహీత. లోకగీత్ (జానపద సంగీతం)కు తాను పెట్టిన ముద్దుపేరు 'జీవధార.' ఈ ఫిబ్రవరి 11న పుట్టినరోజు చేసుకుంటున్న గానరాణి.

# జానపద

ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ ప్రాంతానికి చెందిన మాలినికి తొలి నుంచే ధారణశక్తి అధికంగా ఉంది, నానాటికీ పెరుగుతూ వచ్చింది. లఖ్‌నవూలోని విశ్వవిద్యాలయ చదువులతో అది మరింత పరిణతి చెందింది తను చదివింది భత్‌ఖండే వర్సిటీలో. సంస్కృతికి, సంగీతానికి పెద్దపీట వేసే విద్యాసంస్థ. ప్రత్యేకించి గీత పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఉంటుంది. అక్కడి నుంచే హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో పీజీ చేసి, స్వర్ణపతకం సొంతం చేసుకున్నారు. వందలాది జానపద కథలు, అదే సంఖ్యలో కవితలు కలిగి అతి ప్రాచుర్యం పొందిన భోజ్‌పురి భాషతో ఆమెకు ప్రగాఢ బాంధవ్యం.

సంగీతంతోపాటు చరిత్రపైనా అమిత ఆసక్తి. అందుకే ఆ అంశాలన్నీ లక్నో విశ్వవిద్యాలయంలో చదివారు. అందులోనూ మరో బంగారు పతకంసాధించారు. శాస్త్రీయ సంగీత రంగంలో అగ్రేసరురాలైన గిరిజాదేవిని ఆమె గురుదేవిగా సంభావిస్తారు. లలిత సంగీతంలో తనదైన ముద్రవేసిన ప్రవీణ. ప్రాచీన, ఆధునికతల మేళవింపు ప్రక్రియ వైఖరి ఎంత పరమోన్నతం అంటే 'పద్మవిభూషణ్' అందుకునేంత. అటువంటి మేటి సన్నిధి చదువుకున్నారు మాలిని.

ఏ సంగీతమైనా గురుప్రభావంతో రాణిస్తుందనేది ఆమె నిశ్చితాభిప్రాయం. ఎప్పుడు కచేరి చేసినా గురుప్రార్థన విధిగా ఉంటుంది. ఆ ప్రస్తావనతోనే ప్రతీ సంగీత ప్రసంగమూ కొనసాగుతుంది. 'గురు' పదానికి విశేష అర్థాన్ని ఒక సందర్భంలో విశదీకరించారామె.

గురువు అంటే కేవలం ఉపదేశం చేయడం కోసం కాదు, మార్గనిర్దేశం చేసేవారే గురుపదానికి అర్హులు. ప్రముఖంగా సంగీత రంగంలో గురుస్థానం అనంతం. శాస్త్ర అభ్యాసం చేయాలన్నా, నేర్చుకున్న విద్యను పదిమందికీ బోధించాలన్నా, బోధన సమయాన శిష్యులకు కలిగే సందేహాలను తీర్చి పరిపూర్ణులుగా తీర్చిదిద్దాలన్నా అవన్నీ గురూత్తములకే సుసాధ్యాలు. ఆ రీత్యా తన గురుదేవి తనను అన్ని విధాలా తీర్చిదిద్దారని ఎన్నోసార్లు చెప్పేవారు మాలినీ అవస్థి. అవస్థీ అనేది భర్త పేరులోనిది. ఆయన యూపీ ప్రభుత్వంలో అత్యున్నత హోదాలో పనిచేసినవారు. పూర్తిపేరు అవనీష్‌కుమార్ అవస్థి. విలక్షణతను కోరుకునే ఆ దంపతులు తమ పిల్లలకు పేర్లు పెట్టడంలో కూడా అదే విశిష్టత కనబరిచారు. తనయ అనన్య, తనయుడు అద్వితీయ.

కుటుంబం, నిరంతర అధ్యయనం – ఇవే తనకు సర్వదా స్ఫూర్తిదాయకాలంటారు మాలిని. ప్రోత్సహించే భర్త, ఉత్సాహాన్ని పంచుకునే పిల్లలు తన గాన ప్రస్థానానికి కరదీపికల వంటివారని చెప్తుంటారు.

పుట్టినింటి నేపథ్యాన్ని పరిశీలిస్తే... వైద్యుల కుటుంబం ఆమెది. తండ్రి నిరంతరమూ వైద్యసేవ కొనసాగుతున్నా, శాస్త్రీయ సంగీతాన్ని ఎంతగానో ఇష్టపడేవారు. తల్లి విశేషించి లలిత గీతికలను అభిమానిస్తుండేవారు. నాటి, నేటి మాదిరిగా ప్రాచీన, అర్వాచీన మిశ్రిత వికాసం మాలికలో వెల్లివిరిసిందంటే అదంతా తల్లిదండ్రుల నుంచి లభించిన వర సంపదే.

అలాగే మెట్టినింటికి సంబంధించి – అత్యున్నత అధికార హోదాలో ఉన్నప్పటికీ భర్త ఆలోచనలన్నీ సంగీతంవైపే.కళకు కావాల్సింది ఉత్సాహ వాతావరణమే అని నమ్మి ఆచరించినవారు కాబట్టే, మాలినీ అవస్థి సంగీత జైత్రయాత్ర నిరవధికంగా కొనసాగడం సులభ సాధ్యమైంది.

మరో విశేషం ఏమిటంటే – తండ్రి, భర్త ఉద్యోగబదిలీల రీత్యా పలు ప్రాంతాలను చూసే అవకాశం ఆమెకు లభించడం. అందువల్ల ఏ ప్రదేశంలో ఉన్నా అక్కడి స్థానికతను నిశితంగా పరిశీలించడం, అనువైన విధంగా సంగీత బాణీలు సమకూర్చడం అలవాటుగా మారింది.

సంగీత కచేరీల పరంగా ఆమెకు కొన్ని దృఢ అభిప్రాయాలు ఉన్నాయి. వాటిని అనుసరించే గానపయనం అంతా..

– స్వరం దైవదత్తం. ఎంత పవిత్రంగా వినియోగిస్తే అంత ఉన్నతంగా, ఉత్తమంగా సమాజానికి ఉపకరిస్తుంది.

–అభ్యాసం, సాధన లేకుండా ఏ కళా రాణించలేదు. ప్రముఖంగా సంగీతం అనేది ఒకచోట ఆగేది కాదు. అదొక నిరంతర చైతన్య స్రవంతి.

అలాంటి ప్రవాహ వేగం నిరంతరాయం కొనసాగాలంటే కళాకారులు నిత్యశిక్షణ సాగించాల్సిందే. ప్రయోగాలు చేయాలన్నా, వాటి ఫలితాలను కళాభిమానులకు పంచాలన్నా సంగీత రంగంలోని వారు తప్పనిసరిగా సాధన చేస్తుండవలసిందే. – గొంతెత్తి పాడటమన్నది అందరికీ సాధ్యమయ్యేది కాదు. ఆ గానంలో సంగీత తాత్వికత విరిస్తేనే, శ్రోతల హృదయాలను తాకినట్లవుతుంది. ఈ సౌలభ్యం జానపద గీతికలకు ఎంతో కొంత సమీపంగా ఉంటుంది కాబట్టే, భోజ్‌పురిని ఇంతగా ఆరాధిస్తున్నాను.. అంటుంటారు విదుషీమణి మాలిని.

ఎంత బాగా పాడతారో అంత చక్కగా మాట్లాడతారు. ఏ అంశం గురించిన విశ్లేషణ అయినా దీటుగా సాగిస్తారు. ప్రాంతీయత ఆధారంగా వర్ధిల్లే గీతాలను అన్ని విధాలా ప్రచారానికి తెస్తుంటారామె.

సంస్కృతి, సంస్కృతం. ఈ రెండింటి స్థావరంగా సంపూర్ణానంద విశ్వ విద్యాలయాన్ని శ్లాఘిస్తుంటారు. అక్కడి నుంచే మాలిని గౌరవ డీలిట్ పురస్కారాన్ని స్వీకరించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భారత అధ్యయన కేంద్రం ఏర్పాటైనపుడు ఆ మహోత్సవాల నిర్వహణ వ్యవస్థకు ఆమె కీలకవ్యక్తిగా, శక్తిగా వ్యవహరించారు.



# గాన'మాలిని'

అయిదేళ్ల కిందట కరోనా దేశమంతటినీ ఉక్కిరిబిక్కిరి చేసినపుడు… ఆలంబన, భరోసా కోసం పరితపించిన మనసులు ఎన్నెన్నో. వ్యాధిని నిరోధించాలన్నా, నివారించాలన్నా పరిపూర్తిగా కావలసింది బాధితుల మనో నిబ్బరం. ఆ ధైర్యాన్ని, దిటవుతనాన్ని పెంపొందించడానికి ఆమె సంగీత మంత్రం ప్రయోగించారు. ఒకే ఒక పాటతో ఎంతోమందిలో అంతర్గత విశ్వాసాన్ని పెంచగలిగారు.

*కష్టం వచ్చింది, నష్టం విరుచుకుపడింది*
*నీకు దిక్కుతోచకుండా చేసింది.*
*జీవితాన్నే దుర్భరంగా మార్చేస్తానంటోంది!*
*భయపడతావా, కుంగి కృశిస్తావా*
*'ఏమిటీ పరిస్థితి' అంటూ విలపిస్తూనే ఉంటావా?*
*జీవితం చాలా పెద్దది నేస్తమా!*
*నువ్వు భయపడేంత చిన్నదేమీ కాదు.*
*జీవితం ఎంతో విలువైనది మిత్రమా!*
*నువ్వు భయపడేంత స్థితి ఏదీ అందులో లేదు!*
*వ్యాధులొస్తాయి, బాధలు చుట్టుముట్టేస్తాయి*
*దారీ తెన్నూ కనిపించకుండా చేస్తుంటాయి*
*అంత మాత్రానికే వణుకుతావా, విధి బలీయం అంటావా?*
*లొంగిపోతావా, కుంగుబాటుతో అణగారుతావా?*
*నిన్ను నువ్వు తెలుసుకో, భయమే శత్రువని గ్రహించుకో.*
*వ్యాధికి మందులుంటాయేకానీ–*
*అధైర్యానికి ఏ ఔషధమూ ఎక్కడా ఉండదని గమనించుకో.*
*నీకు నువ్వే వైద్యం; మనోధైర్యమే అన్నిటికీ పరిష్కారం!*

– ఈ భావం నిండిన గీతం అంతటా విస్తరించి, సాక్షాత్తు భారత ప్రధాని నరేంద్రమోదీ దృష్టిని ఆకట్టుకుంది. ఆ రచనను చూసిన ఆయన 'వెన్ను తట్టిన గీతిక. ఇదే కదా ఆశాదీపిక.' అని రీట్వీట్ చేయడం, జాతిలో ఎంతో కొంత సుధీరత నింపగలిగింది ఆ సమయంలో.


శాస్త్రాలు, కళలు సమాజ హితానికి ఉపకరించినప్పుడు ప్రశంసలూ అనుసరిస్తాయి. మాలినిని యూపీ ప్రభుత్వం 'యశోభారతి' అంది. సంగీత నాటక అకాడమీ అవార్డులు ప్రకటించింది. మారిషస్ ప్రభుత్వమైతే విశ్వరంగ భాషా సమ్మాన్‌తో గౌరవించింది. వీటికి తోడు మరెన్నో పురస్కృతుల వరస.

'జానపదాన్ని కాపాడుకుందాం' ఇదే మాలిని నినాదం ఎప్పటికీ.

'నాది ఎంతకీ ఆగని ప్రయాణం. ఆరాటమో, పోరాటమో మాటల్లో చెప్పలేను. రెండున్నర దశాబ్దాలనాడే నా అంతరంగాన్ని వేదికమీద ప్రథమంగా విపులీకరించాను. శాస్త్రీయమా, జానపదమా అని విడిగా మాట్లాడకండని అందరినీ కోరుకుంటున్నా ఇప్పటికీ. రెండూ కీలకమే.

ఏ విధానమైనా జనం నుంచి రావాల్సిందే కదా! జానపదాలు అనేవి ఏదో ఒక భాషకో, ప్రాంతానికో చెందినంత మాత్రాన అవి అక్కడే ఉండిపోవాలని లేదుగా. విస్తరించాలి. వ్యాప్తి చెందాలి. ఏ ప్రాంతీయ భాష అయినా గళరూపాన, వాద్య విధాన ప్రజలందరికీ చెందాలి, అందాలి. ఆ కారణంగానే భోజ్‌పురికి సముచిత స్థానం కలగాలన్నదే నా అభిమతం. యువతరం ఆధునికతను కోరుతోంది. సంప్రదాయాన్ని గౌరవిస్తోంది. వారి గౌరవాన్ని, అభిమానాన్ని కలకాలం నిలపగలిగే ప్రయత్నాలే నావన్నీ. ఇందులో భాగంగానే జానపద సంగీత సంస్థను స్థాపించాను. ఇందులో నా కచేరీ ఏదీ ఉండదు.

కేవలం సూత్రధారినే! పాత్రధారులంతా జానపద కళాకారులే! అదేవిధంగా పిల్లల పాఠ్యాంశంలో ఒకటిగా జానపదమూ ఉండాలని నా కోరిక. నెరవేర్చాలని అనుకోవడం పాలకుల బాధ్యత.' ఏ సంప్రదాయ గీతికను పాడితే ఆ వేషధారణలోనే కనిపించడం మాలినీ అవస్థి మరో ప్రత్యేకత. పాటలు రాయడం, పాడటం, నటించి మెప్పించడంలోనే ఆమెకు ఆనందం. 'నాది చరిత్రాత్మక సంగీతం' అన్నారంటే అర్థం – చరిత్రను సంగీతాన్ని సమరసంగా మేళవించడమే! ★



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# విషం కక్కు

**విదేశాలకు చెందిన పత్రికలు కనీవినీ ఎరుగని రీతిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై, ఎన్డీఏ కూటమికి నేతృత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీపైనా విషం కక్కుతున్నాయి. ప్రత్యక్షంగా మోదీ మీద అన్నట్టుగా అవి తప్పుడు వార్తలు, కథనాలు ప్రచురిస్తున్నప్పటికీ పరోక్షంగా అవి భారతదేశం మీదే దుష్ప్రచారం సాగిస్తున్నాయన్నది కాదనలేని విషయం. స్వదేశీ పత్రికల్లో అధిక భాగం కూడా ఈ విదేశీ పత్రికల ధోరణినే అనుసరిస్తున్నాయని బీజేపీ భావిస్తోంది.**



ప్రధాని నరేంద్రమోదీ నిజానికి గత దశాబ్ద కాలంగా పాశ్చాత్య దేశాలతో సత్సంబంధాలే నెరపుతున్నారు. ఆయన రెండు దఫాల అధికార కాలంలో ఏనాడూ పాశ్చాత్య దేశాలతో వైరానికి గానీ, వైషమ్యాలకు గానీ దిగలేదు. కానీ, ఆయా దేశాల పత్రికలు మాత్రం మొదటి నుంచి మోదీని ఒక శత్రువుగానే చూస్తున్నాయి. వీలు దొరికినప్పుడల్లా నియంత అనో, మతోన్మాది అనో, సంప్రదాయవాది అనో ఆయనను అభివర్ణిస్తూనే ఉన్నాయి. ఆయనను విమర్శించకుండా పాశ్చాత్య పత్రికల్లో వార్త రాని రోజు ఉండడం లేదు. ఆయన గురించి ఆయనకే తెలియని అనేక విషయాలను వ్యాసాల రూపంలో, సంపాదకీయాల రూపంలో రాస్తుంటాయి.


సాధారణంగా నరేంద్ర మోదీ గానీ, ఆయన ప్రభుత్వం గానీ ఈ విమర్శలకు, ఆరోపణలకు స్పందించడం లేదు. దేశీయ పత్రికల్లో తనకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా వార్తలు, వార్తా కథనాలు వచ్చినా ఏ మాత్రం పట్టించుకోని మోదీ పాశ్చాత్య పత్రికలను పట్టించుకుంటారంటే అది నమ్మలేని విషయం. తన పని తాను చేసుకుపోయే ఆయనకు పత్రికల స్పందన కంటే ప్రజల స్పందనే ముఖ్యం. తన నాయకత్వం, ఆధిపత్యంపై ఆయనకు అపారమైన నమ్మకం ఉంది. అయితే, పాశ్చాత్య దేశాల పత్రికలు మొదటి నుంచి పరోక్షంగా ప్రతిపక్షాల పాత్రను పోషిస్తున్నాయనే విషయం ఆయనకు తెలుసు. అమెరికా, ఐరోపా, చైనాలతో పాటు, టర్కీ, పాకిస్తాన్‌లు అడపాదడపా ఆయన మీద దుమ్మెత్తి పోస్తూనే ఉంటాయి.

అంతర్జాతీయంగా 54 ప్రధాన పత్రికలు భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు విదేశాంగ శాఖ గుర్తించింది. దేశం బీజేపీ హయాంలో అభివృద్ధి చెందినా, కాంగ్రెస్ లేదా మరేదైనా పార్టీ హయాంలో అభివృద్ధి చెందినా ఈ పత్రికలు సహించవు. బురద చల్లడమే వాటి లక్ష్యంగా ఉంటుంది. రాజీవ్ గాంధీకి అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారు శామ్ పిట్రోడా లండన్, న్యూయార్క్ నగరాల్లో పర్యటిస్తూ పాశ్చాత్య మీడియాను రెచ్చగొడుతుంటారు. వారికి కావలసిన సమాచారం అందజేస్తుంటారు. పాశ్చాత్య పత్రికల్లో మోదీ వ్యతిరేక వార్తలు రావడానికి ఇతోధికంగా కృషి చేస్తుంటారు.


ఈ మధ్య పిట్రోడా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా తదితర దేశాల్లో మోదీకి వ్యతిరేకంగా వచ్చిన 50కి పైగా వార్తలన్నిటినీ గుదిగుచ్చి, ఒకే వార్తగా మార్చి లండన్ పత్రికల్లో పునఃప్రచురించారు కూడా. ఆ పత్రికల్లో పడిన వార్తలను ఢిల్లీ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో, సోషల్ మీడియాలో మళ్లీ పోస్టు చేశారు. ఆ వార్తలన్నీ మోదీ మీద విషం కక్కడానికి, దేశంలోని ప్రజా స్వామిక సంస్థలను దుయ్యబట్టడానికి ఉపయోగ పడేవే. ది న్యూయార్క్ టైమ్స్, ది గార్డియన్, ది ఎకనామిస్ట్, ఫైనాన్షియల్ టైమ్స్, లాస్ ఏంజిల్స్ టైమ్స్, రాయిటర్స్, లా మాండ్, టైమ్, బ్లూంబర్గ్ తదితర పత్రికలు అవసరం ఉన్నా లేకపోయినా, మోదీకి వ్యతిరేకంగా మొదటి పేజీలో లేదా పతాక శీర్షికలో ఏదో ఒక వార్త రాస్తుంటాయి. భారతదేశం ఆర్థిక, టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య, వైద్య రంగాల్లో సాగిస్తున్న ప్రగతిని ఈ పత్రికలు ఏనాడూ పట్టించు కున్న పాపాన పోలేదు. ప్రతి చిన్న విషయంలోనూ లోపాలు వెతకడమే ఇవి పనిగా పెట్టుకున్నాయి.

**ప్రధాన సూత్రధారులెవరు?**

విచిత్రమేమిటంటే, ఈ పత్రికలన్నీ దాదాపు ఒకే రకమైన వార్తలను, ఒకే కోణంలోని వార్తలను ప్రచురిస్తుంటాయి. వీటికి ఎవరో ఇటువంటి సమాచారం అందిస్తున్నారనే అభిప్రాయం పాఠకులకు తప్పకుండా కలుగుతుంది. మోదీ గురించి రాస్తున్న వ్యతిరేక వార్తలన్నీ ఓటర్లను ప్రభావితం చేయడానికేనన్నది సుస్పష్టం. పిట్రోడాకు సన్నిహితమైన విదేశీ పత్రికలన్నీ మోదీని ఎన్నికల్లో దెబ్బ తీయడానికి, ఆయనను తిరిగి అధికారంలోకి రాకుండా చేయడానికి సంఘటితంగా కృషి చేశాయి. పిట్రోడా ఈ మధ్య 50 విదేశీ పత్రికల పతాక శీర్షికలను గుదిగుచ్చి ఒక వార్తగా ప్రచురించినప్పుడు కొద్ది క్షణాల్లోనే దానికి సుమారు అయిదు లక్షల వీక్షణలు వచ్చాయి. కాంగ్రెస్ అనుకూలవాదులంతా ఈ వార్తను మెచ్చుకుంటూ లైక్‌లు కొట్టగా, పాశ్చాత్య మీడియా వాదనలను కొట్టిపారేస్తూ లేదా విమర్శిస్తూ అనేక సంస్థలు, ప్రముఖుల నుంచి వ్యాఖ్యలు, విమర్శలు బయటికి



# తున్న విదేశీ పత్రికలు




వచ్చాయి.

ఈ వార్తలను చదివినప్పుడు మోదీని, బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని, రాజ్యాంగ సంస్థలను దుర్భాషలాడడమే కాకుండా, అంతర్లీనంగా ఈ పత్రికలు దేశాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని కించ పరచడం, బలహీనపరచడం కూడా ధ్యేయంగా పెట్టుకున్నట్టు అర్థమవుతుంది. ఈ పత్రికల విదేశీ విలేఖరులే కాదు, వాటికి భారత్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న విలేఖరులు కూడా తమ యాజమాన్యాల ఆదేశాల మేరకు హద్దులు మీరి మోదీని అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల వార్తలు రాయడానికి తమకు అవకాశం ఇవ్వడం లేదని, తమకు వీసా మంజూరు చేయడం లేదని ఆరోపిస్తూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ దక్షిణాసియా విభాగం అధికారి అవనీ దియాస్ భారతదేశాన్ని విడిచి వెళ్లిపోయారు. అయితే, ఈ ఆరోపణలు కేవలం దురుద్దేశంతో కూడుకున్నవని భారత ప్రభుత్వం ఖండించింది. ఆ తర్వాత ఓ 30 మంది విదేశీ విలేఖరులు ఒక సంయుక్త ప్రకటన జారీ చేస్తూ, 'విదేశీ విలేఖరులకు వీసాలు, వార్తల సేకరణకు అనుమతులు ఒక పట్టాన మంజూరు కావడం లేదు. భారతదేశ విదేశీ పౌరులనే గుర్తింపును కూడా ఇవ్వడం లేదు. అవనీ దియాస్ కేసుకు ఇందుకు ఒక సరైన ఉదాహరణ. భారతదేశ ప్రజాస్వామ్య విలువలకు తగ్గట్టుగా ఇక్కడ పత్రికా రచనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉంటాయని ఆశించాం' అని వ్యాఖ్యానించారు.

**వ్యతిరేకతకు కారణం?**

వివాదాస్పద వార్తలు రాసినందుకు అంతకు ముందు భారతదేశం ఫ్రాన్స్ జర్నలిస్టు వెనీసా డఫ్నాక్‌కు వీసా తిరస్కరించింది. నిరాధారమైన, వక్రీకరించిన వార్తలు రాస్తున్న పత్రికా రచయితల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించక తప్పడం లేదు. దేశంలోని అనేక పత్రికలు మోదీకి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నప్పటికీ సాధారణంగా వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. అయితే, విదేశీ పత్రికలు దురుద్దేశపూరితంగా మోదీ ప్రభుత్వంపై వార్తలు రాయడాన్ని మాత్రం ప్రభుత్వం సహించలేక పోతోంది. భారతదేశంలో జరిగే ఎన్నికల పట్ల విదేశీ పత్రికలు మితిమీరిన, హద్దులు దాటిన ఆసక్తిని ప్రదర్శించడం కూడా భారతదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో విదేశాలు జోక్యం చేసుకోవడం కిందకే వస్తుంది. ఒకప్పుడు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీపై అమెరికా పత్రికలు ఈ విధంగానే దుష్ప్రచారం చేశాయి. ఆమె వాటిని లెక్క చేయలేదు. అటల్ బిహారి వాజ్‌పేయి హయాంలో భారతదేశం అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించినప్పుడు అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల పత్రికలు భారతదేశాన్ని శాంతి పాలిట విలన్‌గా అభివర్ణిస్తూ వార్తలు రాశాయి. పేదరిక నిర్మూలన మీద ఖర్చు చేయాల్సిన నిధులను భారత్ అణ్వస్త్ర పరీక్షల మీద ఖర్చు చేస్తున్నట్టు కూడా వ్యాఖ్యానించాయి.


భారతదేశం జి.డి.పి.లో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా క్షీణించి పోతున్నట్టు విదేశీ పత్రికలు రాస్తున్నాయి. ఈ పత్రికల్లో వేటి ప్రాధాన్యాలు వాటికి ఉన్నాయి. తమ దేశాల ప్రయోజనాలను కాపాడుకోవడం కూడా ఇందులో భాగమే. చైనా, రష్యా సహా అనేక దేశాల్లో వాటికి మనుగడే లేకపోయినప్పటికీ అవి ఆ దేశాలకు వ్యతిరేకంగా ఒక్క వార్త కూడా రాయవు. 'ఈ పత్రికలు మొదటే ఒక నిర్ణయానికి వస్తాయి. ఆ తర్వాత వార్తలు రాయడం ప్రారంభిస్తాయి' అని బీజేపీ సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

విచిత్రమేమిటంటే, అమెరికా పత్రికల పట్ల ఎంతో అభిమానంగా వ్యవహరించే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను సైతం ఆ దేశ పత్రికలు విడిచిపెట్టలేదు. 'ఈ విదేశీ పత్రికల దగ్గర సరైన సమాచారం లేనందువల్ల మోదీ ప్రభుత్వాన్ని దుయ్యబడుతున్నారనుకుంటే పొరపాటే. ఎన్నికల్లో ఈ పత్రికలు కూడా రాజకీయ పాత్రలు పోషించాలని ఆరాటపడుతున్నాయి" అని జైశంకర్ వ్యాఖ్యానించారు.

**మితిమీరిన దుష్ప్రచారం**

ఈ విదేశీ పత్రికల్లో ఎక్కువ భాగం కనీస మాత్రపు విషయ పరిజ్ఞానం లేకుండా ప్రభుత్వం గురించి రాస్తున్నాయని వాటి వార్తలు చదివిన వారెవరికైనా అర్థమైపోతుంది. వాటి లక్ష్యం భారత దేశం, నరేంద్ర మోదీ. ఒక చాయ్ వాలా దేశ ప్రధాని కావడాన్ని, అంతర్జాతీయంగా ప్రాబల్యం సంపాదించు కోవడాన్ని విదేశీ పత్రికలు జీర్ణించుకోలేక పోతున్నాయని బీజేపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా విదేశీ పత్రికలు ఈ విధంగానే ఆయన మీద అవాకులు చవాకులు రాసేవి. ఫలితంగా అమెరికా ప్రభుత్వం ఆయనకు వీసా తిరస్కరించింది. అప్పటి నుంచి ఆయనకు మీడియా పట్ల తీవ్ర వైముఖ్యం ఏర్పడింది. ప్రధానమంత్రి అయిన తర్వాత ఆయన ఒక్కసారి కూడా విలేఖరులు సమావేశాన్ని ఏర్పాటు చేయక పోవడానికి కూడా ఇదే కారణం.

విదేశీ పర్యటనల్లో కూడా ఆయన తమ వెంట విలేఖరులను తీసుకు వెళ్లడం లేదు. సాధారణంగా ఎన్నికల సమయంలో ఏ నాయకుడైనా మీడియా పట్ల సాదరంగా వ్యవహరిస్తారు. అయితే, దేశ, విదేశీ పత్రికలు తన గురించి ఎంత దుష్ప్రచారం సాగిస్తే అంత మంచిదనే భావనలో మోదీ ఉన్నట్టు కనిపిస్తోంది. విదేశీ పత్రికలు నమ్మదగిన వార్తలను రాయకపోవడమే కాదు, ఒక్క అక్షరం కూడా ముద్రించడానికి పనికి రాని వార్తలను రాస్తున్నా మోదీ పట్టించుకునే ఉద్దేశంలో లేరు.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

## కథ

కబురూ కాకరకాయ లేకుండా గాఢనిద్రలో ఉన్న కూతుర్ని తీసుకొని, రాత్రి పదిగంటలకు తానుండే పల్లెటూరికి వచ్చిన భార్య విస్మయను ఆశ్చర్యంగా చూసాడు అనంత్. అతనితో పాటూ ఉండే వంటమనిషి, రామస్వామి విస్తుపోయి చూస్తున్నాడు.

పాపను బెడ్ రూమ్‌లో పడుకోబెట్టి, తానెందుకు వచ్చిందో చెప్పడం మొదలుపెట్టింది.

“మరో మూడు రోజుల్లో న్యూయార్క్ ప్రయాణం. ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన అవకాశం ఇప్పుడొచ్చింది. అమెరికాలో టాప్ టెన్‌లో ఉండే ఆ హాస్పిటల్లో గైనకాలజిస్ట్‌గా ఉద్యోగం తెచ్చుకోవడం నా జీవితధ్యేయం. ఆ విషయం నీకూ తెలుసు. కానీ పరిస్థితి తల్లకిందులు అయింది. మన ఆద్యకు వీసా రాలేదు. ఎందుకో ఏమిటో తెలియదు. ఆద్యను ఇక్కడ వదిలి వెళ్లక తప్పడం లేదు. ఒక్క ఏడాది పాటూ నీకు ఇబ్బంది” అంది, కాస్త మొహమాటపడుతూ.



“నా కూతురిని నేను చూసుకోవడానికి నాకేం ఇబ్బంది? అన్నాడతను, వెంటనే తన అంగీకారాన్ని తెలుపుతూ.

“ఈ పల్లెటూరిలో ఆద్యకు సరయిన స్కూల్ ఉండదని నాకు తెలుసు. దానికి చదువు నువ్వే చెప్పక తప్పదు. నీకు తెలుసు, దాన్నెలా డిసిప్లిన్‌తో పెంచానో. దానిలో ఏ మార్పూ ఉండకూడదు. అందుకే ఈ ఏడాది పాటూ ఒక టైమ్‌టేబుల్ తయారు చేసి ఉంచాను. అది ఫాలో అయ్యేటట్లు చూస్తే చాలు. నీకు తెలుసుగా? అదొక ‘చైల్డ్ ప్రోడిగి’. ఆ వయసు పిల్లలు చేయలేని పనులెన్నో చేస్తుంది. జీకే గానీ, లెక్కలు గానీ, ఇంగ్లీష్ స్పెల్లింగులుగానీ, సంస్కృత శ్లోకాలు గానీ ... ఇలా అనేక రంగాలలో ఎన్నో రికార్డులు బద్దలుకొట్టింది. ఇప్పుడు ఆ పరంపర కొనసాగాలి. అందుకే దానికి అవసరమయిన పుస్తకాలన్నీ తెచ్చాను. ఎప్పుడెప్పుడు ఆ పోటీలు ఉన్నాయో తెలిపే షీట్స్ తయారుచేసి ఉంచాను. ఆ పోటీలకు ఎలా తయారవ్వాలో దానికి తెలుసు. అది గాడి తప్పకుండా చూసుకుంటే చాలు. ప్రతి పోటీకీ తీసుకువెళ్లడం మర్చిపోకు. ఈ ఊర్లో ఇంటర్ నెట్ సదుపాయం ఎలా ఉందో నాకు తెలియదు. శ్రమ అనుకోకుండా ఆ సదుపాయం ఏర్పాటు చెయ్యి. నీకిలా అదనపు బాధ్యత అప్పజెప్పక, ఇబ్బంది పెట్టక తప్పడం లేదు. ఏమీ అనుకోవు కదూ?” అంటూ అతని చేతులు పట్టుకుంది.

“ఆద్యను ఎలా పెంచావో నాకు తెలుసు. నువ్వు కోరినవన్నీ చేయడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. నువ్వు నిశ్చింతగా వెళ్లిరా” అంటూ అభయం ఇచ్చాడు. దాంతో సంతృప్తి చెందిన విస్మయ తిరుగు ప్రయాణానికి సిద్ధపడింది.

‘‘ఉదయం అయితే నా చిట్టితల్లి నన్ను కదలనీయదు. ఈ రోజంతా దానికి అన్ని విషయాలూ బోధపరుస్తూ, మానసికంగా సిద్ధం చేసినా, బయల్దేరేటప్పుడు చూసిందంటే గొడవపెడుతుంది. అది నేను తట్టుకోలేను. ఇప్పుడే బయల్దేరాలి” అంటూ భర్తని కౌగలించుకొని,

“పాప జాగ్రత్త” అంది తన్నుకొస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ. అచేతనంగా నిలబడిపోయి ఆమెనే చూస్తూ ఉండిపోయాడు అనంత్. వాళ్లిద్దరినీ అలా చూస్తున్న రామస్వామి గుండె చెరువయిపోయింది.

‘బాగా చదువుకున్న వాళ్లు కూడా ఎందుకిలాంటి పిచ్చిపనులు చేస్తారు? చినబాబు గారు ఈమెకు ఏమి తక్కువ చేశారని దూరం చేసుకుంది? బంగారం లాంటి భర్తను, పన్నెండేళ్లు కూడా నిండని బిడ్డను వదిలి, విదేశాలకు వెళ్లి ఏమి సాధిస్తుంది?’ అనుకుంటూ విలవిలలాడాడు. అతను అనంత్ తండ్రి, దాశరథికి నమ్మినబంటు. పేరుకే వంటవాడు గానీ, ఆ ఇంట్లో ఒక మనిషి కిందే లెక్క.

* * *

అనంత్, విస్మయలు మెడిసిన్ చదువుతున్నపుడే ప్రేమలో పడ్డారు. పీజీ కోర్స్ పూర్తయ్యాక, ఇద్దరూ విశాఖపట్నంలోనే ఉద్యోగాలు సంపాదించుకొని, పెళ్లి చేసుకొని స్థిరపడ్డారు.

ఆద్యకి ఎనిమిదేళ్ల వయసప్పుడు, అనంత్ తండ్రి ఆరోగ్యం పాడయింది. కేన్సర్ చివరి దశలో ఉందని, ఆరునెలలకు మించి బతకడని, స్పెషలిస్టులు చెప్పారు. అప్పటికే అనంత్ తల్లి చనిపోవడంతో ఒంటరివాడయిన దాశరథిని దగ్గరుండి చూసుకోవలసిన బాధ్యత అతని మీద పడింది. అవసానదశలో తండ్రి దగ్గర ఉండాలనే ఉద్దేశంతో, సెలవు పెట్టి తమ ఊరికి వెళ్లి ఉందామని భార్యకు చెప్పి, ఒప్పించడానికి ప్రయత్నించాడు అనంత్. కానీ విస్మయ సుతరామూ ఒప్పుకోలేదు. దానికి కారణం ఆద్యే. చాలా తెలివైన పిల్ల. ఏకసంథాగ్రాహి. అందుకే కూతురిని ఒక చైల్డ్ ప్రోడిగీగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకుంది విస్మయ. అటువంటి పిల్లను పల్లెటూరిలో పెంచడం ఆమెకు ఇష్టం లేకపోయింది. అందుకే రాలేనని చెప్పేసింది. ఎడబాటు ఆరునెలలే కాబట్టి, భరించడానికి సిద్ధపడి, విశాఖపట్నంలోనే ఉండిపోయింది.

చేసేదేమీలేక అతనొక్కడే తండ్రి దగ్గరకు వెళ్లి ఉండసాగాడు. అతని తండ్రి ఒక ఆర్ ఎంపీ డాక్టర్. అతని దగ్గరకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడం మొదలుపెట్టాడు అనంత్, ఒక పక్క తండ్రిని చూసుకుంటూనే.

కొడుకు దగ్గరుండడం వల్లనో, అతను చూపే ప్రేమ వల్లనో, దాశరథి జీవితం రెండేళ్లకు పొడిగించింది. ఆ రెండేళ్లలో అనంత్ డాక్టర్‌గా ఆ ఊరి ప్రజలకే గాక, చుట్టుపక్కలున్న పది గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందించి, అందరికీ దైవసమానుడు అయ్యాడు.

* * *

“పదో రోజు కార్యక్రమం కూడా అయిపోయింది. మనం ఎప్పుడు బయల్దేరుతున్నాం?” అని అడిగింది విస్మయ భర్తని. అనంత్ వెంటనే సమాధానం చెప్పకపోయేసరికి ఆమె గుండెల్లో గుబులు రేగింది.

“సమాధానం చెప్పవేమిటి?” రెట్టించి అడిగింది, గాబరాగా.

“మనం ఇక్కడే ఉందాం. ఇక్కడ డాక్టర్ల అవసరం చాలా ఉంది, ఈ ఊరి ప్రజలకే కాదు. చుట్టుపక్కల పది గ్రామాలకు కూడా...” అని చెపుతుండగా అడ్డుపడింది.

“నాకు ముందునుంచి ఈ భయం ఉంది,



**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

# విస్మయం

**కొయిలాడ రామ్మోహన్‌రావు**

నీకిలాంటి ఆలోచన వస్తుందే మోనని. కానీ మా విషయంలో అది ఎలా వీలవుతుంది? నువ్వు చిన్నప్పటినుంచీ ఇక్కడే పుట్టి, పెరిగావు. నువ్వు ఉండగలవు. కానీ నేనూ, ఆద్యా ఈ పల్లెటూరిలో ఎలా ఉండగలమని అనుకుంటున్నావు?” అంది కోపంగా.

“ఎక్కడ అవసరం ఉంటే అక్కడ మన సేవలు అందించడం డాక్టర్లుగా మన కర్తవ్యం. విశాఖపట్నం లాంటి పట్టణాలలో మనలాంటి డాక్టర్లు లెక్కలేనంత మంది ఉంటారు. అక్కడ మనం ఉన్నా లేకపోయినా ఒకటే. కానీ ఇక్కడ మన అవసరం చాలా ఉంది. ఇది మా నాన్నగారి అంతిమ కోరిక. ప్లీజ్ కాదనకు. మన ఆద్య గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు. అది తెలివైనది. దాన్ని తీర్చిదిద్దడానికి నువ్వూ, నేనూ చాలమా? దయచేసి నా మాట విను” అని భార్యను బతిమాలుతున్న అనంత్‌ని చూస్తుంటే, రామస్వామికి చాలా బాధ కలిగింది.

‘చినబాబుది ఎంత గొప్ప మనసు? ఈమె ఎందుకు అర్థం చేసుకోలేక పోతుంది?’ అనుకుంటూ గింజుకున్నాడు.

అనంత్ కోరిక నెరవేరలేదు. విస్మయ కూతుర్ని తీసుకొని వెళ్లిపోయింది. కూతురిని తన దగ్గరే ఉంచాలని అనంత్ పట్టుబట్టలేదు. ఆద్యపై ఆకాశమంత ప్రేమ ఉన్నా గుండె దిటవు చేసుకున్నాడు.

“డాడీ మనతో రారా? అయితే మనమూ ఇక్కడే ఉండిపోదాం” అంటూ ఏడుస్తున్న ఆద్యను చూస్తూ, బొమ్మలా నిలబడిపోయాడే గానీ, ఏ ప్రయత్నమూ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు.

అప్పటి నుంచి నెలకో రెండు నెలలకో ఒకసారి, విశాఖపట్నం వెళ్లి ఒక రోజో, రెండు రోజులో భార్యాపిల్లలతో గడపడం తప్ప, అతనికి ఏ ఆనందమూ మిగలలేదు.

* * *

విస్మయ అమెరికా వెళ్లి, ఏడాది కావస్తుంది. అనంత్, ఆమె కోరినట్లు చాలా పనులు చేసినా, కొంత అసంతృప్తి, అశాంతి మిగిల్చాడామెకు. సరయిన ఇంటర్నెట్ కనెక్షన్ దొరక్కపోవడం వల్ల, కూతురితో వీడియో కాల్లో మాట్లాడలేకపోయింది. మామూలు కాల్ మాట్లాడినపుడు, ఆద్య అప్పటిలాగే ధారాళంగా ఇంగ్లీషులో అదే ఎక్సెంట్‌తో మాట్లాడడం, చదువులో కూడా బాగా రాణించడం గమనించిన విస్మయ సంతృప్తి పడేది. కానీ ఆద్య పోటీలకు వెళ్లడానికి నిరాకరించింది అని తెలియగానే, ఆమె తీవ్ర మనస్తాపానికి గురి అయింది. ఆద్యతో మాట్లాడి ఒప్పించడానికి ఆమె చేసిన ఏ ప్రయత్నమూ ఫలించలేదు. ‘నేను ఆ పోటీలకు వెళ్లాలంటే నాతోపాటూ నువ్వూ ఉండాలి’ అంటూ మొండి కేసింది. చైల్డ్ ప్రోడిగీగా ఎంతో పేరు తెచ్చుకున్న కూతురు ఇలా మొండికేయడం ఆమెను ఎంతో బాధించింది. ఏడాది దాటకముందే కూతురి దగ్గరకు వెళ్లిపోవాలన్న కోరిక బలపడసాగింది. టికెట్ బుక్ చేసుకొని, ఆ తేదీ వచ్చే వరకూ ఆత్రంగా ఎదురుచూడసాగింది.

ఈలోగా ఒకరోజు ఆద్య నుంచి ఒక చిన్న మెయిల్ వచ్చింది, చక్కటి ఇంగ్లీషులో. ఆ మెయిల్‌లో కేవలం రెండే రెండు లైన్లు ఉన్నాయి. ‘తర్వాత పంపే మెయిల్‌లో చాలా విషయాలున్నాయి. కాస్సేపటిలో ఆ మెయిల్ నీకు అందుతుంది’ అన్నది ఆ మెయిల్ సారాంశం. విస్మయ..విస్మయంలో పడింది. కూతురు దగ్గరినుంచి అలాంటి మెయిల్ రావడం ఇదే మొదటి సారి. ‘ఇలా ఊరించి సస్పెన్స్‌లో పడేసిందేమిటి? ఏముంటుంది ఆ మెయిల్లో’



**పెద్దయ్యాక బాగా గుర్తింపు తెచ్చుకోవడానికి నా కృషి నేను చేస్తానని మాట ఇస్తున్నాను. తాత్కాలికమైన కీర్తి కాక, శాశ్వత కీర్తి తెచ్చుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. నా దారిలో నేను వెళ్తాను. ఒక వైపు చక్కగా చదువుకుంటూనే, నాకెంతో ఇష్టమయిన తెలుగులో పాండిత్యం సంపాదిస్తాను. మన ఇతిహాసాలు, గ్రంథాలు చదివి, మన చరిత్ర, సంస్కృతి, అలనాటి ఆచార వ్యవహారాలు, పద్ధతుల గురించి తెలుసుకుంటాను.**

అనుకుంటూ సస్పెన్స్ భరించకుండా ఉంది. అరగంట తర్వాత ఆద్య నుంచి వచ్చిన మెయిల్ చూసిన విస్మయకు మతిపోయింది. చక్కని దస్తూరీతో, తెలుగులో కాగితం మీద రాసిన ఉత్తరాన్ని స్కాన్ చేసి పంపింది, ఆద్య. ఆ చేతిరాత ఆద్యదే అయినప్పటికీ, విస్మయకు అంతా అయోమయంగా ఉంది. ఆద్యకు తెలుగు మాట్లాడడమే తప్ప, చదవడం, రాయడం రాదు. ఇంత చక్కటి తెలుగులో పెద్ద ఉత్తరం రాయడం ఆమెకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎప్పుడూ మమ్మీ అని పిలిచే అలవాటు ఉన్న ఆద్య, ఉత్తరంలో 'అమ్మా' అని సంబోధించడం ఆమెకు చాలా ఆశ్చర్యం అనిపించింది.

అమ్మా...

నువ్వు ఒక్కర్తివే నా బాధ్యత భుజాన వేసుకుని నన్ను అన్ని విధాలుగా తీర్చిదిద్దడం చాలా గొప్ప విషయమే అయినప్పటికీ నాలో ఏదో అసంతృప్తి ఉండేది. దానికి కారణమేమిటో నాకు తెలిసేది కాదు. నేను ఎలా పెరగాలి? ఏమి చదవాలి? ఇలాంటివన్నీ నా ప్రమేయం లేకుండా నువ్వే నిర్ణయాలు తీసుకునే దానివి. అదే ప్రపంచం అనుకునే నేను, గుడ్డిగా నువ్వు చెప్పినట్లు చేసేదాన్ని. కానీ అక్కడ ఏమి కోల్పోయానో ఇక్కడికి వచ్చిన తర్వాత తెలిసింది.

నా అనుభవాలు ముందుగా చెపుతాను. అవి చదివితే, నా మనసు నీకే తెలుస్తుంది.

రామస్వామి తాత రోజూ, రాత్రి పడుకోబోయే ముందు నాకు మహాభారతం, రామాయణం, భాగవతంలోని ఏదో ఒక కథ చెపుతూ ఉండేవాడు. అవన్నీ నాకు బాగా నచ్చేవి. ఆ ఇతిహాసాల గురించి ఇంకా ఇంకా తెలుసుకోవాలని తహతహలాడే దాన్ని. తాత చెప్పినవాటితో సరిపెట్టుకోలేకపోయేదాన్ని. ఆ గ్రంథాలు నేనే చదవాలని అనుకునేదాన్ని. కానీ ఎలా? నాకు తెలుగు అస్సలు రాదు కదా? అందుకే తెలుగు నేర్చుకోవాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. మరి దానికి సమయం ఎలా కేటాయించాలి? నువ్వు చెప్పిన పోటీలు వదిలేస్తే, బోలెడంత సమయం కలిసివస్తుంది. కానీ నీకు కోపం వస్తుందన్న విషయం తెలుసు. అయినా ఆ నిర్ణయాన్నే తీసుకున్నాను. ఎందుకంటే, బాలమేధావిగా గుర్తింపు తెచ్చుకోవడం నాకు ముందునుంచీ ఇష్టం లేదు. అవన్నీ కంఠంతా పెట్టి, గుర్తుంచుకొని వల్లెవేయడం నాకెందుకో ఇష్టం ఉండేది కాదు. దాని వల్ల నా ప్రియమైన బాల్యాన్ని కోల్పోతున్నానని నాకు అనిపించేది. కానీ నీకు ఎదురు చెప్పే ధైర్యం ఉండేది కాదు. ఈ మధ్య గణితమేధావి శకుంతలా దేవి ఆత్మకథ చదివినపుడు ఆమె కూడా తన బంగారు బాల్యాన్ని కోల్పోయినందుకు ఎంత బాధపడ్డారో చెప్పారు.

మరొక్క మాట...ఏమీ అనుకోవు కదూ? ఈ బాల మేధావులెవరూ ప్రపంచం గర్వించదగిన స్థితికి చేరుకోలేదు.వాళ్ల మేధస్సుకు అప్పుడే ఫుల్‌స్టాప్ పడిపోయింది. ఎందుకూ పనికిరారు అనుకున్న ఐన్‌స్టీన్, రామానుజం వంటి వారు గొప్ప మేధావులుగా గుర్తింపుపొందారు. అంతేకాదు ప్రపంచంలోని మేధావులెవరూ బాల మేధావులు కాదు. మరి నన్నెందుకు అలా తయారుచేయాలని ఆశ పడ్డావో నాకు ఇప్పటికీ అర్థం కాదు. పెద్దయ్యాక బాగా గుర్తింపు తెచ్చుకోవడానికి నా కృషి నేను చేస్తానని మాట ఇస్తున్నాను. తాత్కాలికమైన కీర్తి కాక, శాశ్వత కీర్తి తెచ్చుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. నా దారిలో నేను వెళ్తాను. ఒక వైపు చక్కగా చదువుకుంటూనే, నాకెంతో ఇష్టమయిన తెలుగులో పాండిత్యం సంపాదిస్తాను. మన ఇతిహాసాలు, గ్రంథాలు చదివి, మన చరిత్ర, సంస్కృతి, అలనాటి ఆచార వ్యవహారాలు, పద్ధతుల గురించి తెలుసుకుంటాను. నవయుగ వైతాళికులు విశ్వనాథ, కందుకూరి, చిలకమర్తి, గురజాడ, టంగుటూరి మొదలయిన మహామహుల గురించి తెలుసుకుంటాను.

బర్గర్లు, పిజ్జాలు, ఫాస్ట్ ఫుడ్‌లు తిని బొద్దుగా అయిన నేను, ఇక్కడ చక్కగా మన ఆంధ్రా వంటలు, తింటూ, భరతనాట్యం నేర్చుకుంటూ సన్నబడి, నాజూకుగా తయారయ్యాను. వాట్సప్‌లో నా లేటెస్ట్ ఫొటోలు పెడతాను. అన్నట్టు చెప్పడం మరిచాను. నాకిప్పుడు బోయ్‌కట్ బదులు అందమైన జడ అల్లుకునేంత జుట్టు పెరిగింది. ఇప్పుడు చక్కగా బొట్టు పెట్టుకొని, లంగా, జాకెట్ వేసుకుంటూ చక్కని తెలుగింటి ఆడపడుచులా ఉన్నాను. చెవులకు జూకాలు, పండగ రోజుల్లో నేను ధరించే నగలు, జడ గంటలు చూస్తే నువ్వు ఆశ్చర్యపోతావు. నాన్నకు ఇష్టమైన వెండి పట్టీలు పెట్టుకొని అటూఇటూ తిరుగుతుంటే వాటి మువ్వల శబ్దం వింటూ నాన్న ఎంత మైమరిచిపోతారో చెప్తే నీకు విస్మయం కలుగుతుంది. మరోమాట, మనింట్లోలాగ ఇక్కడ మేము ఇంగ్లీషులో మాట్లాడుకోము. నాన్నతో కూడా తెలుగులోనే మాట్లాడతాను. ఇకపైన మీ ఇద్దరినీ అమ్మా, నాన్నా అనే పిలుస్తాను. ఆ పిలుపులోని మాధుర్యం నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. అలా అని ఇంగ్లీషుని వదిలేస్తానని అనుకోవద్దు. నా భవిష్యత్తుకి అదెంత ముఖ్యమో తెలుసు కాబట్టి, దానిలో కూడా ప్రావీణ్యత సాధిస్తాను.

చివరగా ఒక్కమాట. ఈ ఊర్లో తాతయ్యకు, నాన్నకు ఎంతో మంచి పేరు ఉంది. ఈ ఊరే కాదు, చుట్టుపక్కల ఉన్న ఏ గ్రామానికి వెళ్లినా, నాన్న నా పక్కన ఉన్నా లేకపోయినా అక్కడి ప్రజలు చూపే ఆదరణ, ప్రేమ మాటల్లో వర్ణించేది కాదు. అలాంటప్పుడు, విశాఖపట్నంలో నేను గడిపిన జీవితం ఎంత నిస్సారమయినదో నాకు అర్థమవుతూ ఉండేది.

వీలున్నంతకాలం ఇక్కడే ఉండిపోవాలని నాకు అనిపిస్తుంది. కానీ ఏం లాభం? నువ్వు రాగానే నీ వెనుక బయల్దేరాల్సిందే కదా? కొంతకాలం అయిన తర్వాత, ఎలాగూ పైచదువులకు పట్టణాలకు వెళ్లాలి. ఓ రెండేళ్లయినా ఇక్కడే ఉంటే ఎంత బాగుంటుంది? అనిపిస్తూ ఉంటుంది. కానీ అది సాధ్యమయ్యే పనేనా?

ఇట్లు
నీ ముద్దుల కూతురు ఆద్య

చదవడం పూర్తి కాగానే, వాట్సప్‌లో ఆద్య పంపిన ఫొటోలు చూసింది. తను చెప్పినట్లే, ఎంతో నాజూకుగా తెలుగింటి ఆడపడుచులా ఉన్న కూతురు ఫొటోలు చూసి మురిసిపోయింది. కూతురిలో వచ్చిన ఈ మార్పుని మనసు ఒక పక్క హర్షించక పోయినా, మరోపక్క అటువైపే మొగ్గు చూపుతున్నట్లు ఆమెకు అర్థమవుతోంది.

'ఆద్య, అనంత్ కలిసిపోయారన్న మాట. నేనే పరాయిదాన్ని అయిపోయి, ఈ ఒడ్డున ఉండిపోయానా?' అనుకుంటూ గింజుకున్నా, ఆమెలో జ్ఞానోదయం మొలకెత్తడం మొదలయింది.

'ఆద్య మాటల్లో నిజముంది కదా? తను చెప్పినవన్నీ వాస్తవాలే కదా? నేనెందుకు మొండిగా ఉండాలి?

ఆ తండ్రీకూతుళ్లను ఎందుకు విడదీయాలి. నేను కూడా వాళ్లతో కలసి, అక్కడే ఉంటే నష్టం ఏమిటి? అనంత్ కోరినట్లు నా వైద్యసేవలు అక్కడే అందిస్తే, నా జన్మ సార్థకం అయినట్లే కదా?' అనుకుంటూ ఆ దిశగా ఆలోచిస్తూ ఉండిపోయింది. ★



# జపాన్ మైనారిటీల శ్మశాన రగడ

ఇంగ్లండ్ ముస్లింలు మెజారిటీగా ఉండే దేశంగా మారిపోవడానికి సుదీర్ఘకాలం అవసరం లేదని అమెరికా ఇప్పటికే హెచ్చరించింది. ఫ్రాన్స్, ఇటలీ ఇంకొన్ని ఐరోపా దేశాలు ముస్లిం జనాభాతో సతమవుతున్నాయి. ఇటలీ ప్రధాని మెలోనీ తాను అధికారంలోకి వచ్చిన తరువాత అసలు మసీదుల నిర్మాణమే నిలిపివేయించారు. రాజ్యాంగానికి లోబడి ఉందని మౌల్వీలను ఓడ ఎక్కించేశారు. కానీ భారత్, బ్రిటన్ తదితర దేశాల ఉదారవాదుల మాదిరిగానే జపాన్ ఉదారవాదులకి కూడా జ్ఞానోదయం కావడం లేదు. బ్రిటన్ ముస్లిం మెజారిటీ దేశంగా మారడాన్ని ప్రపంచం వేరే విధంగా చూస్తున్నది. బ్రిటన్ వంటి అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశం ముస్లింల చేతికి వెళ్లడం అంటే, అణుశక్తి సామర్థ్యం ఉన్న దేశం ముస్లిం మతోన్మాదుల చేతికి వెళ్లడమేనని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక జపాన్– ఒకప్పుడు అణుబాంబుతో సర్వనాశనం అయిన దేశం. ఇప్పుడు ముస్లిం సమస్య ద్వారా మరొకసారి అంతే తీవ్రమైన వినాశనాన్ని ఎదుర్కొం టున్నది.

జపాన్ ఒక కీలక సమస్యను ఎదుర్కొంటున్నది. ఐరోపా దేశంలో సామాజిక సమస్యలు, మతోన్మాద సమస్యలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఇదంతా ఒక వర్గంతోనే కావడం విశేషం. వారే ముస్లింలు. మైనారిటీలుగా ఉన్నప్పటికీ మతాచారాల పట్ల, జీవన విధానం పట్ల మెజారిటీలను శాసించాలన్న ఒక విధానమే ఇందుకు కారణం. జపాన్‌లో ప్రస్తుతం ముస్లింలు ఎదుర్కొంటున్నది ఈ కోణంలోనిదే. ఆ ఆసియా దేశంలో ప్రస్తుతం ముస్లిం జనాభా శరవేగంగా పెరిగిపోతున్నది. దీనితో మృతదేహాలకు అంతిమ సంస్కారం విషయంలో జపాన్ సమాజంతో సంఘర్షణ కూడా పెరిగింది. ముస్లింల మతాచారాన్ని జపాన్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

తమ వర్గంలో మరణించిన వారికి ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేయడం ప్రాథమిక హక్కు అంటున్నది అక్కడి ఆ వర్గం. అయితే వారి ఆచారాలను అనుమతిస్తే అది ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని జపాన్ వారి వాదన. ముస్లిం ఆచారాల ప్రకారం అంత్యక్రియలకు ప్రత్యేక మైన స్థలం ఉండాలి. అది కేవలం వారికే పరిమితం. అలాంటి స్థలాలు, అంటే ఖబరస్తాన్‌ల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నమే ఇప్పుడు అక్కడ సాంఘిక సమస్యగా పరిణమించింది. ప్రభుత్వం ఇందుకు సుముఖంగా ఉన్నా జపాన్ సమాజం పూర్తి వ్యతిరేకంగా ఉంది.

క్యెయూష్ ద్వీపంలోని హిజీ పట్టణంలో తమ వర్గానికి ఒక శ్మశానవాటిక మంజూరైందని అక్కడి బెప్పు ముస్లిం సంఘం భావించింది. అందుకు అనువైన పరిస్థితులు కూడా కనిపించాయి. అంటే ప్రభుత్వాలు సరేనన్నాయన్న మాట. కానీ స్థానికుల ప్రతిఘటన, సామాజిక మాధ్యమాలలో వచ్చిన వార్తల వల్ల అది అటకెక్కింది. మియాగి ప్రాంత గవర్నర్ యోషిహిరో మురాయి ముస్లింల సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశాడు. మన దేశంలో సెక్యులరిస్టులు, ఉదారవాదుల వంటి వాడే యోషిహిరో. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్య పట్ల ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాల్సి ఉందని ప్రకటించాడు. దేశంలో బహుళ సంస్కృతిని రక్షించుకోవాలని హితవు పలికాడు. ఈశాన్య జపాన్ ప్రాంతంలో తొహొకులో ఉండే ముస్లింలు తనను ఈ సమస్య పరిష్కరించ వలసిందిగా తనను కోరారని,'తాను ఎన్ని విమర్శలకు గురైనా, ఎవరు ఏం విమర్శించినా ముస్లిం సోదరుల సమస్యను పరిష్కరించడానికి' తాను శతథా ప్రయత్నిస్తానని ఆ గవర్నర్ సెలవిచ్చాడు.

జపాన్‌లో ఇటీవల మారిన జనాభా సమీకరణలను ఒకసారి చూడాలి. 2010లో జపాన్‌లో ముస్లిం జనాభా 1,10,000. ఒక పుష్కరానికల్లా అంటే 2023కి ఆ జనాభా 3,50,000కి చేరుకుంది. ఇటీవలి కాలంలో విదేశీయులకి జపాన్ కల్పిస్తున్న అనేక సౌకర్యాలే ఇందుకు కారణం. ఆ పెరిగిన జనాభాకు తగ్గట్టే మసీదులు కూడా పెరిగాయి. 1980లో నాలుగు మసీదులు జపాన్‌లో ఉండేవి. 2024 సంవత్సరానికి అవి 149 కి పెరిగాయి. కానీ జనాభాకు తగ్గట్టు స్మశాన వాటికలు పెరగలేదు. కేవలం 10 నగరాలలోనే ముస్లింలకు ప్రత్యేక స్మశానవాటికలు ఉన్నాయి. తమకు స్మశానవాటికలు లేకుండా చేయడంలో సామాజిక మాధ్యమాలు ప్రధాన పాత్ర అని బెప్పు ముస్లిం సంఘం నాయకుడు మహమ్మద్ తాహిర్ అబ్బాస్ ఆరోపిస్తున్నాడు. ప్రజారోగ్యం గురించి, స్థానిక సంప్రదాయల గురించి అపోహలు సృష్టిస్తున్నారని అతడు చెబుతున్నాడు. ఎవరు ఏమనుకున్నా, ముస్లింలకు స్మశాన వాటికలు సాధించి తీరుతామని, మతాచారానికి అనుగుణంగా అంత్యక్రియలు జరిపించుకోవడం తమ హక్కు అని అతడు అంటున్నాడు.

– జాగృతి డెస్క్




# ఎస్ఎఫ్ఐ నుంచి సన్యాసానికి..!

కేరళలో సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం భారత విద్యార్థి సమాఖ్య – ఎస్ఎఫ్ఐ కార్యకర్త స్థాయి నుంచి జునా అఖాడాలో మహామండలేశ్వర్ దాకా స్వామి ఆనందవనం భారతీ సాగించిన ఆధ్యాత్మిక యాత్ర ఆద్యంతం ఆసక్తికరమైంది. ఆది శంకరాచార్య జన్మించిన గడ్డ నుంచి సనాతన ధర్మాన్ని ఊతంగా చేసుకొని వచ్చిన స్వామి ఆనందవనం భారతికి జనవరి 26న ప్రయాగ్‌రాజ్‌లో మహామండలేశ్వర్ హోదాను జునా అఖాడా అధిపతి స్వామి అవధేషానంద్ గిరి అప్పగించారు. సాక్షాత్తూ ఆది శంకరాచార్యులవారే ఉత్తర భారతదేశంలో హిందూ ధర్మాన్ని కాపాడటం కోసం యోధులైన సాధువులకు శిక్షణ కోసమని అఖాడా వ్యవస్థను నెలకొల్పారని తెలుస్తోంది.

ప్రస్తుతం ప్రతిదాన్నీ తాను ఆమోదిస్తున్నట్టు, అన్నింటినీ సమానంగా చూస్తున్నట్టు మహామండలేశ్వర్‌గా అవతరించిన స్వామి ఆనందవనం తెలిపారు. గతంలో ఇలా ఉండటం తనకు సాధ్యమయ్యేది కాదని అన్నారు. స్వామి ఆనందవనం అసలు పేరు పీ సలీల్. కేరళలోని త్రిశూర్ జిల్లా, చలకుడిలో జన్మించారు. తండ్రి మాధవన్ మదుర్ కోట్స్ కంపెనీలో ఉద్యోగి. తల్లి ఆనందవల్లి టీచర్. త్రిశూర్‌లో శ్రీ కేరళ వర్మ కాలేజీలో డిగ్రీ, పీజీ విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శిగా, ప్రాంత అధ్యక్షుడుగా, ఆ తర్వాత జిల్లా ఆఫీస్ బేరర్‌గా, జిల్లా ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.

అప్పట్లో తనపై ఉన్న పోలీసు కేసుల నుంచి




# ప్రయాగరాజ్‌లో అమిత్ షా పవిత్ర స్నానం

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా కుంభమేళాను పురస్కరించుకొని ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద జనవరి 27 న పవిత్ర స్నానమాచరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడకు చేరుకున్న కేంద్ర మంత్రి ఆచమనం చేశారు. సూర్య భగవానునికి అర్ఘ్యమిచ్చారు. పవిత్ర నదీ జలాలకు హారతి ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తోడురాగా అమిత్ షా పవిత్ర స్నానమాచరించారు. అనంతరం జునాపీఠాధీశ్వర్ మహామండలేశ్వర్ ఆచార్య అవధేశానంద్ గిరిజీ సూచన మేరకు ఇతర పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కేంద్ర హోమ్ మంత్రితో పాటుగా ఆయన సతీమణి సోనాల్, కుమారుడు, ఐసీసీ చైర్మన్ జే షా, కోడలు రిషిత, మనుమలు, యోగా గురువు రామ్‌దేవ్, తదితరులు ఆయనతో పాటుగా ఉన్నారు. జే షా, రిషితా దంపతుల నవజాతశిశువును సాధువులు ఆశీర్వదించారు.

నీటిపై తేలాడే జెట్టీలో ఓ కాటేజీలో అవధేశానంద్ గిరిజీ మహారాజ్‌తో అమిత్ షా సమావేశమయ్యారు. అంతకుమునుపు ఎక్స్ వేదికగా కేంద్ర హోమ్ మంత్రి కుంభమేళాపై ఓ సందేశం ఇచ్చారు. జీవ నదిలా ప్రవహించే సనాతన సంస్కృతికి మహాకుంభమేళాను ఓ వైవిధ్యమైన చిహ్నంగా పేర్కొన్నారు. సామరస్యపు మూలాలతో కూడిన సనాతన ధర్మపు జీవన విధానాన్ని కుంభమేళా ప్రతిబింబిస్తోందని తెలిపారు. పవిత్ర నగరమైన ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమం వద్ద స్నానమాచరించి, సాధువుల ఆశీస్సులను అందుకోవడానికి తాను ఎదురు చూస్తున్నట్టు కేంద్ర హోమ్ మంత్రి చెప్పారు. ★

# అమ్మ కోసం అపర

92 ఏళ్ల అమ్మతో కుంభమేళాలో స్నానం చేయించడానికని ఓ 65 ఏళ్ల వ్యక్తి చేసిన పని పట్ల అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నెటిజన్లు ఆయన్ను కలియుగ శ్రవణ కుమారుడు, వీరమాతకు వీరపుత్రుడు అని కొనియాడుతున్నారు. ప్రతి మాతృమూర్తీ కూడా ఇలాంటి ఒక పుత్రుడు కావాలని అనుకుంటుంది అని కామెంట్ చేశారు. మరొకరైతే ఏకంగా ఇలాంటి వారే కదా ఈ కాలపు నిజమైన సాధువులు అని వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో



బైటపడటానికి, ముందస్తు బెయిల్ పొందడానికి కొన్నాళ్లు సొంత ఊరికి దూరంగా ఉండాల్సి వచ్చిందని స్వామి ఆనందవనం తెలిపారు. దాంతో 2001లో తొలిసారిగా తాను కుంభమేళాను చూడ్డానికి వచ్చినట్టు చెప్పారు. కుంభమేళా తనకు ఓ అనూహ్యమైన అనుభూతిని ప్రసాదించిందని తెలిపారు. ఆరు రోజుల పాటు పవిత్ర గంగానది తీరాన బస చేసినట్టు చెప్పారు. రెండు మూటల గడ్డిని పరుపుగా చేసుకొని రాత్రిపూట దానిపైన నిదురించేవాడినని తెలిపారు.

దోమ కాటు నుంచి తప్పించుకోవడానికి ఆవు పేడతో చేసిన పిడకలను వాడినట్టు చెప్పారు. అయితే ఆ సమయంలో చర్యలు అటు సీపీఎంలో కానీ ఇటు ఎస్ఎఫ్ఐలో కానీ ఎలాంటి వివాదానికి దారి తీయలేదని తెలిపారు. చదువైపోయిన తర్వాత మలయాళ దినపత్రికలో జర్నలిస్టుగా ఆయన చేరారు. ఆ సమయంలోనే స్వామి ఆనందవనం హరిద్వార్, వారణాసి, రిషీకేష్, హిమాలయాల్లో కొన్ని ప్రాంతాలను తరచుగా సందర్శిస్తుండేవారు. ఆ సమయంలో ఆశ్రమాల్లో బస చేస్తుండేవారు. క్రమంగా ఆధ్యాత్మికంపై ఆసక్తిని పెంచుకున్నారు. ఆధ్యాత్మికం గురించి పుస్తకాల్లో చదివి తెలుసుకున్న దాని కన్నా మరింత ఎక్కువ తెలుసు కోవాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మికతను వివేచనా శక్తి కలిగినదిగా స్వామి ఆనందవనం తెలిపారు. ఎప్పుడైతే మనం విషయాలను సకారణంగా, సహేతుకంగా అర్థం చేసుకోగలుగుతామో దానినే మనం ఆధ్మాత్మికత అని పిలుస్తామని అన్నారు.

సరిచేసి రక్షించేది శస్త్రమౌతుంది. ఆశ్రమంలో పత్రిక కోసం సందీపానంద గిరితో కలిసి పనిచేసినట్టు తెలిపారు. తద్వారా తన ఆధ్యాత్మిక యాత్ర మరింత పురోగతిని సాధించిందని చెప్పారు. ఈ దిశగా తన ప్రయాణాన్ని విరమించుకోవాలంటూ తన పాత కామ్రేడ్ల నుంచి కానీ, కుటుంబ సభ్యుల నుంచి కానీ ఎలాంటి ఒత్తిడి రాలేదని తెలిపారు. జర్నలిస్టుగా పనిచేస్తున్నప్పుడు ఆయన కొంత కాలం గృహస్థాశ్రమంలో కూడా ఉన్నారు. బాల్యం, కౌమారం, గృహస్థు, వానప్రస్థం ఇలా ఒకరు జీవితంలో ఏ ఆశ్రమంలో ఉన్నప్పటికీ సాధువుగా మారవచ్చు. దానికి ఎలాంటి నిషేధం లేదని ఆయన చెప్పారు.

2013 కుంభమేళా సందర్భంగా ఆయన జునా అఖాడాకు చాలా దగ్గరయ్యారు. అప్పుడు ఆయనకు ఓ సాధువు మార్గదర్శనం చేశారు. ఆ సమయంలో తాను కఠోరమైన శిక్షణకు, సాధనలకు గురైనట్టు స్వామి ఆనందవనం తెలిపారు. అందులో భాగంగా హిమాలయ మంచు పర్వతాలపై సుదీర్ఘ కాలం పాటు నిలబడాలని తనను ఆదేశించేవారని చెప్పారు. అలాగే నదీనదాలు, అడవులను దాటుకుంటూ యావత్ భారతదేశంలో తీర్థయాత్ర చేసినట్టు తెలిపారు. 2018లో దాదాపు నాలుగు లక్షల మంది సభ్యులతో కూడిన జునా అఖాడా నుంచి నాగా సాధువు దీక్షను తాను పొందినట్టు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, అందర్నీ తరతమ భేదం లేకుండా సమదృష్టితో చూస్తామని స్వామి ఆనందవనం చెప్పారు. ఆయన మహామండలేశ్వర్ హోదాలో కేరళలోని కొట్టరక్కరలో అవధూత ఆశ్రమం నుంచి విధుల నిర్వర్తిస్తారు. ★

# శ్రవణకుమారుడు..!

చక్కర్లు కొడుతోంది. 65 ఏళ్ల సుదేష్ ముజఫ్ఫర్ నగర్ వాస్తవ్యులు. ఆయన మాతృమూర్తి 92 ఏళ్ల జగ్‌బిరి దేవి. ఆమెకు ఎప్పట్నుంచో కుంభమేళాకు వెళ్లాలని, అక్కడ పవిత్రమైన నదీ జలాల్లో స్నానం చేయాలనే ఉండేది. అమ్మ చిరకాల కోరికను కనిపెట్టారు సుదేష్. ఐతే ప్రస్తుతం ఆమె బస్సుల్లో, రైల్లో, కార్లో ప్రయాణించే పరిస్థితిలో లేదు. అయినప్పటికీ అమ్మ కోరిక తీర్చాలనుకున్నారు ఆయన. ఓ చిన్నపాటి ఎద్దుల బండిని అమ్మకు తగ్గట్టుగా సమకూర్చుకున్నారు. అమ్మను అందులో కూర్చుండబెట్టారు. ప్రయాగరాజ్‌కు ప్రయాణం మొదలుపెట్టారు. అయితే ఇక్కడ ఎద్దులు లేదా దున్నపోతులకు బదులుగా అమ్మ కూర్చున్న బండిని తానే లాగడం మొదలు పెట్టారు సుదేష్. అలా రోజుకు 50 కి.మీ.ల దూరాన్ని అధిగమిస్తూ 13 రోజుల్లో ప్రయాణం పూర్తి చేయాలనేది ఆ తల్లీకొడుకుల లక్ష్యం. అత్యంత సాహసం, నిబద్ధత, భక్తితో సుదేష్ చేస్తున్న అసాధారణమైన పని అనేక మంది హృదయాలను గెలుచుకుంది అనేందుకు నిదర్శనం అన్నట్టుగా ఆ వీడియో లక్షకు పైగా లైకలను పొందింది. ★





# కుంభమేళాలో కల్యాణం

ప్రయాగరాజ్ కుంభమేళాలో గ్రీసు దేశానికి చెందిన యువతి పెనెలోపెకు భారత్‌కు చెందిన సిద్ధార్థకు జనవరి 26న పెళ్లి జరిగింది. వధూవరులకు చెందిన బంధుమిత్రుల సమక్షంలో హిందూ వివాహ సంప్రదాయాన్ని అనుసరించి జరిగిన ఈ పెళ్లిలో జునా అఖాడా మహామండలేశ్వర్‌స్వామి యతీంద్రానంద్ గిరి కన్యాదానం చేశారు. రుత్విక్కులు వేద మంత్రాలు పఠిస్తుండగా పెనెలోపె, సిద్ధార్థ అగ్నిగుండానికి ప్రదక్షిణ చేశారు. పూలదండలు మార్చుకున్నారు. పెనెలోపె కొన్నేళ్లుగా సనాతన ధర్మ సంప్రదాయాలను అనుసరిస్తూ వస్తున్నారు. జునా అఖాడాలో శిష్యురాలిగా ఉన్నారు. సిద్ధార్థ అనేక దేశాల్లో పర్యటించి యోగా, సనాతన ధర్మాన్ని ఆయా దేశాల ప్రజలకు పరిచయం చేశారు. ఆయన జునా అఖాడాలో ఓ భక్తుడు. ఇద్దరూ కూడా కొద్ది సంవత్సరాలుగా సనాతన ధర్మాన్ని అనుసరిస్తున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఎక్కడ చేసుకోవాలనే ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు కల్యాణానికి కుంభమేళాను మించిన పవిత్రమైన ప్రదేశం ఈ భూమిపై మరెక్కడా ఉండే ప్రసక్తి లేదని వారు భావించారు. చివరకు జునా అఖాడా సాధువుల సమక్షంలో మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. కుంభమేళా సంపూర్ణమయ్యేంతవరకు ప్రయాగరాజ్ లోనే ఉండిపోవాలని కొత్త దంపతులు నిర్ణయించుకున్నారు. ప్రయాగరాజ్‌లో పరిణయంతో అర్థవంతమైన తమ దాంపత్య జీవితానికి ఆధ్యాత్మికత తోడైందని వారు తెలిపారు. ★








# భారతీయ తత్త్వం, వివేకానికి నిదర్శనం!

ప్రయాగ్‌రాజ్‌లో శ్రీ ఆదిశంకర విమాన మండపం దేవస్థానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లాంటి ప్రముఖులతో పాటుగా కుంభమేళాకు విచ్చేస్తున్న సాధారణ భక్తులు సైతం విమాన మండపాన్ని సందర్శించుకుంటున్నారు. కుంభమేళా జరుగుతున్న చోట భారతీయ తత్త్వం, సాంస్కృతిక చైతన్యానికి ఓ ప్రధానమైన కేంద్రంగా ఈ దేవస్థానం వినుతికెక్కింది. 69వ కంచి కామకోటి పీఠాధిపతి స్వామి జయేంద్ర సరస్వతి తన గురువు చంద్రశేఖర సరస్వతి ఆకాంక్షను నెరవేర్చడం కోసమని ఈ దేవస్థానాన్ని నిర్మించారు. 1934లో గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి దారాగంజ్ ఆశ్రమంలో బస చేశారు. అప్పుడే ప్రయాగలో చాతార్మసాన్ని నిర్వర్తించారు. ప్రతి రోజూ త్రివేణి సంగమానికి నడుచుకుంటూ వెళ్లి స్నానమాచరించేవారు. ఆ సందర్భంగా డ్యామ్‌కు దగ్గర్లో రెండు రావి చెట్ల మధ్య ఖాళీ స్థలాన్ని గుర్తించారు. గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి వారి ఆధ్యాత్మిక అంతర్ దృష్టితో ఆ ఖాళీ స్థలంలోనే జగద్గురువు ఆది శంకరాచార్యుడు, కుమారిల్ భట్ నడుమ ఒక జగద్విఖ్యాతమైన చర్చ జరిగిన వైనాన్ని నిర్ధారించుకున్నారు. ఆ దృష్టితో అక్కడ ఓ దేవాలయాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. శంకరాచార్య స్వామి జయేంద్ర సరస్వతి తదనంతర

# భక్తుల సేవలో 16 వేల మంది స్వయంసేవకులు

ప్రయాగరాజ్ కుంభమేళాకు కోట్లాదిగా భక్తులు తరలివస్తున్న దృష్ట్యా అక్కడ వాహనాల రాకపోకలు సజావుగా జరగడం కోసం, భక్తులకు నిత్యావసర సేవలు సమకూర్చడానికని 16,000 మంది స్వయంసేవకులను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ – ఆర్‌ఎస్‌ఎస్ రంగంలోకి దించింది. ఈ స్వయం సేవకులు పోలీసులతో సమన్వయం చేసుకొని కీలకమైన ప్రాంతాల్లో వాహనాలను, పాదచారులను నియంత్రించడానికి తోడు భక్తులకు సాయపడు తున్నారు. దీనికి సంబంధించిన సన్నాహకాలు కొద్ది వారాల క్రితమే మొదలయ్యాయి. ఇందులో భాగంగా స్వయంసేవకులు వాహనాల రాకపోకల నియంత్రణకు సంబంధించి ప్రత్యేక శిక్షణ పొందారు. ఇదే కాకుండా పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, ఇతర నిత్యవసర సేవలు అందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు నిమగ్నమై ఉన్నారు.





**యాత్రికులకు బస ఏర్పాట్లు**

కుంభమేళా అధికార యంత్రాంగం ఆర్‌ఎస్‌ఎస్, అలహాబాద్ విశ్వవిద్యాలయం సమన్వయంతో ప్రయాగరాజ్‌లో చిక్కుకుపోయిన యాత్రికులు బస చేయడానికని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేసింది. బస కావాల్సిన యాత్రికులు విశ్వవిద్యాలయం ఒకటవ నంబరు గేట్ వద్దకు చేరుకొని, అక్కడే ఉన్న స్వయంసేవకుల సాయం తీసుకోవచ్చు.

**ఆహార పొట్లాల పంపిణీ**

స్వయంసేవకులు పలు చోట్ల ఆహార పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఓ వైపు సెక్టార్ 9లో కైలాష్ ద్వార్, సెక్టార్ 7లో సూర్య ద్వార్ వద్ద వాహనాల రాకపోకలను నియంత్రిస్తూనే మరోవైపు బేలా కచ్చర్, ఫఫముఫా, శ్యామా ప్రసాద్ ముఖర్జీ నగర్‌లో యాత్రికులకు ఆహార పంపిణీ చేస్తున్నారు. దారాగంజ్‌లోని రజ్జూ భయ్యా నగర్, సుబేదార్ గంజ్‌లో అవసరమైనవారికి ఆహార పొట్లాలు, టీ, బిస్కెట్లు అందిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు కేవలం ప్రయాగరాజ్‌లో మాత్రమే కాకుండా సమీప జిల్లాలైన ప్రతాప్‌గఢ్, సుల్తాన్‌పూర్, వారణాసి, మీర్జాపూర్‌లో యాత్రికులకు సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఇలా అధికార యంత్రాంగం, పోలీసులు, ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుల సమష్టి కార్యాచరణతో కుంభమేళాకు వస్తున్న కోట్లాది భక్తులు ఓ భద్రమైన యాత్రానుభవాన్ని మూటగట్టుకొని స్వస్థలాలకు క్షేమంగా తిరుగుముఖం పడతారనడంలో ఎలాంటి సందేహం లేదు. ★

కాలంలో గురువుగారి ఆకాంక్షను సాకారం చేశారు.

1969లో అప్పటి యూపీ గవర్నర్ గోపాల్ రెడ్డి శ్రీ ఆది శంకర విమాన మండపం దేవస్థానానికి శంకుస్థాపన చేశారు. గుడిలో విగ్రహాల కోసమని, గుడి నిర్మాణం కోసమని రాళ్లను దక్షిణ భారత దేశం నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. ప్రయాగ్ రాజ్‌లో ద్రవిడ శిల్పకళకు అద్దం పడుతున్న ఈ దేవస్థానాన్ని 1986 మార్చి 17న భక్తుల కోసం తెరిచారు. 130 అడుగుల ఎత్తున్న గుడిలో శ్రీ ఆదిశంకరాచార్య, దేవీ కామాక్షి, తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాలతో పాటుగా 51 శక్తిపీఠాలు, 108 శివలింగాలు, సహస్ర యోగ లింగ భక్తుల పూజలు అందుకుంటున్నాయి. ఇదే ప్రాంగణంలో గణపతి కోసమని ప్రత్యేకంగా ఓ గుడి ఉంది. భక్తులు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు తిరిగ సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు శ్రీ ఆది శంకర విమాన మండపాన్ని సందర్శించుకోవచ్చు. అక్కడి నుంచి త్రివేణి సంగమంతో పాటుగా కుంభమేళాను అల్లంత ఎత్తు నుంచి చూడవచ్చు. ★



# దేహమే రామాలయం!

దేహమంతటా శ్రీరామ నామాన్ని పచ్చబొట్టుగా పొడిపించుకొని, నిత్యం రామనామస్మరణలో జీవనాన్ని సాగించే రామనామి తెగకు చెందినవారు ప్రయాగరాజ్ కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెల్లని వస్త్రాలను ధరించి, తలపై నెమలీకల కిరీటంతో కనిపించారు. ఈసారి కుంభమేళాకు దాదాపు 200 మంది రామనామి తెగకు చెందినవారు చత్తీస్‌గఢ్‌లో శరణ్‌గఢ్, భిలాయి, బలోడా బజార్, జంజ్‌గిరి ప్రాంతాల నుంచి వచ్చారు. శ్రీరామ నామమే వారి ఆధ్యాత్మిక యాత్రకు మార్గదర్శనం. ఆ క్రమంలో దేవాలయాలకు వెళ్లరు. విగ్రహాలకు మొక్కరు. రామనామాన్ని జపించడాన్ని మించిన పూజా విధానం మరింకేది లేదనేది వారి విశ్వాసం. శ్రీరామ నామాన్ని దేహం మీద పచ్చబొట్టుగా పొడిపించు కున్నారు. దేహాన్ని దేవాలయంగా చేసుకున్నారు. గడచిన ఐదు తరాలుగా తమ పూర్వీకుల నుంచి కుంభమేళాకు హాజరవ్వడమనేది ఓ సంప్రదాయంగా వస్తోందని శరణ్‌గఢ్ నుంచి వచ్చిన కౌశల్ చెప్పారు. రామ నామం జపిస్తూ త్రివేణి సంగమ స్థలి వద్ద స్నానమాచరిస్తామని తెలిపారు. కుంభమేళాకు వచ్చే ఈ సంప్రదాయాన్ని భవిష్యత్తులో తమ పిల్లలు కూడా కొనసాగిస్తారని చెప్పారు. ★

# ఏర్పాట్లపై విదేశీయుల ప్రశంసలు



ప్రయాగరాజ్ కుంభమేళా కోసం సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు భేషుగ్గా అన్నాయని విదేశాల నుంచి వచ్చిన యాత్రికులు కొనియాడారు.

అమెరికాలో హవాయి నుంచి వచ్చిన ఓ యాత్రికుడు ఇదే విషయమై తన పొందిన సంభ్రమాశ్చర్యాలను పంచుకున్నారు. కుంభమేళాకు కోట్లాదిగా భక్తులు రావడం తన ఊహకు అందని విషయమని తెలిపారు. ఐనప్పటికీ కార్యక్రమం సజావుగా సాగడంలో ప్రభుత్వం అత్యంత సమర్థమంతంగా పనిచేస్తోందని మెచ్చుకున్నారు. అమెరికాలో ఫ్లోరిడా నుంచి వచ్చిన మరియా అనే యాత్రికురాలు పోలీసుల పనితీరును ప్రశంసించారు. 12 ఏళ్ల క్రితం తాను తొలిసారిగా కుంభమేళాకు వచ్చినట్టు ఆమె చెప్పారు. అదొక మరపురాని అనుభవంగా మిగిలిపోయిందని, దాని ప్రభావంతోనే మరోసారి ఆ అనుభవాన్ని పొందడానికి ప్రయాగరాజ్‌కు తిరిగి వచ్చినట్టు తెలిపారు. గత 26 సంవత్సరాలుగా ప్రతి ఏడాది భారత్‌ను తాను సందర్శిస్తున్నట్టు మరియా చెప్పారు. ఇక్కడి సంస్కృతి అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. కోట్లాది భక్త జనసమూహాన్ని నియంత్రించడంలో పోలీసుల పనితీరు అనిర్వచనీయమని ఆమె అన్నారు.

రష్యాలో మాస్కో నుంచి వచ్చిన జూలియా కుంభమేళా కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లను కొనియాడారు. కుంభమేళాకు రావడం తనకు ఇదే తొలి సారి అని ఆమె అన్నారు. ఇక్కడి వాతావరణాన్ని భద్రత, ఆధ్యాత్మికతల మేళవింపుగా వర్ణించారు. అలాంటి ఓ అతి పెద్ద కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు అమోఘమని జూలియా అన్నారు. కుంభమేళా సందర్శనతో తన కల నిజమైందని కజక్‌స్తాన్‌లో అల్‌మటి నుంచి వచ్చిన అలేనా అన్నారు. పరమశివుడి కృపతో తన కల నిజమైందని ఆమె తెలిపారు. ఇక్కడ పొందుతున్న ఆధ్యాత్మిక అనుభవాన్ని మాటల్లో చెప్పడం కష్టమని అన్నారు. పంజాబ్‌లో పఠాన్‌కోట్‌కు చెందిన అంజు యాత్రికులకు సహాయ సహకారాలు అందించడంలో అధికార యంత్రాంగం అహర్నిశలు పనిచేస్తున్న వైనాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. అధికారులు భక్తులకు అన్నివిధాలుగా సాయపడుతున్నారని ఆమె ప్రశంసించారు. ఇక్కడకు వచ్చేవారెవ్వరూ కూడా పుకార్లను పట్టించుకోవద్దని అంజూ సూచించారు. ★



కథ

# జీవనది

హైమా భార్గవ్

"దేవదేవం భజే, దివ్య ప్రభావం"... భక్తి రసం జాలువారుతున్న ఎం.ఎస్. అమ్మ పాటను పరవశంగా వింటూ, " ఆహా!" అన్నాడు జగన్నాథం. తను కూడా అప్రయత్నంగా గొంతు కలిపాడు.

మల్లె మొగ్గల్ని దండగా కడుతున్న మహాలక్ష్మి పాట వింటూ, భర్త వైపు దృష్టి సారించింది. సంగీతాన్ని ఆస్వాదిస్తూ, ఆనందంగా పాడుకుంటున్న జగన్నాథాన్ని చూసి, ఎప్పటిలాగే ఆశ్చర్యపోయింది. 'శ్రవణానందం' అనే మాట ఇలాంటప్పుడే అర్థమౌతుంది...అనుకుంది. పూలదండ కట్టాక కాఫీ కలిపేందుకు వంటింటి వైపు నడిచింది.

"శ్రీనివాస మంగాపురం వెళ్దాం. అయిదు గంటలకు బయల్దేరుదాం"... అన్నాడు జగన్నాథం. "అలాగే".. అంటూ ఆ ప్రయత్నాలు మొదలెట్టింది మహాలక్ష్మి.

* * *

దేవుడి దర్శనం అయ్యాక ఇద్దరూ ఆలయం ఆవరణలోని బల్ల మీద కూర్చున్నారు. చుట్టూ ఉన్న చెట్ల నుంచి చల్లటి గాలి వీస్తోంది. "ఆలయాలు అలాగే ఉన్నాయి. మిగిలినవన్నీ చాలావరకు మారిపోయాయి. ఆ వేంకటేశ్వర స్వామి దయ వల్ల ఇంకా సంప్రదాయానికి, సంప్రదాయ కళలకు ఆదరణ లభిస్తోంది. అదే సంతోషం"... అన్నాడు జగన్నాథం. మహాలక్ష్మి నిట్టూర్చింది. వృద్ధాప్యం వచ్చేసరికి గతంలో జీవించడం మొదలవుతుందేమో అనుకుంది.

జగన్నాథం స్వర్ణయుగంలాంటి గతంలో విహరించసాగాడు. చదువుకుంటూనే, తరతరాలుగా వస్తున్న వంశ వృత్తి హరికథా గానాన్ని తను నేర్చుకున్నాడు. 'హరికథలు చెప్పేవారు సాహిత్యంలో, పురాణ గ్రంథ పఠనంలో, సంగీతంలో విశేషమైన కృషి చేయాలి. గాత్రంలో మాధుర్యం ఉండాలి. చిరతలు వాయిస్తూ ఇతర వాద్య కళాకారులతో కలిసి పాడటం అభ్యాసం చేయాలి. వేదిక మీద నిలబడినప్పుడు భయపడకుండా ఉండాలి. జనరంజకంగా చెప్పగలగాలి. మధ్య మధ్య ఆసక్తికరమైన పిట్ట కథలను హాస్యస్ఫోరకంగా చెప్పగలగాలి. వాటిలో ఔచిత్యం ఉండాలి. గంట సేపు, లేక గంటంబావు సేపు హరికథ చెప్పవలసి వస్తే ప్రారంభం నుండి చివర వరకు అన్ని పదాలు, పద్యాలు, గానం, రాగం, తాళం... అన్నీ గుర్తు పెట్టుకోవాలి. మంచి హరి కథకుడిగా కీర్తి, ప్రతిష్టలు తెచ్చుకోవాలంటే సాధన తప్ప మరో మార్గం లేదు. కష్ట పడితేనే ఏ కళైనా వచ్చేది"... అంటూ నాన్న చెప్పడమే కాదు. తన చేత చేయించారు. శ్రీరామనవమి రోజు తను 'సీతా కళ్యాణం' హరికథ చెప్పాడు. మొదటిసారి నాన్న అభినందన, ఆశీర్వాదం అందుకున్న ఆ రోజును జీవితంలో మర్చిపోలేడు.

ఒకప్పుడు ఆలయానికి వచ్చిన భక్తులు ఓపికగా హరికథలు వినేవారు. ఇప్పుడు ఎవరికీ ఆసక్తి, సమయం ఉండటం లేదు. తిరుపతిలోని మ్యూజిక్ కాలేజీలో హరికథ విభాగంలో తనకు లెక్చరర్‌గా ఉద్యోగం దొరికింది కాబట్టి తనకు భుక్తి కోసం వెతుక్కునే అవస్థ తప్పింది. ఇప్పుడు టీటీడీ వంటి సంస్థలు, కొన్ని ఆలయాల్లో పర్వదినాల్లో తప్ప హరికథలను ప్రోత్సహించే వారు ఎవరున్నారు? వినేవారూ కొందరే. టీవీ... పత్రికలను, నాటకాలను, సంప్రదాయ కళలను దారుణంగా దెబ్బ తీసింది. నట్టింట బ్రహ్మ రాక్షసిగా మారి అష్టమ వ్యసనంగా తయారైంది. తెలుగు భాష రాజ్యం చేసిన తెలుగు సీమలో ఇప్పుడు తెలుగు భాష అనాథలా అయ్యింది. తెలుగులో మాట్లాడే వారు గణనీయంగా తగ్గిపోతున్నారు. 'మాకొద్దీతెల్లదొరతనము' అన్న నేలలో ఎక్కువగా ఆంగ్ల భాష వినబడుతోంది. అదొక గొప్ప విషయంగా అనుకుంటూ తెలుగు వాళ్లే మాతృభాషను చిన్నచూపు చూడటం ఎంత బాధాకరం!తెలుగు రాయడం, చదవడం చాలావరకు తగ్గింది. ఎంత విషాదకరం!.

బతుకు తెరువు చూపలేని హరికథను ఎవరు వృత్తిగా స్వీకరిస్తారు ? తమ కొడుకు వంశీ కృష్ణ ఉద్యోగం వచ్చిందని అమెరికాకు వెళ్తుంటే నిస్సహాయంగా సరే అనడం తప్ప ఏమీ చేయలేక పోయాడు. పదేళ్ల తర్వాత వచ్చేస్తానని వంశీ అన్నాడు. తనకు నమ్మకం లేదు. తమ కూతురు హైదరాబాద్‌లో ఉంది. అదే ఓదార్పు.

మహాలక్ష్మి భర్త వైపు చూసింది. గత వైభవాన్ని తలుచుకుంటూ ఉంటాడని తెలుసు. కనుక మౌనంగా ఉండిపోయింది. పెళ్లయిన తర్వాత తన భర్త రామాలయంలో చెప్పిన 'సీతారామ కల్యాణం' ... హరికథను విన్నప్పుడు తనకు ఎంతో ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.

ఎంతో కళగా ఉండే ముఖానికి నుదుటి మీద తీర్చిన ఎఱ్ఱ రంగు నామం ఎంతగానో నప్పింది. పట్టు వస్త్రాలు పవిత్రతకు చిహ్నంగా ఉన్నాయి. మెడలో పూలదండ వేసుకుని మధురంగా ఆలపిస్తుంటే విస్మయంతో చూడటం తన వంతైంది.

"సీతాకల్యాణ వైభోగమే"... అని మధురంగా పాడుతుంటే, ఆ మాధుర్యానికి తన కళ్లు నీటి కొలనులే అయ్యేవి. నిజంగా 'సీతారాముల కల్యాణం'.. కళ్ల ముందు జరుగుతున్నట్లు ఆ వర్ణన, పాటలు ఉండేవి. 'గంగావతరణం' గురించి చెబుతుంటే మాటల తీరులో, పాటల హోరులో గంగానది దివి నుండి భువికి వచ్చినట్లే అనిపించేది. గొప్ప తెలుగు కవుల కవిత్వాన్ని కూడా సందర్భోచితంగా వినిపించేవారు. హాస్య వచనాలతో శ్రోతల మనసులకు గిలిగింతలు పెట్టేవారు. ఓ అద్భుత ప్రపంచాన్ని కనుల ముందు ఆవిష్కరించే వారు. 'మోహినీ భస్మాసుర' హరికథ చెప్పేటపుడు భస్మాసురుడు శివుడి తలమీద చెయ్యి పెట్టబోతుంటే, శివుడు అతనికి అందకుండా వేగంగా వెళ్తుంటే భస్మాసురుడు "ఆగవయ్య ఆగవయ్య శివ శివా!" అంటూ శివుడి వెంటబడతాడు. ఆ మాటలు చిరు హాస్యంతో ఉండేవి. ఇలా ఒకటా రెండా ! ఎన్నో మాటలు! పాటలు!. తను ప్రేమగా "చాలా బాగా పాడారు".... అంటే నవ్వేసి, "భార్య మెచ్చుకుంటే ప్రపంచాన్ని జయించినట్లే"... అనేవారు. ఇంత మంచి స్నేహితుడితో జీవితాన్ని పంచుకోవడం తన అదృష్టం. "ఇంతకాలం ఈ వృత్తిలో మునిగిపోయి, ఇప్పుడు ఖాళీగా ఉండవలసిన పరిస్థితులు ఎదురయ్యే సరికి పాపం ఏమీ తోచడం లేదు"... సానుభూతితో భర్త వైపు చూసింది మహాలక్ష్మి.

"ఇక వెళ్దామా" ?అంటున్న భర్తతో



### భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది



"వెళ్దాం".... అంటూ అతన్ని అనుసరించింది మహాలక్ష్మి.

* * *

ఆదివారం రాత్రి అమెరికా నుండి కొడుకు వీడియో కాల్ చేస్తే జగన్నాథం, మహాలక్ష్మి అతనితో మాట్లాడసాగారు.

"విశేషాలేంటి నాన్నా?"... అన్నాడు వంశీ కృష్ణ.

"ఏముంటాయిరా? అంతా మామూలే. రొటీన్"... అన్నాడు.

"అబ్బా ! అందరం రొటీన్ గా బతుకుతాం. అది కాదు. ఏమైనా కబుర్లు చెప్పు. అమ్మ చూడు. ఎన్ని కబుర్లు చెబుతుందో" అన్నాడు వంశీ చిరు కోపంతో.

"చూడు నాన్నా ! నేను స్టేజ్ మీద మాత్రమే హరికథలు చెప్పగలను. ఫోన్ లో అంతగా మాట్లాడను. కానీ మీ అమ్మ ఫోన్‌లో హరికథలు బాగా చెబుతుంది. అదీ సంగతి"... అన్నాడు జగన్నాథం .

వంశీ పెద్దగా నవ్వాడు. మహాలక్ష్మికి నవ్వొచ్చినా, కోపంగా భర్త వైపు చూసింది. జగన్నాథం భయాన్ని నటించి "లక్ష్మమ్మా ! అలా కౌశికుడిలా చూడకు. తాటాకు లాంటి వాడిని. మాడి మసై పోగలను"... అన్నాడు. మహాలక్ష్మి నవ్వేసింది.

"నాన్నా! ఈ పదేళ్లలో మేము ఇండియాకు వచ్చామే కానీ, మీరు అమెరికాకు రాలేదు. ఏదో ఒకటి చెబుతుంటారు. ఈ సారి మీరు రావాలి. నీ బర్త్ డే రోజు మీరు మాతో ఉండాలి. మీకు టికెట్స్ బుక్ చేస్తున్నాను. ఏ రోజు చెయ్యాలో చెప్పండి"... అన్నాడు.

జగన్నాథం కాదనలేక ప్రయాణానికి మంచిరోజు చూసుకుని, వంశీకి చెప్పాడు.

"థాంక్స్ నాన్నా. టికెట్స్ బుక్ చేసి మీకు చెబుతాను"... అన్నాడు వంశీ. కొడుకుతో కాసేపు మాట్లాడింది మహాలక్ష్మి.

* * *

న్యూయార్క్‌లోని ఆ చిన్న అపార్ట్‌మెంట్ జగన్నాథానికి, మహాలక్ష్మికి పూర్తిగా నచ్చలేదు. పైకి ఆ మాట అంటే కొడుకు బాధ పడతాడని చెప్పలేదు. వాళ్లు వెళ్లిన రోజే వంశీ చెప్పాడు. అమెరికాలో ఫ్లోరింగ్ చెక్కతో చేస్తారని, బాత్‌రూమ్‌లో ఇండియాలో లాగా కాళ్లు కడుక్కునే వీలు లేదని, కాళ్లు కడుక్కోవాలంటే బాత్ టబ్‌లోకి దిగి, కడుక్కోవాలని, వేరే మార్గం లేదని....

"అంటే ప్రతిసారిబాత్ టబ్‌లోకి దిగాల్సిందేనా?" దిగులుగా అడిగింది మహాలక్ష్మి.

"అవునమ్మా. ఇది చెక్క ఫ్లోరింగ్ కదా. తడి తగల కూడదు"... అన్నాడు వంశీ.

బాత్రూమ్‌లోకి వెళ్లిన ప్రతిసారి కాళ్లు కడుక్కునే



పట్టు వస్త్రాలతో, నుదుట ఎర్రటి నామంతో, మెడలో దండతో, చేతిలో చిరతలతో గణపతి ప్రార్థనతో హరికథను మొదలు పెట్టాడు భాగవతార్. మధురమైన కంఠస్వరంతో, గానంతో, ఛలోక్తులతో తిరుమల శ్రీనివాసుని మహాత్మ్యాన్ని చెబుతుంటే, ఆ కథ అందరినీ అలరిస్తోంది.

జగన్నాథం, మహాలక్ష్మి ఒకరి నొకరు చూసుకున్నారు. ఇద్దరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, ఆనందం…"మన వంశీయే కదా"… నమ్మలేనట్లు అన్నాడు జగన్నాథం. "అవును మనవాడే"… అంది మహాలక్ష్మి. "తాతయ్యా! నాన్న"… అంటున్నారు మనవలు.

అలవాటున్న జగన్నాథం, మహాలక్ష్మి బాత్ టబ్‌లోకి దిగి, మళ్లీ బైటి కొచ్చి అలసి పోయారు. "ఏం పిచ్చి ఫ్లోరింగో ఏమిటో ! కాళ్లు కడుక్కునే వీల్లేకుండా"… అంటూ మనసులోనే విసుక్కుంది.

శని, ఆది వారాలు అమెరికాలోని టూరిస్ట్ ప్రదేశాలు చూసేటప్పుడు, మనవడితో, మనవరాలితో కబుర్లు చెప్పేటప్పుడు బాగున్నా, నెల రోజులకే జగన్నాథానికి, మహాలక్ష్మికి భారత దేశంలో ఉన్న సుఖం ఇంకెక్కడా లేదని అనిపించింది.

"చాలా మంది తెలుగు వాళ్లు  అమెరికాలో ఇళ్లు  కట్టుకుంటున్నారు కదా. మీరు కూడా కట్టు కుంటారా?" అని అడిగింది మహాలక్ష్మి.

"అమెరికాలో స్థిర పడితే ఇల్లు కట్టుకోవచ్చు. మేము ఇండియాకు వచ్చేస్తాము కదా. అందుకే కట్టుకోలేదు."… అన్నాడు వంశీ.

ఆ మాటలకు జగన్నాథం, మహాలక్ష్మి కుదుట బడ్డారు. చక్కటి తెలుగు మాట్లాడుతున్న మనవలను చూస్తుంటే సంతోషంగా ఉన్నా, మన సంస్కృతికి దూరంగా పెరుగుతున్నారనే బాధ జగన్నాథంలో ఎక్కువైంది.

"అన్నిటికీ అనవసరంగా బాధ పడకండి. మన దేశంలో పెరిగే పిల్లలు కూడా అమెరికన్స్‌లా ఉన్నారు. సంప్రదాయం, సంస్కృతి పోతున్నాయి. ఇవన్నీ ఆలోచించకండి"… ఓదార్పుగా అంది మహాలక్ష్మి.

* * *

తండ్రి జన్మదినం శనివారం రావడంతో అమ్మా, నాన్నలను, భార్యా పిల్లలను వేంకటేశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్లాడు వంశీకృష్ణ. ఆ రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉండటం వల్ల ఆ ఊళ్లోనే ఆ రాత్రి బస చేయాలని అనుకున్నారు.

* * *

కాస్త ముందుగా వచ్చి, కుటుంబ సభ్యులను ఆడిటోరియంలో మొదటి వరసలో కూర్చోబెట్టి, స్నేహితులతో మాట్లాడసాగాడు వంశీ. ఆడిటోరియం జనంతో నిండి పోయింది. ముందుగా చిన్న పిల్లల కూచిపూడి నాట్యం ఓ అరగంట సేపు జరిగింది. "ఇప్పుడు 'శ్రీనివాస కల్యాణం' హరికథా కార్యక్రమం జరుగుతుంది… అన్న అనౌన్స్‌మెంట్ వినబడింది.

జగన్నాథం, మహాలక్ష్మి కుతూహలంతో, ఆసక్తితో చూడసాగారు.

పట్టు వస్త్రాలతో, నుదుట ఎర్రటి నామంతో, మెడలో దండతో, చేతిలో చిరతలతో గణపతి ప్రార్థనతో హరికథను మొదలు పెట్టాడు భాగవతార్. మధురమైన కంఠస్వరంతో, గానంతో, ఛలోక్తులతో తిరుమల శ్రీనివాసుని మహాత్మ్యాన్ని  చెబుతుంటే, ఆ కథ అందరినీ అలరిస్తోంది.

జగన్నాథం, మహాలక్ష్మి ఒకరి నొకరు చూసుకున్నారు. ఇద్దరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, ఆనందం…"మన వంశీయే కదా"… నమ్మలేనట్లు అన్నాడు జగన్నాథం. "అవును మనవాడే"… అంది మహాలక్ష్మి. "తాతయ్యా! నాన్న"… అంటున్నారు మనవలు.

"శ్రీనివాసుడి మీద పద్మావతీ దేవి చెలికత్తెలు రాళ్లు విసిరారు. అప్పుడు పట పట పటమని రాళ్ల వర్షము పడెను మేని పైన"… ఒకటికి రెండు సార్లు పాడిన ఆ చరణాలకు తగిన వయొలిన్ సహకారాన్ని అందించాడు… వాద్యకారుడు.

తన పైన మల్లెల వాన కురిసినట్లు పరవశించాడు జగన్నాథం. తన కొడుకు, తన రక్తం, తన సంప్రదాయాన్ని మరచిపోకుండా… జగన్నాథం కళ్లలో ఆనంద జలధి తరంగాలను, గంగావతరణాన్ని చూసింది మహాలక్ష్మి. సంప్రదాయం జీవనదే"…. అనుకుంది. ప్రవాసాంధ్రులకు సంస్కృతి మీద ఉన్న గౌరవానికి ముచ్చట పడింది.

"నాన్నగారి జన్మదినం ఈ రోజు. ఆయనకు ఏ కానుక ఇవ్వాలో, ఎలా సంతోష పెట్టాలో నాకు అర్థం కాలేదు. హరికథ నాన్నగారికి ఆరో ప్రాణం. అందుకే హరికథను ఆయన ముందు ప్రదర్శించాను. ఈ రోజు నేను చెప్పిన హరికథ నాన్నగారు ఒకప్పుడు చెప్పిందే. దాన్నే అనుసరించాను. కాలానికి తగ్గట్లు స్వల్పంగా మార్చాను"… సంతోషంగా చెప్పాడు వంశీ.

"ప్రముఖ హరికథా కళాకారులు జగన్నాథం గారిని ఈనాడు సన్మానించు కోగలగడం మన అదృష్టం. వారిని వేదిక మీదకురావలసిందిగా కోరుతున్నాము…" సాంస్కృతిక సంస్థ కార్యదర్శి సవినయంగా నమస్కరిస్తూ జగన్నాథం గారిని ఆహ్వానించాడు.

ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య జగన్నాథం వేదిక వైపు… కాదు వెన్నెల వెలుగు వైపు నడిచాడు.




వచ్చేవారం కథ..

**వినిపించే రాగాలు**

– కె.కె. భాగ్యశ్రీ





అంతర్జాతీయ క్రికెట్ మండలి గత ఏడాది కాలానికి క్రికెట్ మూడు (టెస్టు, వన్డే, టీ-20) విభాగాలలోనూ అత్యుత్తమ టీమ్, వ్యక్తిగత అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలోని రెండు ఫార్మాట్లతో పాటు మహిళల వన్డే విభాగంలో భారత్‌కు మొత్తం మూడు వ్యక్తిగత విభాగం అవార్డులు దక్కాయి. సాంప్రదాయ టెస్టు క్రికెట్లో భారత వైస్ కెప్టెన్ కమ్ ఫాస్ట్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా, ధూమ్ ధామ్ టీ-20 విభాగంలో పేస్ బౌలర్ అర్షదీప్ సింగ్, మహిళల వన్డేలలో ఓపెనర్

ఐసీసీ -2024 అవార్డుల మూడు విభాగాలలోనూ భారత క్రికెటర్లు విజేతలుగా నిలిచారు.భారత క్రికెట్ కే గర్వకారణంగా నిలిచారు. సంప్రదాయ టెస్టు ఫార్మాట్లో బుమ్రా, ధూమ్ ధామ్ టీ-20 విభాగంలో అర్షదీప్ సింగ్, మహిళల వన్డే క్రికెట్లో స్మృతి మందన తమకుతామే సాటిగా రికార్డుల్లో చేరారు.

# ఐసీసీ అవార్డుల్లో ముగ్గురూ ముగ్గురే!

స్మృతి మందన అత్యుత్తమ ప్రదర్శనతో అవార్డు విజేతలుగా నిలిచారు.

### బుమ్రాకి సర్ గార్ ఫీల్డ్ సోబర్స్ అవార్డు...

ఐదురోజుల సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో ప్రపంచ మేటి బౌలర్‌గా నిలిచిన జస్ ప్రీత్ బుమ్రా స్థాయికి తగ్గట్టుగా రాణించడం ద్వారా అత్యుత్తమ అవార్డు గెలుచుకొన్నాడు. పురుష క్రికెటర్లకు కరీబియన్ దిగ్గజ ఆల్ రౌండర్ సర్‌గార్ ఫీల్డ్ సోబర్స్ పేరిట ఈ అవార్డును ఐసీసీ ప్రదానం చేస్తుంది.

గతంలో అదే అవార్డును అందుకొన్న భారత క్రికెటర్లలో భారత మాజీ కెప్టెన్, కోచ్ రాహుల్ ద్రావిడ్ (2004), మాజీ ఓపెనర్ ,ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్ (2009), భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ (2010), ఆఫ్ స్పిన్ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ (2016), భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ (2018) ఉన్నారు. ఇప్పుడు.. జస్ ప్రీత్ బుమ్రా వచ్చి గతంలో ఇదే ఘనత సాధించిన ఐదుగురు దిగ్గజ క్రికెటర్ల సరసన నిలిచాడు. 2024 క్రికెట్ సీజన్లో బుమ్రా ఆడిన మొత్తం 13 టెస్టు మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టడం ద్వారా అగ్రస్థానంలో నిలిచాడు.

2004 సీజన్లో కేవలం 10 ఇన్నింగ్స్ మాత్రమే ఆడిన రాహుల్ ద్రావిడ్ కళ్లు చెదిరే స్థాయిలో 100.37 సగటు నమోదు చేశాడు. 2 శతకాలు, 5 అర్థ శతకాలతో 803 పరుగులతో చరిత్ర సృష్టించి ఐసీసీ అత్యుత్తమ టెస్టు క్రికెటర్ అవార్డుకు ఎంపికైన భారత తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. 2009 సీజన్లో ఐదంటే ఐదు టెస్టులు ఆడి 4 శతకాలు, ఓ అర్ధశతకం సహా 727 పరుగులు సాధించాడు. 90.87 సగటుతో పాటు టెస్టు క్రికెట్ నంబర్ వన్ బ్యాటర్‌గా ఐసీసీ అత్యుత్తమ టెస్టు క్రికెటర్ అవార్డు సాధించాడు.

### 2010లో సెహ్వాగ్ విశ్వరూపం....

2010 క్రికెట్ సీజన్లో 14 మ్యాచ్‌లు ఆడిన డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఐదు శతకాలు, 8 అర్ధ శతకాలు సహా 1422 పరుగులు సాధించాడు. ఆఫ్ స్పిన్ బౌలర్‌గా 9 వికెట్లు పడగొట్టడం ద్వారా ఐసీసీ అత్యుత్తమ టెస్టు క్రికెటర్ అవార్డు అందుకొన్న భారత మూడో ఆటగాడిగా రికార్డుల్లో చోటు సంపాదించాడు. 2016 సీజన్లో 12 టెస్టులు ఆడిన ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ 72 వికెట్లు పడగొట్టడంతో పాటు 612 పరుగులు సాధించాడు. ఆల్ రౌండర్‌గా అశ్విన్ అత్యుత్తమంగా రాణించడం ద్వారా సర్ గార్ ఫీల్డ్ సోబర్స్ అవార్డు సొంతం చేసుకోగలిగాడు.

భారత దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ 2018 సీజన్లో చెలరేగిపోయాడు. మొత్తం 13 టెస్టుల్లో 1322 పరుగులతో 55.08 సగటు నమోదు చేశాడు. మొత్తం ఐదు శతకాలు, ఐదు అర్ధ శతకాలతో ఐసీసీ అత్యుత్తమ టెస్టు క్రికెటర్ పురస్కారం అందుకొన్నాడు.

### కురచ క్రికెట్లో అర్షదీప్ మ్యాజిక్....

ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్లో 2024 సంవత్సరానికి ఐసీసీ అత్యుత్తమ క్రికెటర్ అవార్డు భారత యువఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్‌కు దక్కింది. 25 సంవత్సరాల అర్షదీప్ 2024 సీజన్లో మొత్తం 18 మ్యాచ్‌లు ఆడి 36 వికెట్లు పడగొట్టాడు. 2007 తరువాత భారత్ ఐసీసీ టీ-20 ప్రపంచకప్ విజేతగా నిలవడంలో అర్షదీప్ తనవంతు పాత్ర పోషించాడు. అంతేకాదు... ఐసీసీ అత్యుత్తమ టీ-20 జట్టులో రోహిత్ శర్మ, బుమ్రా, హార్దిక్ పాండ్యాలతో కలసి అర్షదీప్ సైతం చోటు సంపాదించాడు.

### శతకాల 'రాణి ' స్మృతి మందన...

మహిళల విభాగంలో భారత్ కు 2024 సీజన్లో ఒకే ఒక్క ఐసీసీ అవార్డు దక్కింది. టెస్టు, టీ-20 ఫార్మాట్లలో భారత మహిళలు అవార్డులు సాధించలేక పోయినా.. 50 ఓవర్ల వన్డే క్రికెట్లో భారత ఓపెనర్ కమ్ వైస్ కెప్టెన్ స్మృతి మందన ఐసీసీ అత్యుత్తమ వన్డే క్రికెటర్ అవార్డు సాధించడం ద్వారా పరువు దక్కించింది. తన కెరియర్‌లో తొలిసారిగా 2018 సీజన్లో ఐసీసీ అత్యుత్తమ క్రికెటర్ అవార్డు అందుకొన్న స్మృతి 2024 సీజన్లోనూ అదే సాధించడం మరో అరుదైన ఘనతగా మిగిలిపోతుంది.

గత ఏడాదికాలంలో ఆడిన వన్డే మ్యాచ్‌ల్లో స్మృతి మందన రికార్డు స్థాయిలో నాలుగు శతకాలు నమోదు చేసింది. అత్యుత్తమ క్రికెటర్ అవార్డుకు జరిగిన పోటీలో శ్రీలంక కెప్టెన్ చమరీ అటపట్టు, దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ లారా వూల్వార్ట్, ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సదర్లాండ్‌లతో పోటీపడిన స్మృతి మందన అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభతో విజేతగా నిలువగలిగింది. స్మృతి మొత్తం 13 వన్డేలు ఆడి నాలుగు శతకాలు సహా 794 పరుగులతో 57.46 సగటు నమోదు చేసింది. న్యూజిలాండ్ ఆల్ టైమ్ గ్రేట్ బ్యాటర్ సుజీ బేట్స్ రెండుసార్లు ఐసీసీ అత్యుత్తమ క్రికెటర్ అవార్డు అందుకొన్న తొలి మహిళ కాగా..ఇప్పుడు స్మృతి మందన వచ్చి చేరింది.

ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌కు చిరునామాగా నిలిచిన భారత్ మూడు విభాగాలలో ఐసీసీ అవార్డులు సాధించడంతో పాటు..2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ చాంపియన్‌గా నిలవడం అభినందనీయం. ★



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# ‘శభాష్ సేవాభారతి’

**భాగ్యనగర్ :** 2030 నాటికి లక్ష మంది అభాగ్య బాలికల అభ్యున్నతి లక్ష్యంగా సేవాభారతి ముందుకు సాగాలని తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ సేవాభారతి ఆధ్వర్యంలో రన్ ఫర్ గర్ల్ చైల్డ్ కార్యక్రమం ఫిబ్రవరి 2 న గచ్చిబౌలిలో




జరిగింది. 21,10,5 కిలోమీటర్ల విభాగాల్లో 9వ సారి జరిగిన ఈ రన్ బాలికల సాధికారతకు సంబంధించిన ‘కిషోరి వికాస్’ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఉద్దేశించినది.

ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమాజంలోని అభాగ్యుల అభ్యున్నతి కోసం సేవాభారతి చేస్తున్న కృషిని ప్రశంసించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో బాలికల సాధికారత కు ఉద్దేశించిన కార్యక్రమాల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. సేవాభారతి ఇప్పటికే 10,500 మంది బాలికల జీవితాలను ప్రభావితం చేసిందని మంత్రి కొనియాడారు. 2030 నాటికి లక్షమంది బాలికల జీవితాలను ప్రభావితం చేసే లక్ష్యంతో సేవాభారతి ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

రన్‌ఫర్ గర్ల్ చైల్డ్ వార్షిక కార్యక్రమం బాలికల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతోందని సేవాభారతి జాతీయ ప్రధాన కార్యదర్శి పరాగ్ అభయంకర్, తెలంగాణ అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్డేటా, ఇన్ఫోసిస్, జీఈపీ, పాల్టెక్, బీడీఎల్, ఇన్నోవా సొల్యూషన్స్, ఫిల్టరేషన్ గ్రూప్, చబ్బ్, యూఎస్టీ గ్లోబల్, డిష్ టీవీ, ఈసీఐఎల్, ఎస్పీఎంసీఐఎల్, పెర్సిస్టెవ్, కోటివిటి, పెగా సిస్టమ్స్, చబ్, టెక్వేవ్, సైలోటెక్, గ్లోబల్లాజిక్, టెక్వేదిక, సత్య నారాయణ జ్యువెలర్స్, స్నాఫీఐ, హ్యాపీ హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, హెచ్సీయూ, రన్ఫిట్ ప్రో, ఐబ్రిడ్జ్, AADHAN TV, TAL రేడియో, ఐబ్రిడ్జ్ సంస్థలు తమ వంతు కృషిగా సేవా భారతికి మద్దతునిచ్చాయన్నారు. గచ్చిబౌలి స్టేడియం నుండి ప్రారంభమైన ఈ రన్‌లో కార్పొరేట్‌లు,వారి కుటుంబాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులను కలుపుకొని 11వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

విజేతలకు మంత్రి శ్రీధర్ బాబు మెమోంటోలు అందజేశారు. శాసనసభ్యులు ఏ.గాంధీ, ఫ్రీడమ్ ఆయిల్ జి.యం. చేతన్, గ్లోబల్ డేటా డైరెక్టర్ రాజీవ్ గుప్తా, పాల్టెక్ ప్రతినిధి శ్యాంపాల్‌రెడ్డి రన్‌లో పాల్గొన్నవారిని అభినందించారు.ఇన్ఫోసిస్ సిఎస్ఆర్ హెడ్ వంశీపరంజ్యోతి, ఫిల్టరేషన్ గ్రూప్ సి.ఎఫ్.వో వినోద్, యూఎస్టీ గ్లోబల్ సి.ఎస్.ఆర్ హెడ్ తిరుమల్ విజయ్, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి, దక్షిణ మధ్య క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, తెలంగాణ సేవాభారతి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# నిరుపేదలకు మాధవ స్మారక సేవాసమితి కుట్టుమిషన్లు



**నిజామాబాద్ :** నిరుపేదలకు స్వయంఉపాధిలో శిక్షణ ఇవ్వడం ద్వారా మాధవస్మారక సేవాసమితి సమాజానికి ఎనలేని సేవలు చేస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. మాధవ స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్, జూట్ బ్యాగుల తయారి శిక్షణ కార్యక్రమానికి ఏడాది కాలం సంపూర్ణ మైంది. ఈ సందర్భంగా జనవరి 27న ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాసమితిని అభినందించారు.

అలాగే నగరంలో పడుపు వృత్తి నుంచి బైటపడి జీవనోపాధి పొందాలనుకునే 30 మందిని న్యాయసేవాధికార సంస్థ ఎంపిక చేసింది. వారికి స్నేహ సొసైటీ సహకారంతో మాధవ స్మారక సేవా సమితి ద్వారా శిక్షణ ఇప్పించింది. ఈ సందర్భంగా ఆ 30 మందితో పాటుగా మొత్తంగా 151 మందికి నిర్వాహకులు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, మాధవ స్మారక సేవాసమితి అధ్యక్షుడు మర్రి కృష్ణారెడ్డి, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు సాయిప్రసాద్, రెండు సమితులకు సంబంధించిన సభ్యులందరూ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులతో సహపంక్తి భోజనం





**కల్వకుర్తి :** సామాజిక సమరసత సప్తాహంలో భాగంగా కల్వకుర్తిలో భోగరాజు రాము నివాసంలో కుటుంబావసరాలకు సహకరించేవారిని జనవరి 28న సన్మానించారు. ఇందులో 13 మంది పారిశుద్ధ్య కార్మికులు, రజకుడు, క్షురకుడు, వడ్రంగి, బైక్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, సిలిండర్ వేసే వ్యక్తి, ఆటో డ్రైవర్, ఇంటి పనిమనిషి కుటుంబాలతో సహా పాల్గొన్నారు. వీరందరినీ శాలువాలతో సత్కరించారు. విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సహప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సహపంక్తి భోజనంతో సన్మాన కార్యక్రమం సంపూర్ణమైంది. ఇదే రోజున **ఆమన్‌గల్‌**లో బవాండ్ల అంజయ్య నివాసంలో సామాజిక సమరసత సప్తాహానికి తెలంగాణ ప్రాంత సహకార్యవాహ ఎర్ర నర్సింగ్ హాజరయ్యారు.

**పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు గమనిక**

జాగృతి వార పత్రికలో ప్రచురణార్థం పంపే వార్తలు ఫోటోలు, మిగతా సమాచారం **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రిక చందాకు సంబంధించిన అన్ని వివరాలు **jagritiweeklysub@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రికలో ప్రచురణార్థం పంపే వాణిజ్య ప్రకటనలను **jagritiweeklyadvt@gmail.com** కు మాత్రమే పంపాలి.



# బాల జాగృతి

## తెలుసుకుందాం

## నత్తా రామేశ్వరాలయం



పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. ఈ ఆలయ విశిష్టత మార్కండేయపురాణంలోను, వాయుపురాణంలోను ఉంది. పరశురాముడు 'ఏడు కోట్ల మంది మునులూ దేవర్షులతో కలసి శివ లింగాన్ని స్థాపించినందున దీనికి సప్తకోటీశ్వర లింగం' అని పేరు కూడా ఉంది. ఈ శివలింగం ఏడాదిలో 11 నెలలు పూర్తిగా నీటిలో మునిగి ఉండడం ప్రత్యేకత. అంతేకాదు, ఈ స్వామి పశ్చిమాభిముఖంగా ఉండడం మరో ప్రత్యేకత. శివునికి ఇష్టమైన వైశాఖ మాసంలో మాత్రం ఆలయంలో నీటిని పూర్తిగా తోడి శివ లింగానికి పూజలూ, అభిషేకాలు నిర్వహిస్తారు. వైశాఖ మాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

## కథ | తిక్క కుదిరింది..!



అనగనగా ఒక దట్టమైన అడవి. అందులో రకరకాల జంతువులు, పక్షులు, కీటకాలు ఉండేవి. వాటితో పాటు ఒక ఎలుగుబంటు కూడా ఉండేది. దాని పేరు భల్లు. దానికి తేనె అంటే ఎంత ఇష్టమంటే అది తేనె కోసం ఎన్ని కష్టాలైనా పడేది. అడవిలో అంగుళం అంగుళం వెతికేది. తేనెపట్టు చిటారు కొమ్మన ఉన్నా సరే.. చకాచకా చెట్టెక్కి ఆ తేనె తాగేసింది.

భల్లు బారిన పడి తమ తేనె పట్టులన్నీ నాశనం అయిపోతున్నాయని తేనెటీగలు బాధపడసాగాయి. తేనెపట్టులకు కాపలా కాయాలని నిర్ణయించుకున్నాయి. ఈ విషయం భల్లుకు తెలియదు. ఒక చెట్టు మీద పెద్ద తేనెపట్టును చూసింది. దాన్ని చూడగానే భల్లుకు నోరూరింది. మెల్లగా చెట్టు ఎక్కి తేనెపట్టు దగ్గరకి వెళ్లింది.

కాపలా ఉన్న ఒక తేనెటీగ భల్లుని కసిగా కుట్టి తేనెపట్టు లోపలికి వెళ్లి దాక్కుంది. భల్లుకు కోపం వచ్చింది. తేనెపట్టును గట్టిగా చేత్తో కొట్టింది. అప్పటి వరకు తేనెపట్టుకు కాపలా కాసి లోపల విశ్రాంతి తీసుకుంటున్న తేనెటీగలన్నీ ఒక్కసారిగా బయటకు వచ్చి భల్లును ఒళ్లంతా కుట్టాయి. నొప్పికి ఓర్చుకోలేక భల్లు చెట్టుపై నుంచి కింద పడింది. అయినా తేనెటీగలు దాన్ని

## పద్యం

పరహితమైన కార్యమతి భారతముతోడిదియైన పూను స
త్పురుషుడు లోకము ల్పొగడ, పూర్వమునం దొక రాలవర్షమున్
కురియగ చొచ్చినన్ కదిసి గొబ్బున గోజన రక్షణార్థమై
గిరి నొక కేల ఎత్తెనట కృష్ణుడు ఛత్రము భాతి భాస్కరా!

**భావం :** లోకులకు హితాన్ని కలిగించే పని ఎంత కష్టమైనది అయినా మంచివాడు పూనుకుంటాడు. పూర్వం రాళ్ల వర్షం కురిసినప్పుడు గోవులను, గోపాలకులనూ రక్షించటానికి కృష్ణుడు కొండనే ఎత్తి గొడుగుగా పట్టాడు.

## శ్లోకం

వ్యాయామ పుష్ట గాత్రస్య బుద్ధిస్తేజో యశోబలమ్
ప్రవర్ధన్తే మనుష్యస్య తస్మాత్ వ్యాయామ మాచరేత్

**భావం :** వ్యాయామంతో పుష్టి చెందిన శరీరం గల మనిషిలో బుద్ధి, తేజస్సు కీర్తి వర్ధిల్లుతాయి. కనుక శరీర వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| యువజన దినోత్సవం | ఆగస్ట్ 9 |
| సైన్స్ డే | జూన్ 5 |
| పర్యావరణ దినోత్సవం | ఆగస్ట్ 7 |
| చేనేత దినోత్సవం | జనవరి 12 |
| క్విట్ ఇండియా డే | ఫిబ్రవరి 28 |

జవాబులు : యువజన దినోత్సవం-జనవరి 12; సైన్స్ డే-ఫిబ్రవరి 28; చేనేత దినోత్సవం-ఆగస్ట్ 7; పర్యావరణ దినోత్సవం-జూన్ 5; క్విట్ ఇండియా డే-ఆగస్ట్ 9.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు ఆమంచర్ల గోపాలరావు



ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1907 సెప్టెంబర్ 26న జన్మించారు. చిన్ననాటి నుంచే ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో ఖద్దరు విక్రయించే కార్యకర్తగా పనిచేశారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నారు. 1969 ఫిబ్రవరి 7న మరణించారు.



వదలలేదు. కుదుతూనే ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు భల్లు వేగంగా పరుగెత్తింది. కానీ ఆ తేనెటీగలు వెంటాడుతూ వచ్చాయి. పరుగెడుతూ ఉన్న భల్లుకు ఒక సరస్సు కనిపించింది.

'హమ్మయ్య! ఇందులో దూకి ఈ తేనెటీగల నుంచి తప్పించుకుంటా! నీళ్లలోకి తేనెటీగలు రావు' అనుకుంటూ వేగంగా పరుగెత్తి దబుక్కున ఆ సరస్సులోకి దూకింది. తేనెటీగలన్నీ కాసేపు ఆ సరస్సు చుట్టూ మూగాయి.

"ఏయ్ భల్లూ! మళ్లీ మా తేనె దగ్గరకు వస్తే ఊరుకోం జాగ్రత్త" అని హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అవి వెళ్లిపోయిన తర్వాత సరస్సు నుంచి బయటకి వచ్చి, నొప్పితో మూలుగుతూ ఇంటి ముఖం పట్టింది భల్లు! ★

## జనరల్ నాలెడ్జ్

1. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
2. భారతదేశంలో ఎత్తైన ప్రాంత సరస్సు ఏది?
3. ఆస్ట్రేలియా కరెన్సీ ఏది?

జవాబులు : 1. వాషింగ్టన్ డి.సి.; 2. చోలాము (సిక్కిం); 3. డాలర్

## మెదడుకు మేత



ఆ ఇంటికి
ఈ ఇంటికి మధ్య
ఒకటే దూలం?

జవాబు : ముక్కు

## మంచిమాట




మిత్రుడు ఆనందంగా ఉన్నప్పుడు ఆహ్వానిస్తే వెళ్లాలి. కష్టాలలో ఉన్నప్పుడు పిలవకున్నా వెళ్లాలి.




# వారఫలాలు

10-16 ఫిబ్రవరి 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆశ్చర్యకరమైన రీతిలో కార్యక్రమాలు చేస్తారు. దూర ప్రాంతాల నుంచి కీలక సమాచారం. రావలసిన డబ్బు చేతికందుతుంది, కుటుంబంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆరోగ్య సమస్యలు తీరతాయి. ఉద్యోగులకు ఒడిదుడుకులు తొలగుతాయి. వ్యాపారాలలో అనుకున్న ప్రగతి. రాజకీయ వర్గాలకు పదవులు. 12,13 తేదీల్లో ధననష్టం. కుటుంబంలో చికాకులు. శ్రీ ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదుర్కొంటారు. కోర్టు కేసులు కొంత చికాకు పరుస్తాయి. విలువైన వస్తువులు జాగ్రత్త. రుణ యత్నాలు సాగిస్తారు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలు సామాన్యస్థితి. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు వాయిదా. క్రీడాకారులు, వైద్యుల కృషి నిరుపయోగం కాగలదు. 13,14 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. చర్చల్లో పురోగతి. శ్రీ మేధా దక్షిణామూర్తి స్తుతి మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కొత్త విషయాలు తెలుసుకుంటారు. సేవాకార్యక్రమాల్లలో పాల్గొంటారు. వాహనసౌఖ్యం. ఆశించినంత ఆదాయం సమకూరుతుంది. కుటుంబంలో చికాకుల నుంచి బయటపడతారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు కొత్త అవకాశాలు రావచ్చు, కళాకారులకు ఆహ్వానాలు. పారిశ్రామికవేత్తలు, రచయితల యత్నాలలో పురోగతి. 15,16 తేదీల్లో బాధ్యతలు పెరుగుతాయి. శ్రీ గురుదత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

అనుకున్న కార్యకమాలు సకాలంలో పూర్తి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు వింటారు. దేవాలయాలు సందర్శిస్తారు. రావలసిన డబ్బు అందుతుంది. కుటుంబసభ్యులతో వివాదాలు సర్దుబాటు. వ్యాపారులకు కొత్త ఆశలు. ఉద్యోగులకు పైస్థాయి నుంచి ప్రశంసలు. రాజకీయవర్గాలకు విదేశీయానం. సాంకేతిక రంగాల వారికి అవకాశాలు. 10,11 తేదీల్లో దూరప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీ నృసింహస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ప్రముఖుల నుంచి అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఆస్తి వివాదాలు కొలిక్కివచ్చే సమయం. రాబడి ఆశాజనకం. కుటుంబసభ్యులతో సఖ్యత. వ్యాపారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగులకు విధుల్లో అనుకూలం. కళాకారులకు శుభవర్తమానాలు. రచయితలు, వ్యవసాయదారులకు అనుకూలం. 13,14 తేదీల్లో ఖర్చులు. స్నేహితులతో తగాదాలు. శ్రీ భువనేశ్వరీదేవి స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలలో విజయం. శుభకార్యాలకు హాజరవుతారు. జీవితాశయం నెరవేరుతుంది. ఆస్తి వివాదాల పరిష్కారం. దేవాలయాలు సందర్శిస్తారు. కుటుంబంలో అనుకూల వాతావరణం. ఉద్యోగులకు పారిశ్రామికవేత్తలకు నూతనోత్సాహం. సాంకేతిక రంగం వారు, వైద్యులకు ఉత్సాహవంతంగా గడుస్తుంది. 11,12 తేదీల్లో ఖర్చులు. మానసిక ఆందోళన. శ్రీ వారాహీ స్తోత్రం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ప్రముఖుల నుంచి సహాయసహకారాలు అందుతాయి. దేవాలయ దర్శనాలు. ఆర్థిక ఇబ్బందులు తొలగి ఊపిరిపీల్చుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలు క్రమేపీ అనుకూలిస్తాయి. వైద్యులకు ఊహించని పిలుపు. 10,11తేదీల్లో ఆస్తి వివాదాలు. స్నేహితులతో కలహాలు. అనారోగ్యం. శ్రీ దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొత్త ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. అందరిలోనూ గౌరవమర్యాదలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. రావలసిన బాకీలు అందుతాయి. విద్యార్థులకు శుభవర్తమానాలు. కుటుంబసమస్యలు కొలిక్కివస్తాయి. వ్యాపారాలలో అనుకున్న లాభాలు. ఉద్యోగాలు ఆశాజనకం. 10,11 తేదీల్లో ఖర్చులు. శ్రీ ఆంజనేయ దండకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

పరిచయాలు పెరుగుతాయి. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. కుటుంబంలో సంతోషకరంగా గడుపుతారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు రావచ్చు. కళాకారులకు కొన్ని చేజారిన అవకాశాలు దక్కుతాయి. రచయిత లకు శుభవర్తమానాలు. 14,15 తేదీల్లో దూర ప్రయాణాలు. స్నేహితులతో తగాదాలు. శ్రీ అన్నపూర్ణాదేవి స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆలోచనలు కలిసివస్తాయి. కాంట్రాక్టులు పొందుతారు. రావలసిన సొమ్ము అందుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వాహనయోగం. దేవాలయాల సందర్శన. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు కీలక సమాచారం. పారిశ్రామికవేత్తలకు లైసెన్సులు, అనుమతులు రాగలవు. రచయితలు, కళాకారులకు సత్కారాలు. 15,16 తేదీల్లో వృథా ఖర్చులు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.


**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. నిరుద్యోగుల కృషి ఫలిస్తుంది. కొన్ని కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణాలు చేపడతారు. ఉద్యోగాలలో కొత్త ఆశలు. రాజకీయవేత్తలకు చిక్కులు తొలగుతాయి. 11,12 తేదీల్లో అనుకోని ఖర్చులు. మానసిక అశాంతి. ఆరోగ్య సమస్యలు. శ్రీ కాలభైరవాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. విద్యార్థులు అనుకున్న ఫలితాలు పొందుతారు. జీవిత భాగస్వామి ద్వారా ఆస్తిలాభ సూచనలు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు అందుకుంటారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగి ఉపశమనం పొందుతారు. కళాకారులకు సత్కారాలు, వైద్యులు, క్రీడాకారులకు విదేశీ పర్యటనలు. 12,13 తేదీల్లో. దూరప్రయాణాలు. శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం - 500



## ఆధారాలు

**అడ్డం**

1) మొదట (3)
4) కొడుకు (4)
6) శివం, దేవతావేశం (3)
8) అనుకున్నట్లుగా, సక్రమంగా (4)
10) రాత్రి (3)
12) ఉత్తరాంధ్రలోని అతిచల్లని ప్రదేశం (4)
14) చంటి పిల్లల తలకు పూసే నూనె, కొద్దిగా తాగుతారు కూడా (3)
16) త్రిమూర్తి స్వరూపుడు (5)
18) సమయం (2)
19) కాకిముక్కుకి … అని సామెత (4)
21) అయోధ్య ఈ నది ఒడ్డున ఉన్నది (3)
22) పోటీలు/పోరాటం జరిగే చోటు (2)
23) ఒకరికొకరు సరిపోయే జంటను వ్యంగ్యంగా ఇలా అంటారు (7)
25) బాధతో చేసే అరుపు (1)

**నిలువు**

1) అధిక జనసమ్మర్దం ఉన్నప్పుడు ఒకరినొకరు తోసుకునే పరిస్థితి (5)
2) గొడవ (3)
3) పైన పూసేది పైకి (2)
4) తలకిందులైన బొక్క (2)
5) రామాయణ సంబంధమైన పక్షి పైకొచ్చింది (3)
7) యాదాద్రిలో కొలువైన దేవుడు (5)
9) బావులలో పడిన వస్తువులను తీసే సాధనం (2)
11) ఒక పనిని సాధించడానికై చేసే అరుపు (3)
13) జాడ, ఆచూకీ (2)
15) ముద్దు, సరసత (3)
16) మందపాటి (4)
17) శ్రీరాముని యుగం (4)
19) చోరీ (4)
20) స్నేహితుడు పైకొచ్చాడు (4)
22) కంఠస్థం, ఇటుక/ సున్నం మొదలైనవాటి ఆవం (2)
24) శక్యం, జీవితకాలం (2)

## పదరసం - 499 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ[1] | డం | ట[2] | రం | | కూ[3] | | | నం[4] | ది |
| ద | | డ | | ఆ[5] | న | ప[6] | కా | య | |
| రా[7] | య | బా | రం | | | రి | | మ[8] | సి |
| బా | | న | | ఆ[9] | షా | ఢ | మా | సం | |
| ద | | లం[10] | ప | టం | | వి | | | స[11] |
| రా[12] | పో[13] | | | బాం | | ల్లు[14] | వి[15] | రి | హ |
| | తిం[16] | గ | ర[17] | బు | చ్చి[18] | | రా | | వా |
| | తు | | బా | | గు[19] | రు | జి | | సం |
| వ[20] | డి | సె | ల | | చ్చి | | ల్లు[21] | జ[22] | |
| త్తి | | | సా[23] | డి | గు | బ | | త[24] | ప్పు |

సినిమా



# పద్మ పురస్కారాలు – కినుకలు... కలతలు...

**పద్మ అవార్డుల ప్రకటన వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ కొందరు, విమర్శిస్తూ కొందరు మాట్లాడటం ఎప్పటి నుంచో ఉన్నదే! కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వచ్చిన విమర్శలతో పోల్చితే... ఇప్పటి విమర్శలు చాలా తక్కువ. మట్టిలోని మాణిక్యాలను వెతికి, వారి ప్రతిభకు గుర్తింపుగా పద్మ అవార్డులను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుండటంతో వాటికి ఎంపికైన వారిని ఎవరూ విమర్శించలేని పరిస్థితి నెలకొంది. తాము ఆశించిన వారికి రాలేదనే అక్కసు, ఆశించిన స్థాయిలో తమ రాష్ట్రానికి అవార్డులు దక్కలేదనే బాధను వెళ్లగక్కడం మినహా వేరే విమర్శలు రావడం లేదు. ఈసారి మాత్రం పద్మ అవార్డుల ప్రకటన తర్వాత ఆసక్తికరమైన సంఘటనలు కొన్ని చోటు చేసుకున్నాయి.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అది బాలకృష్ణ అభిమానులకు ఆనందాన్ని కలిగించే వార్త. ఎందుకంటే...ఆయన గత ఏడాది(2024)తో నట స్వర్ణోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. 1974లో 'తాతమ్మ కల' సినిమాతో నటుడిగా ప్రస్థానం మొదలు పెట్టి అప్రతిహతంగా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. తెలుగులో బాలకృష్ణ తరహాలో ఇలా సుదీర్ఘకాలం అగ్రస్థానంలో నటుడిగా కొనసాగిన నటవారసులు మరొకరు లేరు. అలానే రాజకీయంగానూ హిందూపురం శాసనసభ నియోజవర్గం నుంచి వరుసగా మూడోసారి గెలిచి రికార్డ్ సృష్టించారు. ఇలాంటి సమయంలో బాలకృష్ణకు పద్మభూషణ్ రావడం అభిమానులకు ఆనందాన్ని కలిగించింది. ఇదే సమయంలో రెండు రకాలుగా కొందరు బాలకృష్ణ అభిమానులు అసంతృప్తిని వ్యక్తం చేయడం కూడా కనిపించింది.


తెలుగునాట చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ సీనియర్ హీరోలుగా ఉన్నారు. ఇందులో చిరంజీవి ఇటు సినిమాల్లోనే కాకుండా అటు రాజకీయాలలోకి వెళ్లారు. అక్కడ ఆశించిన స్థాయిలో ప్రజాదరణ దక్కకపోవడంతో యూ టర్న్ తీసుకుని తిరిగి నటన మీద దృష్టి పెట్టారు. ఆయనకు పద్మభూషణ్‌తో పాటు పద్మవిభూషణ్ వచ్చింది. ఆయనకు సమకాలీనుడు, రాజకీయంగానూ తనదైన ముద్ర వేసిన బాలకృష్ణకు కూడా పద్మభూషణ్ కాకుండా పద్మవిభూషణ్ వచ్చి ఉంటే బాగుండేదని కొందరు అభిప్రాయపడ్డారు. ఇది బాలకృష్ణ అభిమానుల మనోగతం కాగా, నందమూరి అభిమానులు బాలకృష్ణకు పద్మభూషణ్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, మహానటుడు, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావుకు భారతరత్న ప్రకటిస్తారని ఆశించిన సమయంలో ఆయన తనయుడికి పద్మభూషణ్‌తో కేంద్రం చేతులు దులుపుకుందని కినుక వహించారు. బాలకృష్ణ తన పురస్కారాన్ని గౌరవంగా తిరస్కరించి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఉన్న బాలకృష్ణ, తండ్రి సాకుతో అవార్డును తిరస్కరించే సాహసం ఎలా చేస్తారంటూ మరికొందరు సమాధాన పడ్డారు. బహుశా దీనికి సమాధానంగానే కావచ్చు... బాలకృష్ణ ఇటీవల 'అవార్డులు తనకు కొత్తగా వన్నె తెచ్చిపెట్టవని, అవార్డులకే తాను వన్నె' అనే భావనతో కొన్ని చోట్ల ప్రకటనలు చేశారు. తన తండ్రికి భారతరత్న ఇచ్చి ఉంటే మరింతగా సంతోషించేవాడినని, ఆ దిశగా ఆలోచన చేయాల్సిందిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడాన్ని వైరివర్గం కూడా విమర్శలకు ఉపయోగించుకుంది. సోషల్ మీడియాపై ఎవరికీ అదుపులేకపోవడంతో ఎవరికి తోచిన విధంగా దారుణమైన విమర్శలకు ఒడిగడుతున్నారు. భారతరత్న ఎన్టీఆర్ కాలిగోటితో సమానం అంటూ గతంలో బాలకృష్ణ అన్న మాటలను, సినిమా హీరోయిన్ల పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. అందుకే బాలకృష్ణ 'నవ్వే వాళ్లనవ్వనీ, ఏడ్చే వాళ్ల ఏడవనీ' అంటూ తన సినిమాలోని పాటనే ఉదహరిస్తూ.... వీటన్నింటికీ అతీతంగా తన పని తాను చేసుకు పోతానని స్పష్టం చేశారు.

ఇదిలా ఉంటే... పద్మ అవార్డుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాపోయారు. ఆయన పంపిన పేర్లను కేంద్రం పరిశీలించలేదని అన్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ గద్దర్‌కు ఇవ్వకపోవడం ఆయనకు మనస్తాపాన్ని కలిగించినట్టుగా చెప్పారు. బహుశా గద్దర్‌కు ఇవ్వకపోవడం కంటే... మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఇవ్వడం రేవంత్‌కు నచ్చి ఉండకపోవచ్చు. ఇదే సమయంలో గద్దర్ పేరును సిఫార్స్ చేయడమే కరెక్ట్ కాదంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. వేలాదిమంది యువకులను తప్పుదోవ పట్టించి, దేశానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సహకరించిన గద్దర్‌కు బరాబర్ పద్మ అవార్డు ఇవ్వబోమని తెగేసి చెప్పారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు ప్రతి విమర్శలు చేశారు.

ఈ నేపథ్యంలోనే జనవరి 31న గద్దర్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా జరిపింది. ఇప్పటికే గద్దర్ కుమార్తె వెన్నెలకు ప్రభుత్వ పదవిని కట్టబెట్టిన రేవంత్ రెడ్డి, రాబోయే కొద్ది నెలల్లో పట్టుదల కోసమైనా గద్దర్ సినిమా అవార్డులను నిర్వహించే ఆస్కారం లేకపోలేదు. గద్దర్‌ను కేంద్రం నిర్లక్ష్యం చేసినా... తాము నెత్తిన పెట్టుకుని తీరతామని రేవంత్ చెప్పాలనుకుంటున్నారు. నిజంగా గద్దర్ మీద అభిమానంతోనే రేవంత్ ఇలా చేస్తున్నారా? లేక దీని వెనుక రాజకీయ ఎత్తుగడలు, కుల సమీకరణాలు ఉన్నాయా? అనేది విజ్ఞులు అర్థం చేసుకోగలరు!

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్


తపస్
ఉమ్మడి నల్గొండ - వరంగల్ - ఖమ్మం శాసనమండలి ఉపాధ్యాయ
నియోజకవర్గం MLC గా TPUS మద్ధతుతో పోటిచేస్తున్న BJP అభ్యర్థి
1
పులి సరోత్తమ్ రెడ్డి గారికి
మొదటి ప్రాధాన్యత ఓటు వేసి
అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని మనవి
సంఘ బాధ్యునిగా గతంలో సమస్యల సాధనకు ప్రాతినిధ్యం చేసిన తీరును,
ఉద్యమాలు చేపట్టిన చరిత్రను గుర్తు చేసుకోవాలని, ప్రస్థుత బాధ్యులు పాలక పార్టీలకు మారి
సంతుష్టీకరణ కార్యక్రమాలు చేస్తున్న విధానాలు గమనించాలని,
భవిష్యత్తులో విద్యారంగ, అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలను శాసన మండళిలో వినిపించి
వాటి సాధన కృషి చేయడానికి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ
అధ్యాపకులందరికి విజ్ఞప్తి చేస్తు, మార్చి 2025 లో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో
నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపించాలని ప్రార్థన.
విద్యారంగాన్ని కాపాడుకుందాం. ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందించుకుందాం.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 16

తపస్



# మల్క కొమరయ్య

ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్ - ఆదిలాబాద్
ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థి

1

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి
అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని మనవి

# TPUS

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)

(అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ABRSM) న్యూఢిల్లీ అనుబంధం)